ముక్కు తిమ్మనార్య ముద్దు పలుకు

పారిజాతాపహరణము



వచనానువాదము

పులిపాక వేంకటలక్ష్మీకాంతరావు

పారిజాతాపహరణము

(వచనానువాదము)

తెలుగులోని పంచమహాకావ్యాలలో 'పారిజాతాపహరణము' ఒకటి. తెలుగు ప్రబంధాలలో మొదటి ప్రబంధంగా దీనిని పరిగణిస్తారు. సరళమైన ఇతివృత్తము, అందమైన భాష, మళ్ళీ మళ్ళీ గుర్తుకువచ్చే వర్ణనలతో ఉన్న ఈ అవశ్యపఠనీయకావ్యానికి తేలిక తెలుగు అనువాదమే ఈ పుస్తకము.

మీరు చిన్నప్పుడు ఈ కావ్యంలోని పద్యాలను పాఠంగా చదువుకొని, పువ్వు మార్కు పద్యాలను భట్టీ పట్టి పరీక్షలయ్యాక మరిచిపోయారా? మొత్తం కథ ఏమిటో సరిగా గుర్తుకు లేదా? అయితే, ఈ పుస్తకం మీ కోసమే.

మీరు పారిజాతాపహరణం పేరు మాత్రమే విని ఉన్నారా? పద్యాలూ, అవీ మీ వల్ల కాదని ఇక పట్టించుకోకుండా వదిలేసారా? అయితే, ఈ పుస్తకము మీ కోసం కూడా.

మూలగ్రంథాన్ని చదవలేనివారికి అందులోని సొగసులను తేట తెలుగులో తెలియజేస్తుంది ఈ పుస్తకం. మూలం చదివే ప్రయత్నం చేయాలని మా ఆకాంక్ష. చేస్తారని మా ఆశ...

ఆలస్యం ఎందుకు? పుస్తకం మీ చేతుల్లో ఉన్నది. సత్కాలక్షేపానికి స్వాగతం.

సంస్కృతసంస్కృతి ప్రచురణ-1 వెల: ₹100

సంస్కృతసంస్కృతీ ప్రచురణలు-1

ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకు

పారిజాతాపహరణం

వచనానువాదం

అనువాదకులు

శ్రీ పులిపాక వేంకట లక్ష్మీకాంతరావు

సంస్కృతసంస్కృతీ ప్రచురణలు

తొలిపుష్పం

2023

ముక్కు తిమ్మనార్యుని ముద్దు పలుకు

పారిజాతాపహరణం

(వచనానువాదము)

సంస్కృతసంస్కృతీ ప్రచురణలు-1

అనువాదకులు

శ్రీ పులిపాక వేంకట లక్ష్మీకాంతరావు

సంస్కృతసంస్కృతీ ప్రచురణలు

తొలిపుష్పం, 2023

మూల్యం- 100 రూపాయలు

ప్రతులకు-

సంకా ఉషారాణి (usha.sanka@gmail.com)

ఉరుపుటూరి శ్రీనివాస్ (schary.vuruputuri@gmail.com; 98859 19398)

నా మాట

'తెలుగు వెలుగు' అనే ఒక వాట్సాప్ (WhatsApp) సాహితీబృందంలో నేను సభ్యుడిని. తెలుగులో ఉన్న ప్రాచీనకావ్యాలను చదవాలని చాలామందికి కోరిక ఉంటుంది. అవి పద్యరూపంలో ఉండటం వలన అందరికీ కొరుకుడు పడవు. వాటిని చదివి ఆనందించాలంటే అవి సరళమైన తెలుగు వచనంలో ఉండాలి. ఆ లక్ష్యంతో నేను నంది (ముక్కు) తిమ్మనార్యుడు రచించిన పారిజాతాపహరణం పద్యకావ్యాన్ని సరళమైన తెలుగు వచనంలో వ్రాయ పూనుకున్నాను. అందుకు శ్రీయుతులు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ గారి లఘుటీకను అనుసరించాను. వారు వ్రాసినదాని-కన్నా సరళంగా వ్రాయలేక వారి వాక్యాలనే చాలా చోట్ల యథాతథంగా వ్రాశాను. లాభాపేక్ష లేకుండా చేస్తున్న పని కావున వారు క్షమిస్తారనే భావిస్తూ వారికి అనేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

కావ్యంలో చివరగా వచ్చే బంధకవిత్వపు వివరణల కోసం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన పారిజాతాపహరణము పుస్తకం-లోని బొమ్మలను వాడుకున్నాము. వారికి మా కృతజ్ఞతలు.

ఈ రచన చేయడానికి నన్ను అన్ని విధాలుగా ప్రోత్సహించిన మా తెలుగు వెలుగు బృంద సంచాలకులు శ్రీ మాదిరాజు శ్రీరంగశేషశాయి గారికి ధన్యవాదాలు. శ్రీకృష్ణదేవుడి అనుగ్రహం వల్ల ఈ కార్యం విజయవంతం అయ్యింది. దీనిని ఆదరించి, ప్రోత్సహించి, ఆనందించిన 'తెలుగు వెలుగు' బృందం సభ్యులందరికీ ధన్యవాదాలు.

నిజానికి ఈ వచనానువాదాన్ని వాట్సాప్ బృందానికి మాత్రమే పరిమితం చేద్దాము అనుకున్నాను. కాని ఇది పదిమందికి ఉపయోగపడాలి

అని చిరంజీవి సంకా ఉషారాణి, ఇంకా ఉరుపుటూరి శ్రీనివాసు సంకల్పించారు. వారు గీర్వాణసరస్వతికి ఇతోధికంగా సేవ చేస్తూ, తెలుగులో ఉన్న ప్రాచీనకావ్యాలను వచనరూపంలో ప్రకటించాలని ఆశిస్తున్నారు. వారిరువురకూ ఈ సేవలో భగవంతుడు అన్నివిధాలా శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను.

టంకనదోషాలను పరిశీలించి సవరణలను సూచించిన ఆయలూరు మురళిగారికి, ప్రభల సుందరరావుగారికి నా కృతజ్ఞతలు

ఇట్లు

పులిపాక వేంకట లక్ష్మీకాంతరావు

శ్రీవేంకటేశ్వరుని చరణకమలాలకు

భక్తిపూర్వకంగా

అంకితం

విషయసూచిక

ఓం శ్రీ గణేశాయ నమః

శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యోనమః

ముక్కు తిమ్మనార్యుని ముద్దు పలుకు

పారిజాతాపహరణం

అవతారిక

ఇష్టదేవతాస్తుతి

లక్ష్మీదేవికి ప్రియం కలిగేలా శ్రీమహావిష్ణువు కౌస్తుభమణిమాలను ధరించాడట. అది విష్ణువక్షస్థలనివాసినియైన లక్ష్మీదేవికి ఉయ్యాల వలె ఉన్నదట. అటువంటి మణిని వైజయంతీమాలతో ధరించి కన్నుల పండుగ చేస్తున్న విష్ణుమూర్తి నరసింహకృష్ణరాయడిని కృతార్థుడిని చేయాలని తిమ్మన ప్రార్థించాడు.

శివపార్వతుల కల్యాణం. పార్వతీదేవిని, స్త్రీలు కౌగిలిలో గుచ్చి, ఎత్తి, శివుడిపై తలంబ్రాలను పోయిస్తూ ఉన్నారుట. అప్పుడు పార్వతి శివుని తలపై ఉన్న గంగలో తన ప్రతిబింబాన్ని చూసి మరొక స్త్రీయేమోనని తలచి

అసూయపడుతుంటే, చూసి ముసిముసిగా నవ్వుకుంటున్న చంద్ర-శేఖరుడు కృష్ణరాయనికి మహదైశ్వర్యాలను గూర్చు గాక అని ప్రార్థించాడు కవి.

అలాగే - విఘ్నేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ, గుణసముద్రుడైన కృష్ణరాయనికి తన దంతాగ్రములచేత తీక్షణమైన బుద్ధి, ఎత్తుగా ఉన్న కుంభస్థలంచేత ఔన్నత్యము, దానము అనే మదజలపు ప్రకాశముచేత ఉత్సాహం, పొడవైన తొండముచేత దీర్ఘాయువును, ఏనుగు ముఖముగల దేవుడు కృపగల మనస్సుతో ఇచ్చుగాక అని కోరాడు.

ఇంకా - ప్రణయకలహంలో ఇందిరాదేవి అలుకను తీరుస్తున్న దృశ్యం. శార్ఙ్గమనే ధనువును, సుదర్శనచక్రాన్ని, నందకఖడ్గాన్ని, పాంచజన్యమనే శంఖాన్ని ధరించి ప్రకాశించే శ్రీహరి నాలుగు చేతులు ఆమె నడుముపై, మొలపై, మెడపై, జడపై తాకుతుంటే నిత్యం సుఖసముద్రంలో తేలిపోయే శ్రీ మహాలక్ష్మీదేవి, కృష్ణదేవరాయమహారాజును కృపాదృష్టితో చూచుగాక అని వేడుకుంటున్నాడు నంది తిమ్మన.

తరువాత - సరస్వతీదేవి తన కంఠస్వరంతో వీణను మేళవించి పాడుతున్నదట. తన పాటకు తగినట్లు మ్రోగమని చివుళ్ళవంటి తన గోళ్ళతో ఆ వీణను చెక్కుతూ నేర్పుతున్నట్లున్నది. ఆ విధంగా పాడుతున్న వాణి కృష్ణదేవరాయని ప్రతిభాశాలిని చేయు గాక అని ప్రార్థించాడు కవి.

ఇంకా – మంచుకొండయొక్క అల్లుడి తలలోని పూలగుత్తి, దేవతలకు అమృతమనే ఆహారాన్ని ఇచ్చే జీవగఱ్ఱ, తరగని చలువల నిధి, వెన్నెలలను

మొలిపించే పాదు, పాలసముద్రపు ముద్దుల కొడుకు అయిన చంద్రుడు కరుణారసం ఒలికే చూపులతో కృష్ణదేవరాయని చూచుగాక, అని కృతిపతి అయిన కృష్ణదేవరాయని వంశపు మూలపురుషుడిని ప్రార్థించాడు.

కృతిపతి వంశవర్ణన

చంద్రుడికి బుధుడు పుత్రుడు; బుధుడికి పురూరవుడు పుత్రుడు; అతనికి ఆయువు పుత్రుడు. కీర్తిమంతుడైన ఆ ఆయువుకు నహుషుడు పుట్టి, భూమిని పరిపాలించాడు. అతనికి యయాతి పుట్టాడు. ఆ యయాతి యుద్ధవిశారదుడైన తుర్వసుణ్ణి కన్నాడు. రాజలోకానికి శిరస్సువంటి ఆ తుర్వసుడి వంశంలో దుష్టశత్రువుల వారింపరాని భుజగర్వాన్ని నశింపజేసే రాజు ఈశ్వరుడనేవాడు పుట్టాడు[1]. ఇలలోని ఈ ఈశ్వరుడికి కైలాసంలోని ఈశ్వరుడు ఏ రకంగానూ సాటి రాడు. ఎలాగంటే - తుర్వసువంశంలో పుట్టిన ఈ ఈశ్వరుడనే రాజుకు తామసం లేదు. శివుడేమో తామసస్వభావి. ఈశ్వరరాజుకు ఎప్పుడూ కోపం రాదు. శివుడికి ఉగ్రుడని పేరు కదా. ఈశ్వరుడు పౌరుషమున్నవాడు. శివుడు అర్ధనారీశ్వరుడు. ఈశ్వరరాజుకు పైన పెత్తనం చేసేందుకు వేరే రాజు లేడు. శివుడి తలపైన రాజు (చంద్రుడు) ఉంటాడు కదా! యుద్ధంలో

[1] తుర్వసుడి దాకా వచ్చే చంద్రవంశం మహాభారతాది గ్రంథాలలోనిదే. ఈశ్వరుడు/ఈశ్వరనాయకుడు తుళువంశము వాడు. సాళువ నరసింహరాయలవద్ద సేనాధిపతిగా పని చేసాడు.

నరుడెవ్వడూ ఈ ఈశ్వరుడిని బాధింపజాలడు. మరి శివుడిని? నరుడు (అర్జునుడు) పాశుపతాస్త్రం కోసం తపస్సు చేస్తుండగా, శివుడు మాయాకిరాతుడి వేషంలో వచ్చి అర్జునుడి చేత ఓడిపోయాడు.

ఆ ఈశ్వరుడి కొడుకు తిమ్మయ్య. అలనాడు పరశురాముడు రాజుల నెత్తుటితో రెండున్నూ మూడు అంటే ఐదు మడుగులే[2] నింపాడు. కానీ తిమ్మయ్య కందుకూరు వద్ద బెడందకోట యవనులతో (బీదర్ బహుమనీ సుల్తానులతో) యుద్ధం చేసి, రక్తపు నదులే ప్రవహింపజేశాడు. ఆ తిమ్మయ్యకు గౌరీదేవికి సాటియైన అతని ప్రాణేశ్వరి లక్కాంబికకు లోకయశస్సును పొందిన నరసరాజు పుట్టాడు.

దిగంతాలలోనున్న కులపర్వతాలే ఆ నరసరాజు కీర్తిని, విజయాలను తెలియజేసే జయస్తంభాలు. కళింగదేశపు రాజు చేత, యవనాధీశుల చేత మరెందరో రాజుల చేత కప్పం కట్టించుకున్నాడు. తులాపూరుషం[3] అనే మహాదానాన్ని చేసిన నిత్యదానైకశీలి. శాశ్వతమైన అతడి కీర్తిని స్వర్గంలోని అప్సరసలు, పాతాళంలోని నాగకన్యలు ఎప్పుడూ గానం చేస్తూ ఉంటారు. భూమండలానికి అద్దము వంటి విజయనగరముయొక్క భద్ర-సింహాసనమునధిష్ఠించి ఎల్లప్పుడూ ప్రజ్వరిల్లే ప్రతాపంతో వెలుగొందాడు.

[2] 21 సార్లు క్షత్రియులను నిర్మూలించాక పరశురాముడు ఆ రక్తంతో కురుక్షేత్రం వద్ద ఐదు మడుగులను ఏర్పరచాడట. శ్యమంతపంచకం అని పిలుస్తారు ఈ మడుగులను.

[3] తులాపూరుషము = త్రాసులో తన బరువుకు సరిపడా బంగారమూ, వెండీ తూచి పాత్రులకు దానం చేయడం.

ఈ నరసరాజు కుంతలేశ్వరుడు చిక్కులలో ఉన్నప్పుడు విద్యాపురాన్ని [4] ఆక్రమించాడు. మానవదుర్గం [5] నుండి పారసీకులను తొలగించాడు. చోళరాజుకు దేవవేశ్యల మధుర అధరామృతాన్ని రుచిచూపి మధురను జయించాడు. ఖడ్గవిద్యను ప్రదర్శించి శ్రీరంగపట్టణాన్ని గెలిచాడు.

విష్ణుమూర్తికి శ్రీదేవి, భూదేవి వలె, అతడికి తిప్పాంబ, నాగాంబ అని ఇద్దరు భార్యలు. వారిలో తిప్పాంబకు వీరనరసింహరాయలు పుట్టి రాజ్యం చేశాడు. ఆ వీరనరసింహరాయల తరువాత…

కృతిపతి శౌర్యప్రతాపములు

నాగాంబాసుతుడైన శ్రీకృష్ణదేవరాయలు రాజై విరోధులు అడవుల వెంట, కొండల వెంట పారిపోయేలా చేశాడు.

కృష్ణరాయలను శ్రీకృష్ణుడితో పోలుస్తూ నంది తిమ్మన ఇలా పొగిడాడు: శ్రీకృష్ణుడు యదుకులంలో పుట్టడంవల్ల సింహాసనస్థుడు

[4] ఈ విద్యాపురము ఇప్పటి బీజాపూర్ అని అన్నారు నాగపూడి కుప్పుస్వామిగారు తమ పరిమళోల్లాసవ్యాఖ్యలో; అయితే విద్యాపురము విజయనగరమే. (చూ. కుందూరి ఈశ్వరదత్తుగారి 'ప్రాచీనాంధ్రచారిత్రికభూగోళము' 88వపుట.) చిక్కులలో పడిన కుంతలేశ్వరుడు ఇమ్మడి నరసింహరాయలు అయి ఉండాలి (చూ. కె.ఎ.నీలకంఠశాస్త్రిగారి 'History of South India' – 264-5 పుటలు).

[5] మాన్వి –బీజాపూరు దగ్గర ఒక కోట (చూ. ఎస్.కృష్ణస్వామి అయ్యంగార్ గారి 'Sources of Vijayanagara History' 106వ పుట)

కాలేదు కనుక[6] ఇప్పుడు ఆ కొరత తీర్చుకునేందుకు కృష్ణరాయలుగా పుట్టి సింహాసనస్థుడై ప్రకాశించాడు. అప్పుడు గొల్ల ఇల్లాండ్రతో రాసక్రీడ-లాడినవాడు ఇప్పుడు పరస్త్రీలను సోదరీమణులవలె చూస్తున్నాడు. జరాసంధుడివల్ల మధురానగరం నుండి పారిపోయాడన్న నింద-పడినందున, ఇప్పుడు తన బలాన్ని ప్రదర్శించి పరరాజుల దుర్గాలను సాధించాడు. ఆశతో పారిజాతవృక్షాన్ని తేవడంవల్ల కలిగిన అపకీర్తిని ఇప్పుడు ఔదార్యంతో తొలగించుకొంటున్నాడు. తన పూర్వజన్మలో కలిగిన లోటుపాట్లన్నింటినీ మాన్పుకోవడానికి శ్రీకృష్ణుడే మళ్ళీ అవ-తరించాడా అన్నట్లు వెలిగి పోతున్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీరంగనాథుని నాభికమలరజంకన్నా, చోళరాజుభార్య యొక్క కుచ-కుంకుమ కన్నా, సహ్యాద్రిపర్వతాల మీద కారే గైరికాది ద్రవాల కన్నా కావేరీనదీజలాలను వైరిరాజుల రక్తంతో ఎర్రగా చేశాడట శ్రీకృష్ణ-దేవరాయలు.

కృష్ణదేవరాయచక్రవర్తి పూర్వజన్మలోనూ, ఈ జన్మలోనూ ధర్మాన్ని రక్షించే విషయంలో ఒకలాగే ఉన్నాడు. భూమినేలే విషయంలోనూ,

[6] యయాతికి శర్మిష్ఠ ద్వారా కలిగిన కుమారుడు యదువు. తండ్రి అయిన యయాతికి యవ్వనం ధారపోయనందుకు యయాతిచేత శపించబడ్డాడు. అతడి వంశం వారు రాజ్యార్హతను కోల్పోయారు. కృతిపతివంశవర్ణన మొదలుపెట్టేప్పుడు ఈశ్వరనాయకుడు తుర్వసువంశం వాడని చెప్పాడు కవి. ఈశ్వరనాయకుడి మునిమనవడైన కృష్ణరాయలు యదువంశం వాడని చెప్పడం కృష్ణరాయనికి, యాదవకులస్థుడైన శ్రీకృష్ణునితో పోలికను చూపించేందుకే. అన్నట్లు తుర్వసుడు యయాతికి దేవయాని ద్వారా పుట్టాడు, యదువు శర్మిష్ఠ ద్వారా.

గోరక్షణ విషయంలోనూ ఆ ఖ్యాతి అప్పుడూ ఇప్పుడూ ఒక్కలాగే ఉందట. సాధు రక్షణ, సత్యభామాభోగాసక్తి (సత్యమునందు అనురక్తి) ఆ జన్మలోనూ, ఈ జన్మలోనూ ఒకేలా ఉందట. ఆ ఆదినారాయణుడే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడనే పేర, ఇప్పుడు శ్రీకృష్ణదేవరాయలనే పేర యాదవవంశంలో పుట్టాడట.

ఇటువంటి కీర్తిగల కృష్ణదేవరాయమహీపాలునకు, అభ్యుదయ-పరంపరాభివృద్ధిగా దీవించి తిమ్మనార్యుడు అంకితమిచ్చిన పారిజాతాప-హరణం అనే మహాప్రబంధం యొక్క కథాక్రమం ఎటువంటిది అంటే…

ప్రథమాశ్వాసము

కావ్యావతారిక

పరీక్షిన్మహారాజు కుమారుడైన జనమేజయుడు ప్రతిరోజూ హరివంశ-కథామృతాన్ని పానంచేస్తూ, తనివి తీరక వైశంపాయనమునితో ఇలా అన్నాడు - ‘‘ఓ మునివరేణ్యా! హరివంశకథలనన్నీ పూర్తిగా విని ధన్యుడి-నైనాను. ఆ దనుజవైరి దేవతలను రక్షించడానికి యదువంశంలో పుట్టాడు గదా! మరి ఆయన ఆ దేవతలకు ప్రియమూ, ఆధారమూ అయిన పారిజాతవృక్షాన్ని భూమిమీదకే విధంగా తెచ్చాడు? దేవతలు ఒప్పు-కున్నారా? లేకపోతే అధర్మానికి పాల్పడి బలవంతంగా తెచ్చాడా? నా సందేహం తీరేలా సవిస్తరంగా చెప్పు. వినాలని వేడుక కలిగింది.’’ అన్నాడు.

అప్పుడు వ్యాసభగవానుడి శిష్యుడైన వైశంపాయనుడు ఆదరంగా, “రాజా! విను”, అని ఈ విధంగా చెప్పసాగాడు -

హరి నరకాసురుని గెలిచి, వాడి ఇంట్లో ఉన్న అప్సరసల వంశం వారూ, యవ్వనం రూపుదాల్చినవారూ, తనను వరునిగా కోరుకున్నవారూ అయిన స్త్రీరత్నాలను పదహారువేల మందిని పెండ్లాడి సుఖంగా ఉన్నాడు.

వాళ్ళేకాక ఇంకా రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, సుదంత, కాళింది, లక్ష్మణ అనే ఎనిమిది మందిని అంతకుముందే

పెళ్ళాడాడు. శ్రీకృష్ణుడు ఆ లలనామణులందరితో కూడి ద్వారవతీ-నగరోద్యానవాటికలలో, కృత్రిమంగా ఏర్పరచిన కొండల దగ్గర, సముద్ర-తీరానగల పొదరిండ్లలో, నదీతీరాలలో నిర్మించిన మణిమందిరాలలో నివసిస్తూ, ఏయే వేళలలో ఏ సరోజముఖి, ఏ ప్రకారంగా కోరుతుందో, ఆయావేళల ఆ పడతితో ఆయా ప్రకారంగా ఆనందింపజేస్తూ, ఎక్కడ చూసినా తానేయై, పెక్కురూపాలతో మాయావిద్యతో అందరినీ సుఖింపజేస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఇలా భార్యలనందరినీ సమానంగా చూస్తున్నా, శ్రీకృష్ణుడు రుక్మిణీ సత్యభామల యెడల ప్రత్యేక ప్రేమాదరాలను కలిగి, చనువునిచ్చి మసలుతూ ఉంటాడు. కులరూప-గుణాలు, భర్త ప్రేమాభిమానాలు కలదాననని రుక్మిణీదేవి అనుకుంటూ ఉండగా, సత్యభామ కూడా కులరూపాలలో, మగని ప్రేమను పొందటం చేత తానే గొప్పదానను- అని అనుకుంటూ ఉంటుంది. దానివల్ల వాళ్ళిద్దరి మధ్యా ఈర్ష్యాసూయాద్వేషాలు కలిగినాయి.

ఇలా ఉండగా ఒకనాడు శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి అంతఃపురానికి వచ్చి, చంద్రకాంతశిలావేదికపైన, కొందరు లేడి కన్నుల జవరాండ్రు సేవిస్తూ ఉండగా, వినోదంగా రుక్మిణీదేవితో జూదమాడుతున్నాడు.

నారదాగమనం

అప్పుడక్కడికి నారదుడు వచ్చాడు.

సరిగమపదనిసలనే స్వరముల మాధుర్యంతో కూడిన మహతీవీణా-నాదం ఆకాశంలోనూ వాయువులలోనూ నిండగా, పావనగంగాజలాలతో నిండిన కమండులును చేత ధరించి, ప్రణవమంత్రజపము చేత పావనమైన స్ఫటికమాలను చెవులకు తగిలించుకుని, సమరసమయాన సంతోషంగా నృత్యం చేసేటప్పుడు[7] వీచేందుకు పనికొచ్చే చామరాన్ని, కక్షపాలను[8] భుజాగ్రాన ధరించి, అకాలంలో వచ్చిన వెన్నెలలా, తెల్లని దేహకాంతితో, మోక్షవృక్షపు లేచివుళ్ళేమో అన్నట్లున్న ఎర్రని జడలతో, ఆ నారదుడు ఆకస్మికంగా ఆకాశం నుండి శ్రీకృష్ణుడి దగ్గరకు వచ్చాడు.

అలా విచ్చేసిన నారదమునీంద్రుడికి శ్రీకృష్ణుడు ఎదురువచ్చి నమస్కరించి స్వాగతం చెప్పి, కల్మషం లేని భక్తితో రుక్మిణీదేవితో కలసి అతిథిమర్యాదలు చేశాడు. రుక్మిణి కనుసన్న తెలిసి, చెలికత్తెలు నారదుడికి రత్నసింహాసనాన్ని అమర్చారు. నారదుడు కూర్చున్న తరువాత ఆయన ఆజ్ఞతో కృష్ణుడు కూడా కూర్చున్నాడు. నారదుడికి చేతులు జోడించి శ్రీకృష్ణుడు, “దేవమునీంద్రా! మీరిక్కడికి రావడంవల్ల మేమందరమూ

[7] కలహభోజనుడు కదా.

[8] కక్షపాల = సన్న్యాసి చేతిసంచి

కృతార్థులమైనాము. మీరెప్పుడూ మాపైన అవ్యాజమైన కరుణను చూపిస్తున్నారు.'' అని అన్నాడు.

నారదుడు శ్రీకృష్ణుని నుతించుట

అప్పుడు ఆ దేవర్షి, "స్వామీ! నువ్వు సామాన్యమానవుడిలా ఇలా అనటం న్యాయమా! విశ్వవిఖ్యాతచరిత్రగలవాడివి, నిన్ను నేనెరుగనా?" అని ఇలా స్తుతించాడు.

నారదుడు శ్రీకృష్ణునితో, "స్వామీ! వేదాలను దొంగిలించిన దొంగ పాతాళంలో దూరగా, మత్స్యావతారంలో వెళ్ళి చంపినవాడివి నువ్వే. మందరపర్వతాన్ని వీపున మోసి, దేవతలకు అన్నం (అమృతం) తినిపించి సంతోషపరచిన కూర్మానివి నువ్వే. భూదేవి నీటిలో మునిగితే కొమ్ముతో పైకెత్తిన వరాహమూర్తివీ నువ్వే. మునిమాపువేళ స్తంభంలో పుట్టి భక్తుడైన ప్రహ్లాదుణ్ణి కాపాడిన నృసింహస్వామివి నువ్వే. బలిని పాతాళానికి తొక్కిన వామనుడివి కూడా నువ్వే. రాజుల గర్వాన్ని అణచిన పరశురాముడివి నువ్వే. దశరథరాముడిగా పుట్టి సముద్రాన్ని గెలిచినవాడివి నువ్వే. ఇప్పుడు ద్వారకలో ఉన్న నువ్వు నువ్వే. బుద్ధుడివై[9] త్రిపురాసురుల భార్యల పాతివ్రత్యాన్ని భంగపరచినవాడవు, కల్కిగా అధర్మపరులను శిక్షించి,

[9] ఇక్కడ ప్రస్తావించబడ్డ బుద్ధుడు గౌతమబుద్ధుడు కాదు, త్రిపురదహనసమయంలో శివుడికి సహాయంగా వచ్చిన విష్ణువు అవతారము.

ధర్మసంస్థాపన చేయనున్నవాడవు నీవే[10]. ఇంక నిన్ను ఎలా పొగడగలను? కృష్ణా! ద్వారకయే వైకుంఠము. రుక్మిణియే లక్ష్మీదేవి. మీరిక్కడుండటం వల్ల మిమ్మల్ని సేవించుకోవడానికి మాటి మాటికీ వస్తుంటానయ్యా ఓ కంసారీ! మురారీ! ముకుందా!" అని అనేక విధాలుగా ప్రశంసించాడు. ఆ తరువాత, మనస్సు ఆనందంతో నిండిపోయిన ఆ బ్రహ్మ మానసపుత్రుడు - తన పరిమళము చేత ఆకర్షించబడి మూగిన భృంగసమూహాలనే వంది-మాగధులు గలదీ, 'అర్హులకు ఉపయోగపడ్డా'నని ఆనందబాష్పాలను రాలుస్తున్నదా అన్నట్లు తేనె చుక్కలను స్రవిస్తున్నదీ, అపూర్వమైనదీ, అన్ని కోరికలను తీర్చేదనే కీర్తి యొక్క తెల్లని కాంతితో ఆవరించబడినట్లు ప్రకాశిస్తూ ఉన్నదీ, మిన్నేటి తామరలలో ఒకదాని ఆకులో చుట్టి తీసుకొని వచ్చినదీ అయిన - పారిజాతపుష్పాన్ని జాగ్రత్తగా తీసి కృష్ణుడికి ఇచ్చాడు. మాధవుడు తన మనసులో వినయమూ, విస్మయమూ ఒకదానితో ఒకటి కలగలుపులవుతుండగా, ఆ పుష్పాన్ని స్వీకరించాడు.

పక్కనే ఉన్న రుక్మిణీదేవిని చూశాడు కృష్ణుడు. అతడి మనసులో సత్యభామ మెదిలింది. 'ఈ పుష్పాన్ని రుక్మిణికి ఇస్తే, సత్యభామకు కోపం వస్తుంది. ఏమనుకుంటుందో! పోనీ దీనిని ప్రేమతో సత్యభామకు పంపితే రుక్మిణీదేవి తనను అవమానించినట్లు భావించవచ్చు. అయినా నేను ఇక్కడ ఉన్నాను కనుక దీనిని వేరే ఎవరికి పంపినా బాగుండదు',

[10] ఈ కథాసమయానికి (ఇప్పటికీ) కల్క్యవతారం జరగలేదు. కానీ నారదుడు త్రికాలజ్ఞుడు కదా! అన్నట్లు, ఈ జాబితాలో బలరాముడు లేడని గమనించారా?

అనుకుంటూ నవ్వుతున్న కళ్ళతో, నారదుడి కనుసైగను గ్రహించి, ఆ పారిజాతపుష్పాన్ని రుక్మిణికే ఇచ్చాడు. రుక్మిణి ఆ పుష్పాన్ని గ్రహించి, మునీంద్రుడికి నమస్కరించి, దానిని తన కొప్పులో తురుముకొన్నది. అప్పుడు ఆమె నెలవంకను తలదాల్చిన మంచుకొండ కూతురు అయిన పార్వతీదేవిలా మోహనమైన కాంతితో వెలిగిపోయింది. గండుమీనులను వెక్కిరించి నవ్వే ఆమె వాలుకన్నులు వింత కాంతితో మెరిసిపోయినాయి. చక్రవాకపక్షులను ధిక్కరించే ఆమె చనుదోయికొక వింత ఛాయ వచ్చింది. తుమ్మెదల బారును లెక్కచెయ్యని నల్లని అందమైన ఆమె శిరోజాలకు ఒక వింత నైగనిగ్యం కలిగింది. చెంగలువల విందు అయిన చంద్రకాంతులను విరజిమ్మే ఆమె ముఖానికి ఒక వింత జిగి కలిగింది. ఆ పుష్పాన్ని ధరించడం వల్ల ఆమెకు చక్కదనానికే ఒక వింత చక్కదనము, యవ్వనానికే ఒక వింత యవ్వనమూ, విభ్రమానికే ఒక వింత విభ్రమమూ కలిగినాయి. కోకిల కంఠము గల ఆ రుక్మిణీదేవి ఈవిధంగా పులుగడిగిన ముత్యంలా వెలుగు-తుంటే, చిరునవ్వుతో కలహభోజనుడైన విరించి కొడుకిలా అన్నాడు-

నారదుడు పారిజాతప్రభావమును వర్ణించుట

"తామరలవంటి కన్నులుగల ఓ రుక్మిణీ! ఈ పారిజాతపుష్పం మానవమాత్రులకు ధరింప శక్యము కాదు. ఇంద్రాణి అయిన ఆ శచీదేవి, పార్వతి, లక్ష్మీదేవి, సరస్వతి దీనిని రోజూ తలలో పెట్టుకుంటారు. ఇప్పుడు దీనిని నీకివ్వడం వల్ల హరికి నువ్వు బహిఃప్రాణానివని తెలిసింది. నీ సౌభాగ్యానికి సాటి పదహారువేల రమణులలోనూ లేరు. నువ్వు ధరించడం

వల్ల ఈ పువ్వు సద్వినియోగమై ధన్యమైంది. ఇది కోరిన కోరికలన్నింటినీ తీరుస్తుంది. ఇంకా దీని మహిమను చెప్తాను విను -

"ఓ పద్మముఖీ! దీని పరిమళం చెడదు. ఇది వాడిపోదు. ఎప్పుడూ పరాగభరితమై, జగదేకమనోహరమై ఉంటుంది ఈ కుసుమరాజము. తుమ్మెదల గుంపు వంటి శిరోజాలు గలదానా! నువ్వూ, నీ పతీ శృంగార-కేళిలో ఉన్నప్పుడు ఇది ఉల్లాసాన్నీ, ఉత్సాహాన్నీ కలిగిస్తుంది. రతిశ్రమను, అప్పుడు స్రవించే స్వేదాన్నీ ఇది వీవనలా తొలగిస్తుందమ్మా. ఇంక అడిగితే చాలు, షడ్రసోపేతమైన భోజనాన్ని సమకూరుస్తుంది. అలసట చెందనీయదు. శుభాలను కలిగిస్తుంది. అశుభాలను తొలగిస్తుంది. అమ్మా! మూడు లోకాలలోనూ ఎక్కడా దొరకని సర్వగుణసంపన్నమైన వస్తువిది. దీనిని ధరించి నువ్వు సవతులలో మహామహిమతో వెలుగుతావు. కలువ పూరేకులవంటి కన్నులుగల ఓ రుక్మిణీ! నువ్వు ఈ పువ్వును కొప్పులో పెట్టుకుంటే నీ సవతులు వచ్చి నీ పాదాలను ఆశ్రయిస్తారు. నీ భర్త ప్రేమతో నీ మాట మీరడు. నువ్వు అంతులేని భోగభాగ్యాలతో తులదూగుతావు.

"ఓ వికసించిన కమలాల వంటి కన్నులుగల రుక్మిణీదేవీ! ఈ పూవు వేసవిలో చల్లదనమూ, చలికాలంలో వెచ్చదనాన్నీ కలిగిస్తుంది. దీని మహిమను ఎంతైనా చెప్పవచ్చును. ఈ పువ్వును తలలో ధరించి, సాటి వనితలలో తలపూవు వాడక వైభవంగా ఉండు. ఓ రుక్మిణీదేవీ! ఇన్ని రోజులూ సవతులందరిలో శ్రీహరి సత్యభామకు వశంవదుడై ఆమె కను-సన్నలలో మెలుగుతుంటాడని విన్నాం. కానీ శ్రీకృష్ణుడికి నీమీద ఉన్న ప్రేమ ఎవరి మీదా లేదు. కాకపోతే ఈ దివ్య కుసుమాన్ని నీకే ఇచ్చాడు కానీ

ఇంకెవరికైనా ఇచ్చాడా? తానే చక్కనిదానననీ, యవ్వనవతిననీ లోకంలో పేరెన్నికగలదానననీ, పతి తనకు చాలా అనుకూలుడనీ నిక్కుతూ, నీల్గుతూ ఇతర స్త్రీలను లెక్కజేయని సత్యభామ, చెలికత్తెలు ఈ వార్త చెప్తే విని అసూయతో కుళ్ళుకుంటుంది. నువ్వు ధరించినది మొదలు ఈ పువ్వు సంవత్సరం పాటు నీ తలలో ఉండి, మళ్ళీ పారిజాతవృక్షాన్ని చేరుతుంది.'' అని నారదుడు చెప్పగా విని వేరు వేరు దేవేరుల చెలికత్తెలు వారి వారి రాణులకు చెప్పగా విని వాళ్ళందరూ చిన్నబుచ్చుకున్నారు. 'అందరిలో రుక్మిణీదేవి మహిమాన్వితురాలు కావడం వల్లనే స్వామి పువ్వును ఆమెకు ఇచ్చాడు, నిజమే కదా', అని లక్షణ ఓర్చుకున్నది. కాళింది సహించింది. భద్ర శాంతించింది. కానీలే అని సుదంత ఊరడిల్లింది. జాంబవతి బాధపడటం మానివేసింది. మిత్రవింద కోపాన్ని అణుచుకున్నది.

అక్కడ - అష్టభార్యలలోనూ అభిమానవతి, సౌందర్యవతి అయిన సత్యభామ, కృష్ణుడి దగ్గరకు వెళ్ళిన తన చెలి ఇంత పొద్దుపోయినా ఇంకా రాలేదేమని అనుకుంటున్నది. తన శృంగారవనంలో క్రీడాపర్వతం పక్కన చక్కగా ఏర్పరిచిన పూల తేనె కాల్వ దగ్గర, చెంగల్వ పుప్పొడితో అలంకరించిన చంద్రకాంతశిలావేదిక పైన కూర్చుని, ఒక చెలికత్తెతో శౌరి గుణగణాలను వర్ణిస్తూ ఉన్నది. తుమ్మెదల ఝుంకారాలు, కోకిలల కూతలు వినబడుతున్నాయి. తామరకొలను నుండి కమ్మని, చల్లని గాలులు వీస్తున్నాయి. అంతటి కమనీయమైన వాతావరణంలో కూడా ఆమె మనస్సు ఎప్పటి లాగా ఆనందంగా లేదు.

సత్యభామ తన చెలికత్తెను చూసి కొంచెం అనుమానంగా, "అయ్యో సఖీ! నా కుడి కన్నూ, భుజమూ, స్తనాగ్రమూ అదురుతున్నాయి. ఇలా జరగటం నేనెప్పుడూ ఎరుగను. దీనికి తగిన కారణాలేవీ కూడా కనుపించడం లేదు. మనస్సు చాలా వికలంగా ఉన్నది. నా ప్రాణనాథుడు ఇంకొక చపలాక్షిని కూడి నన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడేమో." అన్నది.

ఇంతలో ఒక చెలికత్తె, పరుగు పరుగున రొప్పుతూ వచ్చింది. ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆమె సత్యభామతో, "అమ్మా! ఏం చెప్పగలను? స్వామివారు రుక్మిణమ్మగారి మందిరంలో ఉన్నారు. అప్పుడు అక్కడికి దేవర్షి నారదులవారు వచ్చారు. అలా ఆకస్మికంగా వచ్చి, మురారికి 'ఇది అనఘమూ, దేవయోగ్యమూ, అతిసౌఖ్యకరమూ, అనితరసులభమూ' అని చెప్పి ఒక దివ్యమైన పుష్పాన్ని ఇచ్చారు.

"స్వామివారు చాలా ఆనందించారు. వెంటనే లేచి ఆ పువ్వును అందుకున్నారు. కళ్ళకు తాకించి మొక్కి, ప్రేమతో దానిని రుక్మిణీదేవికి ఇచ్చారు. ఆమె ఆ పుష్పాన్ని కొప్పులో తురుముకొన్నది. ఆమె అలా ఆ పుష్పాన్ని ధరించిందో లేదో అద్భుతం జరిగింది - ఇంతింతని చెప్పలేని ఒక వింత అందంతో వెలిగిపోయిందామె. సానబట్టిన మన్మథుడి బాణమా అన్నట్లుందామె. ఇంకా ఏం చెప్పమంటావమ్మా! ఆ పుష్పాన్ని ధరించడం వల్ల, దాని మహిమతో తోటి మహిళలు అసూయను వదిలిపెట్టి ఆమెను పొగిడారు. తరగని ప్రభావంతో ఉన్నతాసనం మీద కూర్చొని మూడు లోకాలనూ తానే ఏలుతున్నదా! అన్నట్లుగా ఉన్నదామె. ఇక నారద-మునీంద్రులు ఎంత పనిచేశారో తెలుసా!? స్వామివారు, రుక్మిణీదేవి, నేనూ

వింటుండగా, "'తానే పతికి ప్రియసతి'ననే అహంకారంతో విఱ్ఱవీగే సత్యభామ గర్వమిక చెల్ల"దన్నాడమ్మా. ఆ కలహభోజనుడి మాయలు, ఆ రుక్మిణీదేవి నటనలు, ఆ కృష్ణస్వామి చేష్టలు చూస్తే ఎవరికి మాత్రం కోపం రాదమ్మా కమలనేత్రా!'' అంటూ ఇంకా ఆ చెలికత్తె చిలువలూ పలువలూ చేర్చి మరీ చెప్పింది.

సత్యభామ చింతనొందుట

అది విని సత్యభామ దెబ్బతిన్న నాగకన్యలా, నెయ్యి పోయగా భగ్గున లేచిన అగ్నికీలలాగా లేచి - కళ్ళల్లోని ఎరుపు కుంకుమపత్రాలను అద్దిన తన చెక్కిళ్ళను మరింత ఎర్రగా చేస్తూ కొత్త కాంతులు వెదజల్లుతుండగా గద్గదస్వరంతో ఇలా అన్నది-

''ఏమిటే! ఆ కలహభోజనుడు అంతలేసి మాటలన్నాడా? ఆ మాటలన్నీ ఆ గోపికావల్లభుడు చెవులోరబెట్టుకొని విన్నాడా? రుక్మిణీదేవి ఏమన్నది? ఇంకెందుకు దాస్తావు. మొగమాటం లేకుండా నిజం చెప్పవే".

ఇంకా ఇలా అన్నది - "చాలా గొప్ప పుష్పమని గొప్పగా నారదుడు స్వామికి కానుకగా ఇస్తే ఇచ్చాడు. సరే ఇచ్చాడు. ఆయన దానిని తన ప్రియమైనవారికి ఇచ్చాడు. ఇవ్వనీ. ఐతే ఆ కయ్యాలమారి దేవర్షి మా ఊసు ఎందుకు ఎత్తాలక్కడ? సరే! ఆయన కలహభోజనుడు కనుక అనేక రకాలుగా ముడి పెట్టే మాటలు మాట్లాడుతూ లోకాలు తిరుగుతుంటాడు. అది ఆయనకు అలవాటు. నా భర్త అయిఉండి ఈయన వారించవద్దూ ఆ

మునిని? అయినా, మునిదేముంది? ఇందులో రుక్మిణి తప్పు మాత్రం ఏముంది? ధూర్తగోపాలుడు చేసిన పనిని ఏమని చెప్పుకోవాలి? మనస్సు బాధపడదా, ప్రాణానికి ప్రాణమైన మగడు ఇలా చేస్తే!? మగవాళ్ళు తమ నడవడిని పరిశీలించుకోకుండా, స్త్రీల ప్రేమలను నమ్మకూడదంటారు. శరత్కాలంలో మేఘాల వలె చలించే మనస్సులు ఉన్న మగవాళ్ళే కదా చపలచిత్తులు. వాళ్ళను అసలు నమ్మకూడదు. ఇన్నాళ్ళూ సవతు-లందరిలో నన్ను చాలా ప్రేమతో చూసిన స్వామి, ఈ రోజు అదంతా మరచిపోయి, వాళ్ళు నన్ను తూలనాడుతుంటే ఊరుకున్నాడే! నేనది భరించగలనా? ఛీ, ప్రాణాలు ఎంత తీపో గదా! నాతో మొగమాటానికి ప్రేమనాటకమాడి, రుక్మిణిమీద ఉన్న ప్రేమ, దయ, గౌరవం బయట పడనీయక ఇన్నాళ్ళూ నన్ను మోసం చేశాడే ఆ కమలాక్షుడు! ఆహా! మెచ్చుకోవలసిందే ఆయన చేష్టలూ, నటనలూనూ.

“చెలీ! నారదుడు ఒక పువ్వు తెచ్చి శౌరికి ఇచ్చాడట. అతడు దానిని ఆ చపలాక్షికి ఇచ్చాడట. ఇలాంటి మాటలు విన్న తరువాత కూడా నేనింకా ప్రాణాలతో ఉన్నానే! ఇలాంటి నోములు నోచానా నేను? ఇంకా ఇలాంటివి ఎన్ని వినడానికి నేనింకా బతికున్నానో?! ఏది మంచో, ఏది చెడో ఆ నరకాసురసంహారికి తెలియదా? ఒకవేళ స్వామి ఆ సమయంలో రుక్మిణీదేవి మందిరంలో ఉండటం వల్ల పువ్వును ఆమెకిచ్చాడని అనుకుందాం. ఇంతలోనే తమ వన్నె, వాసి తగ్గి వైభవం, వివేకం పంతము అన్నీ నశించినట్లు ఈ సవతులు ఆమెను భజన చేయటమేమిటి? ఆశ్చర్యంగా ఉంది. ఇంకేం మాట్లాడగలను? కలకాలం ఒక్కలాగే

పూసలలో దారంలా భార్య మనసులో ఉండే పురుషుడు దొరకటం పూర్వజన్మలో నోచిన నోముల ఫలమే గదా! నాథుడు కలలోనైనా పరిహాసానికైనా నా మాట మీరే వాడు కాడు. ఏ పదార్థమైనా నాకు ఇవ్వకుండా ఇంకెవ్వరికీ ఇచ్చేవాడు కాదు. చెలికత్తెలు తనకు వ్యతిరేకంగా నాతో ఏం చెప్తారోనని వాళ్ళకు లంచాలిచ్చేవాడు. సవతులు నాతో వంతుకు వస్తే సహించలేకపోయేవాడు. అరమరికలు లేకుండా కలసి మెలసి ఉంటూ, కోరిన కోర్కెలు తీర్చి కపటం లేని ప్రేమతో ఉండే స్వామి ఇలా చేస్తాడా!?

"క్రీడాపర్వతగుహలలో దాగుడుమూతలు, స్వయంగా పోషించిన మాధవీలతకు పున్నాగమొక్కకూ చేసిన పెళ్ళి సంబరాలు, ద్యూతం ఆడే సమయంలో చీరకొంగును లాగటాలు, సాయంత్రం వేళల్లో చక్రవాక-మిథునాల విరహాలను వీక్షించడాలు, వెన్నెల విహారాలు, చంద్రకాంత-శిలావేదికల మీద విశ్రాంతులు, ఒకరినొకరు చిత్రించుకోవటాలు. ఎన్నెన్ని ముచ్చట్లు, మురిపాలు, అన్నీ మరచిపోయాడా ఆయన రుక్మిణి మాయలో పడి!? కులకాంతలకు పతియే గదా ప్రాణంవంటివాడు, దైవం, ఆధారమూ. ఆ పతియే హద్దు దాటితే భార్యలకింక వేరే దిక్కెవరు? సవతులకు ధనమిస్తే ఓర్చుకోవచ్చు. చనువిస్తే ఎలా ఓర్చుకోగలం?"

ఇలా పరిపరివిధాలుగా దుఃఖించి, కోపంతో రగిలిపోతూ సత్యభామ హరిచందనవృక్షం కింది పుట్టలోనికి వెళ్ళిన నాగకన్యలా కోపగృహంలోకి వెళ్ళింది. మాసిన చీర కట్టుకుని, నగలు తీసేసింది. తలకు వాసెన కట్టుకుని, నుదుటికి కస్తూరిపట్టు వేసుకున్నది. చీకటింట్లో మంచంమీద

మేఘం చాటున చంద్రబింబం వలె విషాదవేదనను అనుభవిస్తూ పొర్లుతున్నది. ఆ తామరసనేత్రయైన సత్యభామకు, మిక్కిలి మోహం కలిగింది. వెక్కసమైన వగలు పుట్టినాయి. మేను వణికింది. చెమటలు పోసినాయి. మనస్సు చిన్నవోయింది. పరితాపము, వేదన కలిగినాయి. కామం అనే పాము కరిస్తే అసూయ అనే విషం వ్యాపించి నట్లు బాధ కలిగింది.

కళ్ళు మూసుకుంటుంది. తెరుస్తుంది. పిచ్చినవ్వులు నవ్వుతుంది. తల ఊపుతుంది. పానుపు పైన పడుతుంది. ఉసూరుమంటూ లేస్తుంది. తడబాటు, తత్తరపాటు, అలుక ఇవన్నీ కలగాపులగంగా కలుగుతుంటే, కోపవేగంతో, సహించరాని మన్మథబాధతో, మదపుటేనుగు తొండానికి చిక్కిన పద్మంలాగా అయిందామె. ఇలా సత్యభామ కోపగృహంలో రోషంతో కుమిలిపోతూ ఉన్నది.

సత్యభామ వద్దకు శ్రీకృష్ణుని రాక

ఇక అక్కడ శ్రీకృష్ణుడు, ముని తనకు పారిజాతపుష్పాన్ని ఇవ్వడమూ, తను దానిని రుక్మిణీదేవికి ఇవ్వడమూ దగ్గరుండి చూసి వెళ్ళిన సత్యభామ చెలికత్తె ఆమెకు ఏమేమి కల్పించి చెప్పిందో- అని చింతిస్తూ, ప్రద్యుమ్నుడిని ముని సన్నిధిలో ఉంచి, రథాన్ని ఎక్కి - రథపు జెండా రెపరెపలను మించి చలిస్తున్న ధైర్యంతో, పరిగెత్తే గుర్రాల వేగాన్ని మించిన తత్తరపాటుతో, బండి ఇరుసు వలె భ్రమిస్తున్న మనస్సుతో - సత్యభామ సౌధానికి వచ్చాడు. వచ్చి, రథం దిగి, సారథి దారుకుణ్ణి ద్వారం దగ్గరే ఉండమని చెప్పి,

కమలనాభుడు తానొక్కడే గదులన్నీ దాటి సందడి లేని అంతఃపురమంతా తిరిగి చూసి, ఇలా అనుకున్నాడు-

“ఇంత నిశ్శబ్దంగా ఉందేమిటి ఈ అంతఃపురం? బంగరు పంజరాలలోని చిలుకలకు పంచదార పెడుతూ మాటలు నేర్పడం లేదేమిటి సఖీజనం? చప్పట్లు చరుస్తూ పెంపుడు నెమళ్ళను ఆడించడం లేదేమిటి ఎవరూ? వనితలు వాడి గోళ్ళతో వీణా తంత్రులను మీటుతూ పాడటం లేదేమిటి? రమణులు రాయంచ పిల్లలకు నడకలు నేర్పడం లేదేమిటి? ఎప్పుడూ ఉన్నట్లులేదే ఈ మందిరం! చిన్నబోయింది. అక్కడి పారిజాతవృత్తాంతాన్ని ఇక్కడికి చేరవేసినట్లున్నారు.”

అలా అనుమానిస్తూ త్వరగా కోపగృహానికి చేరాడు వెన్నుడు. అక్కడ సాత్రాజితి ముసుగు తన్ని పడుకొని ఉంది. అక్కడున్న దాసీలను కొందరిని వెళ్ళి పొమ్మని మాటలతో, కొందరిని చూపులతో, కొందరినీ చేసన్నతో పంపించి, దగ్గరగా వెళ్ళి సూర్యుడి వేడికి వాడిపోయిన లతలా ఉన్న సత్యభామను చూసి ఆశ్చర్యపడి, ఈ లలితాంగి సంగతి పూర్తిగా తెలుసు-కుందామనుకున్నాడు. ఒక భామ ఆమె వెనుక నిలుచుని వీవన వీస్తున్నది. ధూర్తగోపాలుడు ఆ వీవన తీసుకుని ఆమెలో మన్మథబాధను రగిలిస్తూ విసరడం మొదలు పెట్టాడు. సత్యభామకు పారిజాతపుష్పసువాసనలు సోకినాయి. ఆ దివ్యసుగంధం సోకగానే ఆశ్చర్యపడి, కప్పుకున్న ముసుగు తీసి నాలుగు వైపులా చూసిందామె. తన వెనుకనే తాటియాకు వీవన పట్టుకొని ఉన్న కృష్ణుణ్ణి చూసి, నీళ్ళు నిండిన కళ్ళతో మళ్ళీ ముసుగు తన్ని పడుకున్నది. ఓర్పు కొంచెం కూడా లేని ఆ విచ్చిన కలువ కన్నుల కాంత

యొక్క చిత్తంలోని వేడిని చల్లార్చడానికి నీలమేఘశ్యాముడు వచ్చాడని, మన్మథుడి వేడిని బయటకు పంపే మిత్రుడిలా వాయువు వేడినిట్టూర్పుల రూపంలో బయటకు వస్తున్నది. ఆమె వక్షోజాలకు రాసుకున్న కుంకుమ చెమట చేత కరిగి మెల్లగా పైట అంచుల వెంట కారుతుంటే ఆమె మనసులో రగులుతున్న కోపం వడగట్టబడుతున్నదా అన్నట్లున్నది.

శ్రీకృష్ణుడు సత్యభామను అనునయించుట

ఆమె అలా కోపంతో కునారిల్లి పోతుంటే, ప్రేమతో పద్మనాభుడిలా అన్నాడు-

“చంద్రముఖీ! నగలెందుకు పెట్టుకోవు? ఈ మాసిన చీర యేమిటి? తాంబూలం ఎందుకు వేసుకోవు? పెదవులు చూడు, ఎలా పాలి-పోయినాయో! నీ వైఖరి వింతగా ఉంది. ఏమైందో నిజం చెప్పు. నా మనసు ఎలాంటిదో తెలుసుకోవటానికి ఇదొక నెపమా? నవ్వులాటకా? లేక నన్ను భయపెట్టడానికా? నా యందు నిజంగానే ఏమైనా తప్పున్నదా? ఓ పద్మనేత్రా! నేను నీకేమైనా పగవాడినా? ఇటు చూడవేమి? నువ్వు దయగా చూడకపోతే ఒక్క నిముషమైనా నిలువగలనా? తేనెలూరేలా తీయగా మాట్లాడుతావు గదా! నాతో ఎందుకు మాట్లాడటం లేదు? వాలు-కన్నులతో నునుసిగ్గులు చిందిస్తూ చూడవేమి? నన్ను నీ హృదయానికి హత్తుకొని గాఢంగా కౌగలించుకోవేమి? చిలుకలకొలికీ! ఎవరు మనలనిలా విడదీశారు? నీకీ చింత ఎందుకు? ఇతరులతో నేను మెరమెచ్చుల కోసం మాట్లాడుతాను, ప్రవర్తిస్తాను. కానీ నిజమైన తరగని ప్రేమ నాకు నీపైనే అని

తెలియదా? నువ్వు ఏంచెప్పినా చేస్తాను అని తెలియదా నీకు? సత్యా! నీ మధుర అధరామృతమును, నీ బిగికౌగిలిని పొందటానికి నేను ధన్యుణ్ణి కాకపోతే పోనీ, నా మాట విని కడకంటితో నన్నొక్కసారి చూడు.'' అంటూ పైట చెంగు పట్టుకోబోయి, ఆమె తన కరకమలంతో కొట్టబోగా, ఆ బెదిరింపుకు జడిసి వెనక్కు తగ్గాడు.

ఎన్ని చెప్పినా, చేసినా, ఆమె కోపాన్ని పోగొట్టడానికి ప్రయత్నించి విఫలుడై, ఆమె లేత చిగురుటాకుల వంటి ఎర్రని పాదాల కాంతి తన కిరీటంలో పొదగబడిన మాణిక్యకాంతులకు మెరుగు పెడుతుండగా, ఆ జగన్నాటకసూత్రధారి యదునందనుడు ఆమె పాదాలకు మొక్కాడు. అప్పుడు బ్రహ్మేంద్రాదిదేవతలకు పూజాయోగ్యమైనది మన్మథుడి కన్న-తండ్రియైన శ్రీకృష్ణుడికి చెందినదీ అయిన ఆ తలను సత్యభామ ఎడమకాలితో తొలగ త్రోసింది. పతులు నేరాలు చేస్తే అలిగిన పడతులకు మంచీ చెడూ తెలుస్తుందా? కోపంతో అలా తగిలిన కాలి తాపుకు, ఆ కొంటె గోపాలుడు ఒళ్ళు గగుర్పొడవగా మన్మథుడు ఆవేశించినవాడై ప్రేమతో ఇలా పలికాడు -

''సత్యా! నీ దాసుణ్ణి అయిన నన్ను ప్రణయకలహంలో తన్నినా అది నాకు మన్ననయే. కానీ లేత చిగురుటాకు వలె సుకుమారమైన నీ పాదానికి, నీ కాలి స్పర్శ వల్ల నా దేహంపై మొలచిన ముళ్ళవంటి పులకాంకురాలు గుచ్చుకొని నొప్పి కలిగించాయేమోనని నేను విచారిస్తున్నాను. ఓ తుమ్మెదల బారువంటి శిరోజాలు కలదానా ఇకనైనా అలుక మానవు గదా!'' అని బ్రతిమాలాడు.

సత్యభామ శ్రీకృష్ణుని నిందించుట

ఆ మాటలు విని సత్యభామ లేచింది. విడిపోయిన శిరోజాలను ముడి వేసుకున్నది. పై చెరగుతో వక్షోజాలను కప్పుకున్నది. ముఖంమీద చెమటలు పోసినాయి. పెదవులు వణుకుతుండగా ఇలా అన్నది- "స్వామీ! ఈ నయగారాలు, మెరమెచ్చు మాటలు ఎందుకు? నిన్ను నమ్మినందుకు నాకు బాగానే అయింది శాస్తి. నన్ను బాధపెట్టినవాళ్ళను చూడను నేను. నీమీద ఒట్టు. ఐనా పశువుల కాపరికి ఏం తెలుస్తాయి మన్మథుడి మర్మాలు! ఇక నిన్ను నమ్మను. నన్ను రెచ్చగొట్టకు." అన్నది. ఇంకా కూడా ఇట్లా అన్నది-

"స్వామీ! ఈ అబద్ధాలు మాకు రుచించవు. రుక్మిణీదేవి నమ్ముతుం-దేమో! చాలు చాలు, ఇంకా నన్ను ఉడికించకు. లేని ప్రేమ నటించకు. అబద్ధాలు నువ్వు పుట్టిన తరువాతనే పుట్టినాయి. ఈ మాయలు నీకు వెన్నతో పెట్టిన విద్యలని తెలిసి కూడా అమాయకంగా నిన్ను నమ్మి నా సర్వస్వం కోల్పోయాను. ఏం చెయ్యగలను! నారదుడు వచ్చి పువ్వును ఇచ్చాడు. నీ ప్రియమైన భార్యను పొగిడాడు. నువ్వు ఆనందంగా విన్నావు. ఇక మా మాటలు నీకేం రుచిస్తాయి? ఇప్పుడు నువ్విక్కడికి రావటం కూడా, ఆ పారిజాత పరిమళాలను మోసుకుని వచ్చి నన్ను వెక్కిరించ-డానికే గదా, చెప్పు! స్త్రీలకు మానమే నగలు. ప్రాణంకన్నా మానమే ఎక్కువ. మానమే అన్ని గౌరవాలకు మూలం. మానహీనమైన జీవితం ఎందుకు? ఇంతవరకు నువ్వు నాకు గౌరవం ఇస్తూ ఉండటం వల్ల, అత్తగారు దేవకీదేవి నన్ను ప్రత్యేకంగా చూస్తున్నది. ఇప్పుడు నన్ను ఏ మొగం పెట్టుకుని ఆమె

దగ్గరకు వెళ్ళమంటావు? అయ్యో! ఈ శమంతకరత్నానికి ఏ స్త్రీ నోచుకొన్నదో! ఈ రైవతకకేళీపర్వతవనాలలోఎవతె క్రీడించనున్నదో! ఈ వసంతవనంలో కర్పూరకదళీవనం ఎవరి పాలవనున్నదో! ఈ నీలమణి-మందిరాలలో నువ్వు ఎవరితో ఉంటావో! అయ్యో! నేను పెంచిన చిలుకలు, నెమళ్ళు ఎవరి పంచన చేరుతాయో! తోటి సవతులిప్పుడు నన్ను చూసి నవ్వుతారు. ఎందుకంటే పంతం పట్టి నిన్ను నా చెంతనే ఉంచుకునేదానను గదా! అసలు నువ్వు నన్ను ఎవ్వతెగా చూశావు?" అని కళ్ళు నీళ్ళతో నిండగా, ముఖం ముడుచుకొని, కంఠం గద్గదం కాగా, మరి మాట్లాడలేక, ఈర్ష్యతో పుట్టి, హృదయంలో హెచ్చిన శోకాగ్నితో, పద్మంవంటి ముఖంమీద చీరచెంగు కప్పుకొని లేత వగరు చివుళ్ళు తిన్న కోకిలలా భోరున ఏడ్చింది.

సత్యభామ కోపోపశమనము

ఆ సత్యభామ అలక తీర్చడానికి ఉపాయం తోచక, శ్రీకృష్ణుడామెను కౌగిలిలో చేర్చుకుని బుజ్జగించాడు. చెంపలమీద నుంచి కారుతున్న కన్నీటిని తుడిచాడు. తియ్యని మాటలతో స్నేహపూర్వకంగా ఇలా అన్నాడు - "ఓ లలితఇంద్రనీలశకలములవంటి శిరోజాలుగలదానా! నీకు ఇంత దిగులెందుకు? అదీ ఒక పువ్వు కోసం? సరే విను. దేవతల ఉద్యాన-వనంలోకి వెళ్ళి, ఇంద్రుడు యుద్ధానికి వచ్చినా సరే ఓడించి పారిజాత వృక్షాన్ని తెచ్చి ఇస్తాను. ఓ అందమైన కనులున్నదానా! నీ కేళీ వనములో,

చల్లదనాన్ని వెదజల్లే చెంగల్వ కొలను పక్కన, కర్పూరకదళీవృక్షాల మధ్య నీ పెరటి చెట్టుగా పారిజాతవృక్షాన్ని నాటిస్తాను, చూసుకో.'' అన్నాడు.

అలా పలికిన నీలమేఘశ్యాముడి మధురగంభీరవాక్యాలను విన్న సత్యభామ వికసించిన సన్నని కడిమిచెట్టు వలె శోభించింది. సమీపంలోని చెలికత్తెలు మయూరములవలె భాసించారు.

అలా సరససంభాషణలతో, వినోదకథలతో, ఆ సాత్రాజితిని ప్రేమ-రసాంబుధిలో తేల్చి, ఆనందంగా ఉండగా మధ్యాహ్నసమయసూచకంగా శంఖధ్వానాలు వినిపించినాయి. కాలోచితకార్యాలు చేయాలని అను-కుంటున్న శ్రీకృష్ణుడి మనసెరిగి సత్యభామ కనుసన్న చేయగా, పద్మ-ముఖులైన పరిచారికలు వినయంగా వచ్చి ముందు నిలిచారు. ఒక వనజాక్షి వీణ మీటినట్లున్న గొంతుకతో స్నానానికి వేళైందని శౌరికి విన్నవించింది.

ద్వితీయాశ్వాసము

శ్రీకృష్ణుని మాధ్యాహ్నికస్నానము

వేడుకతో ఆత్మేశ్వరిని చూస్తూ, మందహాసంతో శ్రీకృష్ణుడు జలకాలాడపోవటానికి సన్నద్ధుడైనాడు. ఒక సుందరి చేతిని ఊతగా పట్టుకొని, కంచుకులు "సముఖా" అని అంటూ పరాకు చెప్పుతుండగా[11] బంగరు ఉత్తరీయం ఇంచుక జారుతుండగా లేచి పానుపు దిగాడు. ఒక భామామణి కృష్ణుడి పాదాలకు బంగరు పావుకోళ్ళను తొడిగింది. అప్పుడాయన స్నానగృహానికి వెళ్ళి ఒక ఇంద్రనీలమణిమయపీఠం మీద కూర్చుంటే, ఆ సరోజాక్షులు ఆయన వంటి మీదినుండి కౌస్తుభం మొదలైన ఆభరణాలను తొలగించారు. అప్పుడు సన్నని నడుము అల్లల్లాడుతుండగా, కుచద్వయం నాట్యం చేస్తుంటే, ఫాలభాగం పైన చెమటలు కమ్ముతుండగా, హారాలు ఎగిరెగిరి పడుతుండగా, కంకణాలు తాళం వేస్తున్నట్లు ధ్వనిస్తుండగా, ఒక చంద్రవదన సంపెంగ నూనెతో కృష్ణుడికి తలంటింది. తామరపూలలో చిక్కుకున్న తుమ్మెదలలాంటి శిరోజాలను చేతులతో చాలాసార్లు పిడిచి, విప్పి, విదిల్చి, గోళ్ళ కొనలతో దువ్వి గొజ్జగి నీరు (పన్నీరు) చల్లుతూ ఆ కాళీయమర్దనుడికి ఉసిరికపొడీ

[11] "సముఖ" అని అనటం ప్రభువుల స్నానసమయాదులలో కంచుకులు చేసే హెచ్చరిక. "సందడి విడువుము సాసముఖా, మందరధరునకు మజ్జనవేళా" అని పాడారు అన్నమయ్య. 'సముఖ-సముఖ' ఆమ్రేడితమై 'సాసముఖ' అయి ఉండవచ్చునట.

గందపొడీ కలిపి చేసిన పిండితో నలుగు పెట్టిందొక లలన. కొందరు లతాంగులు బంగరు కలశాలతో నీళ్ళు పోస్తుంటే శౌరికి స్నానం చేయించిందొక లలితాంగి. తెల్లని మెత్తని వస్త్రాలతో తడి ఒత్తిందొక యువతి. కొనగోళ్ళతో తల చిక్కుదీసి, తల తుడించిందొక వనిత. తెల్లని వెన్నెలలాంటి వస్త్రాలను అందించిందొక అలివేణి. ఒక సుందరి నవరత్నాభరణాలతో కృష్ణుడిని అలంకరించింది. ఒక పూబోడి పూలదండలనిచ్చింది. ఒక చంద్రవదన చందనం అలదింది. కర్పూరపు వీవన వీచిందొక కమలాక్షి. నిలువుటద్దం చూపించిందొక నీరజాక్షి.

కళ్ళల్లో మణిదీపశిఖల ప్రతిబింబాలు తడబడుతుండగా లక్ష్మీ-కాంతుడికి కొందరు ముగుదలు ముత్యాల హారతులిచ్చారు. స్నానం చేసి, శుభ్రవస్త్రాలను ధరించి, చందనకస్తూరికాది పరిమళద్రవ్యాలను అలదు-కొని, పసిడి అందెలు ఘల్లుఘల్లున మోగుతుండగా వచ్చిన సత్యభామను చూసి కృష్ణుడు ఉప్పొంగిపోయాడు. మాత్సర్యమేఘాలు తొలగిపోయి చంద్రకళలా ప్రకాశిస్తున్నది ఆమె. విరహమనే చీకటి తొలగిపోయి, విచ్చుకున్న పద్మంలా ఉన్నది సత్యభామ. కోపమనెడి మదపుటేనుగు కలచి వేసి వెళ్ళిన తరువాత మళ్ళీ తేటబారిన సరస్సులా నిర్మలంగా ఉంది. సంతాపము అనెడి గ్రీష్మము నిష్క్రమించిన తరువాత మొగ్గ తొడుగు-తున్న నవమాలతీలతలాగా (జాజి మల్లె తీగవలె) ప్రశాంతంగా ఉంది.

సత్యభామ వద్దకు నారదుని రాక

వికసించిన హృదయంతో, శాంతంగా, దిగులును పారద్రోలి, వయ్యారంగా తన వద్దకు వచ్చిన ప్రియపత్నిని ప్రేమగా చూస్తూ ఉన్నాడు కృష్ణుడు. అప్పుడు - రుక్మిణీదేవి మందిరం నుండి వెడలి సముద్రంలో స్నానంచేసి మాధ్యాహ్నికానుష్ఠానాదులు పూర్తి చేసుకొన్న నారదుడు సత్యభామాకృష్ణులను చూడగోరి వచ్చాడు. ఆ దేవర్షికి ఆ దంపతులిద్దరూ స్వాగతసత్కారాలు చేశారు. ఇంతలో ఇద్దరు సఖీమణులు వచ్చి భోజన-పాత్రలు పెట్టామని విన్నవించారు. చంద్రుడిని అనుసరిస్తున్న మెరుపూ, మేఘమూ వలె సత్యాకృష్ణులు ఆ తపస్వి వెంట నడుస్తూ భోజనశాలకు వెళ్ళారు. అక్కడ రత్నాలు తాపిన బంగారు పాత్రల ముందు ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలైన కుమారులు, సాత్యకి మొదలుగాగల సోదరులు, ఇతరబంధువులు, వారి సంతానమూ కూర్చుని ఉన్నారు. కృష్ణుడు నారదుడి సరసన ఉచితాసనంలో కూర్చున్నాడు. విరిబోణులు వీవనలు వీస్తున్నారు.

శాకపాకాల రుచులను వర్ణిస్తున్నాయా అన్నట్లు కరకంకణాలు ఘల్లు ఘల్లున మోగుతుండగా, 'వేగంగా వడ్డించండి' అంటున్నట్లు నడుములకు పెట్టుకున్న వడ్డాణాలలోనున్న రత్నాల చిరుగంటలు గలగలలాడు-తుండగా, అన్నపు కాంతులతో కలహిస్తున్నాయా అన్నట్లు కట్టుకున్న వస్త్రాలు పెళపెళలాడుతుండగా, ఆరగించండి అని ప్రేమగా పలుకు-తున్నట్లు కాళ్ళ మెట్టెలు చప్పుడు చేస్తుండగా వారిజాక్షులు వడ్డించారు.

నారదుడూ, కృష్ణుడూ భోజనపదార్థాల రుచులను మెచ్చుకుంటూ వివిధమైన భక్ష్యములను, భోజ్యములను, లేహ్యములను, చోష్యములను, పానీయాలను[12] ప్రియంగా భుజించారు.

సుందరాంగులు సుగంధజలాలను పోస్తుంటే అందరితో కలిసి కంసవైరి చేతులు కడుక్కున్నాడు. అప్పుడు సత్యభామాకృష్ణులు సుందరీమణులచేత అందరికీ కర్పూరతాంబూలాలను ఇప్పించారు.

అందరూ కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత, శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి వచ్చి నారదమౌని పాదాలకు నమస్కరించాడు. అప్పుడు నారదుడు సత్యభామతో- "నీవే తానయినట్లు అభేదంగా ప్రవర్తిస్తాడు నీ భర్త. జనము నిన్ను గౌరవిస్తారు. బంధువులు నిన్ను పొగడుతారు. సవతులు నిన్ను చూసి సిగ్గుపడతారు. సకలవైభవాలకు నిలయమై ఉన్న నిన్ను ఇతరస్త్రీలను దీవించినట్లు ఎలా దీవించగలను!?" అన్నాడు. "అమ్మా! నీ పతి నిన్ను విడిచి యుద్ధానికి కూడా పోతాడో లేదో! నిన్ను ప్రాణంగా చూసుకుంటాడు. నువ్వు కోరిందల్లా చేస్తాడు. నీకిచ్చినంత చనువు ఎవ్వరికీ ఇవ్వడు. నీ సౌభాగ్యం ఇంతింత కాదు. నీవంటి స్త్రీలు ఎక్కడా లేరు. అయినాసరే! ఓ వంకరలు తిరిగిన ముంగురులు

12 భక్ష్యములు = కొరికి తినేవి/పిండివంటలు; భోజ్యములు = తినదగినవి/అన్నం వంటి రోజూ తినే భోజనపదార్థాలు; లేహ్యములు = నాకి తినేవి/పచ్చళ్ళు; చోష్యములు = జుఱ్ఱుకునేవి/ రసం వంటివి; పానీయాలు = త్రాగేవి/పాయసాదులు

గలదానా! నువ్వు కోరిన కోర్కెలన్నింటినీ, ఎంతటి మహాకార్యంలో నిమగ్నుడై ఉన్నా, ఆ పనిని ఆపి నీ పతి తీర్చుగాక!'' అని దీవించాడు.

అలా సత్యభామను దీవించి, కృష్ణుడి వంక చూసి నారదుడు, ''దనుజాంతకా! పోయి వస్తాను. నన్ను మరచిపోకు.'' అనగా, ఆ గోపవధూజనవంచకుడు ఇలా అన్నాడు - ''నారదా! దేవమాత అదితీదేవి కుండలాలను నరకాసురుడు బలవంతంగా తీసుకున్నాడు. వాణ్ణి నేను యుద్ధంలో చంపి వాటిని తెచ్చి దాచాను. ఎందుచేతనో ఇంద్రుడు వాటిని అడగ పంపలేదు. పరాయివాడిని కాదు కదా. సరే! నేనే వచ్చి వాటిని అదితీ-దేవికి అందజేస్తానని ఇంద్రుడితో చెప్పండి మునీంద్రా!'' అన్నాడు. అలా అని శ్రీహరి నారదుడికి సవినయంగా వీడుకోలు పలికాడు.

సాయంకాలవర్ణన

ఇంతలో సూర్యుడు పశ్చిమ దిశకు చేరి, అస్తమించాడు. మదిరాపానం చేసిన యాదవస్త్రీల కంటి ఎరుపును మీరింది సూర్యాస్తమయకాంతి.

తన శత్రువైన సూర్యుడి తేజస్సు తరిగి అతడు పడమటి కొండకు వెళ్ళిపోయేదాకా వేచి చూసిన చీకటి అనే రాజు, సూర్యపత్ని అయిన ఛాయాదేవిని పట్టి ఈడ్చుకురమ్మని సాయంకాలమనే యోధుణ్ణి పంపాడు. అతడలాగే చేయగా, అప్పుడా ఛాయాదేవి కో అని అరచినట్లుగా పక్షుల కూతలు వినిపించినాయి.

చక్రవాకమిథునాలు పగటి వేళల్లో కలుస్తాయి. రాత్రుళ్ళు విరహ-వేదనను అనుభవిస్తాయి. పగలు తమను కలిపిన సూర్యుడి కాంతి క్షీణించడం చూడలేక, అవి బాధతో తలలు వంచుకుని సరస్సులలోకి చూస్తూండగా రవిబింబం కనుపించింది. అప్పుడవి క్షీణిస్తున్న తమ మిత్రుణ్ణి చూసి బాధతో మూర్ఛిల్లినాయి. వాటి బాధను చూడలేక, జలదేవత తన పద్మాలనే నేత్రాలను మూసుకుంది. (సూర్యాస్తమయంతో పద్మాలు ముకుళిస్తాయి కదా).

ఆకాశం అనే పట్టపుటేనుగు ఒళ్ళంతా చీకటి అనే మదం అలముకోగా, అది చెలరేగిపోయి, తనపై ఉన్న సూర్యుడనే మావటిని పడమటి కొండలోయలోకి విసరివేయగా, ఆ మావటివాడు గాయపడి నెత్తురు కక్కుకున్నాడా అన్నట్లు, మిరుమిట్లు గొలుపుతూ అలుముకున్నాయి సాయంసంధ్యాకాంతులు.

ఒక గండు తుమ్మెద పరాయిదైన ఆడుతుమ్మెదతో విహరించడానికి పోతూ, పూలతేనెను తాగి మత్తెక్కి ఉన్న తన భార్య తుమ్మెదను పద్మమనే తన ఇంట్లో ఉంచి వెళ్ళింది. సాయంత్రమయ్యింది. పద్మం ముడుచుకొని పోయింది. పరాయి తుమ్మెదతో క్రీడించి తిరిగివచ్చిన గండు తుమ్మెదకు ఇంట్లోకి ప్రవేశం లేకుండా పోయింది. గత్యంతరం లేక, అది సరోవరలక్ష్మి చుట్టూ కాపలావాడిలా తిరుగుతూ ఉండిపోయింది.

పగలు అనే సముద్రాన్ని రాత్రి అనే ముని తాగివేయగా[13] అడుగున మిగిలిన బురదలాంటి చీకటి, పడమటి కొండలనే అడవిలో సంజె కార్చిచ్చు రేగగా కమ్ముకున్న దట్టమైన పొగలాంటి చీకటి, నభోమణి (సూర్యుడు) భూమి మీద పడిపోతే, తనదైన ఆ మణిని వెతుక్కోవటానికి వచ్చిన ఆకాశంలాంటి చీకటి, మన్మథుడనే రాజు యొక్క విజయచరిత్రను చుక్కలనే అక్షరాలతో వ్రాయగా ఆ అక్షరాలను ఎత్తిచూపించేందుకు పులిమిన మసిపూత వంటి చీకటి, ముసలి వేశ్యలు జుట్టు తెల్లబడకుండా ఉండేందుకు తలకు రాసుకునే ఔషధంలాంటి చీకటి, వ్యభిచారిణులను కనబడకుండా చేసే కాటుకలాంటి చీకటి... ప్రపంచాన్ని అలముకుంది.

అభిసారికలు[14], "ఓ మన్మథుడా! నీకు చిలుకరథాన్నీ, పూల-బాణాలనూ సమర్పించుకుంటాం. కృష్ణా! నీకు వనమాలనూ, కొత్త పిల్లనగ్రోవినీ సమర్పించుకుంటాం. ఓ కాళికాదేవీ! నీకు నల్లని వస్త్రాలనూ, కస్తూరినీ, కాటుకనూ ఇస్తాం. ఓ వినాయకా! నీకు నేరేడుపండ్లు, నల్లని చామరాలూ, గరికపోచలను ఇచ్చుకుంటాం." అని వేడుకుంటూ, తమకు ఎంతో ఉపకారం చేస్తున్న చీకటి అనే దొరకు సూర్యచంద్రుల వంటి దుష్టగ్రహాల వల్ల దోషం కలుగకుండా శాంతి కలగాలని, ఎప్పుడూ చీకటి ఉండాలనీ ప్రార్థిస్తున్నారు[15].

---

[13] సముద్రాన్ని తాగిన అగస్త్యమహర్షితో రాత్రికి పోలిక

[14] సంకేతస్థలంలో ప్రియుడిని కలిసేందుకు వెళ్ళే స్త్రీ

[15] చీకటిలో ప్రియుణ్ణి కలుసుకునేందుకు వెళ్ళే స్త్రీలు 'తమోభిసారికలు'.

ప్రియులను చేరడానికి వెళ్ళే సమయం ఇంకా రాకపోవడంతో, అభిసారికలు నిట్టూర్పులు విడుస్తూ, ఇంటిపనులు చేసుకుంటున్నారు. ఆ నిట్టూర్పుల గాలికి, ఇంట్లో పెట్టిన దీపశిఖలు కంపిస్తున్నాయి.. అలా కదులుతున్న దీపశిఖలను భయపడవద్దని చీకటి అభయహస్తములను ఇచ్చి కాపాడుతున్నట్లున్నాయి ఆ దీపాల మీద వ్యాపిస్తున్న కాటుక పొగ మాలికలు.

నక్షత్రవర్ణన

సాయంకాలం గడిచి చీకటిపడింది. నక్షత్రాలు ఉదయించాయి. ఆ నక్షత్రాలు, చీకటి అనే మేఘాల గుంపు వర్షించే వడగళ్ళలాగా, చక్రవాకపక్షుల జంటలను విడదీయటం కోసం చంద్రుడు కిరణాలనే గొట్టాల ద్వారా చిమ్మిన పటిక ఉండలలాగా, అప్సరసలు ఆకాశగంగా-తీరంలో ఇసుకతో పెట్టిన వెన్నెలకుప్పలలాగా [16], వెన్నెల అనే వెండిని తీగలుగా సాగదీసే ఆకాశం అనే కమ్మెచ్చు [17] రంధ్రాలలాగా, లోకాలపై

---

16 'వెన్నెలకుప్పలు' అనే ఒకప్పటి పిల్లల ఆట. ఈ ఆటలో రెండు జట్లు ఉంటాయి. ఒక జట్టు వాళ్ళు కళ్ళు మూసి ఇంకో జట్టు వాళ్ళు వీధుల్లో, గోడల మాటునా, సందుల్లోనూ మట్టి కుప్పలను పేరుస్తారు. కళ్ళు తెరిచిన మొదటి జట్టువాళ్ళు వాటిని నిర్ణీతసమయం లోపున కనిపెట్టి చెరిపేయాలి. అట్లా చెరపకుండా మిగిలినవి ఎదుటి జట్టు వాళ్ళ స్కోరు. (https://te.wiktionary.org/wiki/వెన్నెలకుప్పలు)

17 బంగారు, వెండి వంటి లోహాల నుండి తీగలను తీసే పనిముట్టు.

దండెత్తడానికి వెళ్ళే మన్మథుడిపై రతీదేవి పోసే తలంబ్రాలలాగా, ఎండవల్ల ఆకాశమనే శరీరానికి పట్టిన చెమట బిందువుల లాగా మెరిసినాయి.

పారిజాతవృక్షాన్ని సత్యభామ కోసం కృష్ణుడు హరించి తీరుతాడని ముందే గ్రహించినందున వదలని దిగులుతోనున్న ఇంద్రుడి రాజ్యలక్ష్మి ముఖముపైనున్న వెలవెలపాటును పోలిన తెల్లనికాంతి తూర్పున చంద్రోదయానికి ముందే ఆకాశంలో వ్యాపించింది.

కాలం అనే ఏనుగు చీకటి అనే చెట్టును పెకలించడానికి చాచిన దంతాల లాగా, ఆకాశమనే మొగలి చెట్టుకున్న తూర్పు అనే చిటారుకొమ్మపై అరవిరిసిన పూరేకులలాగా, తూరుపు కొండ అనే జాబిలి పురిటింటి గోడలకు ఇరువైపులా అద్దిన గంధపు పూతలలాగా, మన్మథుడి చోపుదారుల[18] చేతులలో ఉండే వెండి బెత్తాలలాగా, కలువలకు వెన్నెలనీరు పెట్టడానికి ఏర్పరచిన స్ఫటికమయమైన కాలువలలాగా చంద్రకిరణాలు మెల్లగా పైకి వచ్చినాయి.

వెన్నెల కిరణాలనే వెండితాళ్ళను చంద్రుడనే స్ఫటికపు కుండకు కట్టి దేవతలు అమృతసముద్రం నుండి అమృతాన్ని తోడుకుంటున్నారా అన్నట్లు చంద్రబింబం మెల్లమెల్లగా మింటికెక్కింది.

దేవతలు తమ ఆహారాన్ని ఉంచుకునే గంప, వేయి కిరణాలుగల సూర్యుడికి జోడెద్దు, చీకటిని నశింపజేసేవాడు, కలువలకు చక్కిలిగింత,

[18] చోపుదారు/కంచుకి = రాజుగారి రాకను సూచిస్తూ హెచ్చరికలు చేసే సేవకుడు

వేశ్యలకు అపశకునము, పద్మాలనే కొత్త కోడళ్ళను దారి తొలగేలా చేసే బావగారు[19], చక్రవాకపక్షులకు గుండెకోత. కలువలకు మిత్రుడు అయిన చంద్రుడు తూర్పున కనిపించాడు.

పడమటి సముద్రపు ఒడ్డు అనే పొలంలో సాయంకాలము అనే రైతు సూర్యుడనే అరటి దుంపను నాటాడు. ఆ దుంప నుంచి ఎర్రని మేఘాలనే మొలకలు మొలకెత్తినాయి. చీకటి అనే ఆకులు వ్యాపించినాయి. తూర్పు దిక్కున పూర్ణచంద్రుడనే గెల వేసింది. వెన్నెల అనే సంపద కలిగింది[20].

కాలము అనే విలాసపురుషుడు కెంపులతో, ముత్యాలతో అందమైన హారాన్ని కూర్చుకుంటున్నాడు. సంధ్యాకిరణమనే దారంలో అస్తమిత-సూర్యుడనే కెంపును గ్రుచ్చాడు. ఇంతలో సూర్యాస్తమయం అయ్యింది. 'వరుస తప్పిం'దని అనుకొని దాన్ని తోసివేసి, ఆ పిమ్మట బెజ్జంతో కూడిన ముత్యం వలె ఉన్న నల్లని మచ్చగల చంద్రుడిని ఆ దారంలో గుచ్చాడు.

సంధ్యాలక్ష్మిని అలంకరిస్తున్నది పడమటి దిక్కు అనే స్త్రీ. ఆమె తన చేతిలోని సూర్యుడనే లత్తుక పట్టికను సముద్రంలో ముంచి పిండి తీసిన ఎర్రని నీళ్ళలా ఉన్నాయి సంధ్యారుణకాంతులు. ఎరుపును కోల్పోయి వెలిబారిన లత్తుక పిడచ వలె ఉన్నాడు తూర్పున ఉదయించిన చంద్రుడు.

---

[19] పద్మాలు చంద్రుడిని చూస్తే ముడుచుకుంటాయి. అత్తవారింట బావగారు ఎదురైనప్పుడు కొత్తకోడళ్ళు దారి తొలగటం ఒక ఆచారం.

[20] అస్తమించే సూర్యుడు నాటబడ్డ ఎర్రని అరటి గడ్డ. ఆకులు చీకటి. ఉదయించే చంద్రబింబం అరటి గెల. అరటి చెట్టు తూర్పున గెల వేస్తే సంపద కలుగుతుందని ఒక నమ్మకం.

రాత్రి అనే పార్వతీదేవిపై తనకు వలపు కలిగేందుకు చుక్కలనే బాణాల వాన కురిపించిన చీకటి అనే మన్మథుడిని జాబిల్లి అనే ముక్కంటి (చంద్ర) ఉదయకాలపు ఎర్రదనము అనే తన అగ్నినేత్రంతో కాల్చివేసి, ఆ బూడిదను పులుముకున్నాడా అన్నట్లున్నాడు, ఉదయకాలపు ఎరుపును విడిచి తెల్లగా వెలుగుతున్న చంద్రుడు.

తూర్పు అనే స్త్రీ ధరించిన కెంపు పొదిగిన ముత్యాల కర్ణాభరణం పొద్దుపొడుపు కొండతో ఒరుసుకోగా అందులోని కెంపు ఊడిపోయింది. దాని స్థానంలో కనిపించే శూన్యం వలె కనపడుతున్నది చంద్రుడిలో ఉన్న మచ్చ.

చంద్రుడు బలరాముడిలా ఉన్నాడు. చంద్రుడు తాగే మద్యం అమృతం. చంద్రుడు ఉదయించినప్పటి ఎర్రని కాంతి బలరాముడు వంటికి పూసుకున్న రక్తచందనపు పూతలా ఉంది. చంద్రుడిలో మచ్చ బలరాముడి నల్లని ఉత్తరీయము. బలరాముడు నాగలితో యమునానదిని లాగి ప్రవహింపజేసినట్లు, చంద్రుడు తన కిరణాలతో చీకటిని కలిచి పారిపోయేలా చేసాడు. కష్టంలో ఉన్న తన చెలి యమునానదిని ఓదార్చడానికి వచ్చిన గంగానది యొక్క ప్రవాహాన్ని తలపిస్తున్నాయి వెన్నెల వాకలు.

కలువభామ వధువు. వరుడేమో చంద్రుడు. పెండ్లినాడు వారిద్దరికీ కలిగిన సాత్త్వికభావపు చెమట వలె ఉన్నది, చంద్రకిరణాలచేత చిలకబడ్డ సన్నని తెలి మంచు.

చకోరపక్షులనే పేరంటాళ్ళు మన్మథోత్సవం చేయాలనుకొన్నారు. అందరికీ బువ్వపుబంతి[21] పెడుతున్నారు. దానికోసం, విరహుల శరీరం సోకి వేడెక్కిన వెన్నెలకు పచ్చి వెన్నెలను కలిపి నులి వెచ్చగా చేశారు. కలువ పుప్పొళ్ళతో కలుషితమైన వెన్నెలను సన్నని వెన్నెలతో వడకట్టారు. చంద్రకాంతపు నీటితో కలిసి పలుచపడ్డ వెన్నెలకు ముదురు వెన్నెలను కలిపి జుర్రుకోవడానికి వీలుగా చేశారు. స్త్రీల శరీరాలకు పూసిన పూతలతో పరిమళించే వెన్నెలను, తృప్తినిచ్చే వెన్నెలతో కలిపి రసాయనంగా చేసి వడ్డిస్తున్నారు.

ఆ వెన్నెల రాత్రి శరత్కాలాన్ని గుర్తుకు చేస్తున్నది. శరత్కాలంలో మేఘాలు తొలగినట్లు వెన్నెల రేయిలో కామినుల బిడియము తొలగి-పోతున్నది; రెల్లుపూలగుంపులవలె ప్రకాశిస్తున్నాయి తెల్లని కలువలు. శరత్కాలంలో ఎర్రని వర్షాకాలపు నదుల నీరు తేటబారినట్లు, వెన్నెల సంధ్యారుణిమను వదిలించుకొని తెల్లబారుతున్నది. చీకటి గుంపులనే బురద ఇంకిపోయింది. శరత్కాలపు వెన్నెలలో కడలి పోటెత్తినట్లు, ఈ వెన్నెల రాత్రిలో యువకులలో ప్రేమసాగరాలు ఉప్పొంగిపోయినాయి. వానాకాలంలో వికసించిన జాజులు శరదృతువులో ముడుచుకు-పోయినట్లు, ఈ వెన్నెల వేళలో తామరలు ముడుచుకొని ఉన్నాయి. శరత్తులో హంసలు చెలరేగినట్లు, ఆ వెన్నెల రాత్రి సమయంలో చకోర-పక్షులు విజృంభించినాయి. శరత్కాలంలో మెరుపులు కనబడవు, ఈ

[21] వివాహాది సందర్భాలలో బంధువులంతా కలిసి చేసే పంక్తిభోజనం

వెన్నెల రాత్రిలో అభిసారికలనే మెరుపు తీగలు కనుమరుగైనారు. అటువంటి పున్నమి రాత్రి, పూల వింటికి తుమ్మెదల బారనే నారిని బిగించి మన్మథుడు విజృంభించి విరహుల పైన యుద్ధానికి బయలుదేరాడు.

శ్రీకృష్ణుడి గడియారంలో ఒక జాము గడిచిందని తెలిపే గంటలు మోగినాయి[22]. ఆ ధ్వనులు మన్మథుడు అభిసారికలను హింసించడం కోసం చేస్తున్న ధనుష్టంకారాల వలె ఉన్నాయి (ఇంకా జనసంచారం సద్దు మణగనందున అభిసారికలు ప్రియ సమాగమానికి వెళ్ళలేక ,మదనుడి హింసకు తాళలేక పోతున్నారు.) అప్పటిదాకా బిగుసుకుని తమ ప్రియులపై ప్రణయకోపం చూపిస్తున్న పడతులు, మొదటి జాము గంటలు మోగగానే, ఇంకా బిగువుగా ఉంటే మొదటికే మోసం వస్తుందని, కోపాన్ని విడిచిపెడుతున్నారు.

సన్నని తెల్లని చీరలు కట్టి, తెల్లని హారాలు, జాజిపూలు ధరించి, చందనం పూసుకుని వెన్నెలలో వెళ్తే, తెలుపులో తెలుపు కలిసిపోయి

[22] ద్వాపరయుగంలో గంటలు కొట్టే గడియారాలు ఉండేవా? ఈ గంటల చప్పుళ్ళు కృష్ణదేవరాయల హజారంలో మ్రోగగా కవి చెవిన పడినవే అయివుండాలి. ఆ కాలములో "రాజసౌధముఖశాల (మోసాల)పై ఘటికాయంత్ర ముండెను. ఘడియ కొకసారి గంటలు లెక్కప్రకారము కొట్టుతూ వుండిరి." అని వ్రాసారు సురవరం ప్రతాపరెడ్డి గారు 'ఆంధ్రుల సాంఘికచరిత్ర'లో. ఈ ఘటికాయంత్రము నీటి గడియారమట.
(https://te.wikisource.org/wiki/ఆంధ్రుల_సాంఘిక_చరిత్ర/4_వ_ప్రకరణము).

ఎవరికీ కనుపించరు. అందువల్ల అనుమానాలను కట్టిపెట్టి రమ్మని దూతికలు అభిసారికలను సంకేతస్థలాలకు తీసుకుని పోతున్నారు[23].

వెన్నెల విహారాలు

చంద్రమండలం నుండి కురిసే పండు వెన్నెలలు, సంధ్యానృత్యంలో పరమశివుడి అట్టహాసంలా తెల్లగా ఉన్నాయి. తూర్పు సముద్రపు తీరాన ఆడుకుంటున్న ఐరావతము తన తొండముతో పైకి ఎగజిమ్మే ఇసుక రేణువులను తిరస్కరించేలా ప్రకాశిస్తున్నాయి చంద్రకిరణాలు. చీకటి అనే బలిచక్రవర్తిని అణిచివేస్తున్న సమయమనే విష్ణువు యొక్క పాదం నుండి పుట్టిన ఆకాశగంగలా తెల్లగా ప్రకాశిస్తున్నాయి. చంద్రకాంతమణులతో నిర్మించిన మేడల శిఖరాలు మంచుకొండలను పోలి ఉన్నాయి. వాటిపైన పడే చంద్రకిరణాలు గొప్ప వెన్నెల ప్రవాహాలుగా మారి ఆ మేడలలో బెట్టు చేస్తున్న స్త్రీల అహంకారాలనే గట్లను తెంచి వేస్తున్నాయి. నదులు గుహాముఖాలను ముంచివేస్తూ పెద్దగా శబ్దం చేసినట్లు, ఈ వెన్నెల అనే నది విరహాతిశయంతో నున్న చక్రవాకపక్షుల కంఠకుహరాలను ముంచెత్తుతూ తీవ్రమైన కలరవాలకు కారణమవుతున్నది. అరవిరిసిన కలువ మొగ్గలలో వెన్నెల సుడులు తిరుగుతున్నది. వీచే పిల్లగాలికి ఎగసి కుప్పలై పడిన

[23] ఇతరులు గుర్తించకుండా వెన్నెలలో కలిసిపోయే వేషభూషలను ధరించి వెళ్ళే అభిసారికలు జ్యోత్స్నాభిసారికలు.

పుప్పొడి తిప్పల మీద దొర్లిన చంద్రకిరణాలు మరింత తెలుపుతో వెలుగుతున్నాయి.

బంగరు ఊయలలలో ఊగుతున్న పడతుల చెక్కిళ్ళ తళతళలతో కలిసి వెన్నెలలు మరింత తెల్లబడినాయి. వెన్నెల ప్రవాహాలు కటిక చీకటి అనే చెట్లను పెకలించివేస్తున్నాయి. బ్రహ్మాండమనే భరిణకు పూసిన వెండిపూతలా ఉన్న వెన్నెల భూమినంతా ఆక్రమించింది.

వెన్నెల స్పర్శకు కరుగుతున్న చంద్రకాంతశిలాపాత్రలు తమలో ఎప్పుడు మద్యాన్ని నింపుతారా అని ఉవ్విళ్ళూరుతున్నట్లున్నాయి. ఆ చలువరాతి గిన్నెలలో, కర్పూరమిళితములైన పాత్రలలో మధువును నింపి తాగుతూ ఉన్న కామినీకాముకులు, పరస్పరము మధువుతో తడిసిన పెదవులను చుంబించుకుంటూ వివశులైపోతున్నారు. చలువపందిళ్ళలోని పుప్పొడి తిన్నెలపైకి చేరుకుంటున్న దంపతులు తమ శరీరశోభావిశేషాలు బయటపడకుండా, కర్పూరం, కస్తూరి, జవ్వాదివంటి పరిమళ ద్రవ్యాలు కలిపిన చందనాన్ని పరస్పరం అలదుకుంటున్నారు. ప్రౌఢలైన చెలికత్తెలు, సిగ్గుపడుతున్న నూత్నవధూవరులను అతిప్రయాసతో తోసుకుంటూ తీసుకొని తెచ్చి ఒక్కదగ్గరకు చేర్చి వెనకకు మరలుతున్నారు. మన్మథుడు సేనతో యుద్ధానికి వచ్చి బాణాలను కురిపించినట్లు ఆ దంపతుల చూపులు వెలిగి పోతున్నాయి. వాళ్ళ కోరికలు పురులు విప్పినాయి. శరీరాలు పొంగినాయి. ఆలింగనాలలో వాళ్ళ హృదయాలు కరిగి-పోయినాయి.

ఆ సమయంలో - అమూల్యమైన మణిదీపాలతో ప్రకాశించేదీ, స్వచ్ఛమైన పట్టు మేలికట్లతో [24] కూర్చినదీ, వేలాడుతున్న ముత్యపు కుచ్చుల కాంతులతో ప్రకాశించేదీ, రకరకాల చిత్రాలతో కూడిన స్ఫటికపు గోడలతో ప్రకాశించేదీ, మెత్తని హంసతూలికలతో చేసిన పరుపు పరచిన రత్నాల మంచం కలదీ, తాంబూలపు సామగ్రి అమర్చబడినదీ, కస్తూరికాది పరిమళద్రవ్యాలు సమకూర్చబడినదీ, పూల వీవనలు గలదీ, తామరతూళ్ళ దారాలతో కట్టిన పూలదండలు గలదీ, చల్లని నీటిపాత్రలు గలదీ, మాణిక్యాలు తాపడం చేసిన అద్దాలు కలదీ అయిన పడకటింట్లో కృష్ణుడూ సత్యభామా వినోదక్రీడలతో సుఖించి నిద్రించారు.

శుక్రోదయము

సూర్యుడు తన బంధువర్గంలోని వారైన నక్షత్రాలను బాధించడానికి వస్తున్నాడనుకొన్న శుక్రుడు అతడితో యుద్ధం చేసేందుకు ముందుగా తన శిష్యులైన మందేహులనే [25] రాక్షసులను పంపి ఆ వెనుక తాను

---

[24] మేలికట్టు/మేలుకట్టు/మేల్కట్టు = వితానము, చాందినీ, ఒల్లెడ(canopy); బట్టతో వేసిన పైకప్పు

[25] "మందేహులు/మందేహారుణులు = బ్రహ్మనుగూర్చి తపము ఆచరించి సూర్యునితో పోరాడునట్లు వరము పడసినవారు. వీరి సంహారార్థము త్రిసంధ్యలయందును బ్రాహ్మణులు గాయత్రిచే అభిమంత్రించిన అస్త్రములను అర్ఘ్యమూలముగ విడుతురు. వారు ఆ యస్త్రములచేత సంహరింపఁబడియు వరదానమహిమచే పునర్జీవితులు అగుదురు." (పురాణనామచంద్రిక; https://www.andhrabharati.com/dictionary/?w=మందేహారుణులు)

వస్తున్నాడా అన్నట్లు వేగుచుక్క (శుక్రతార) ఉదయించింది. కాలమనే పాముపడగ మీద ప్రకాశించే మాణిక్యం లాగా ప్రకాశించింది.

మేలుకొలుపులు

అప్పుడు వైతాళికులు తమ మృదువైన గీతాలతో శ్రీకృష్ణుణ్ణి భూపాలరాగాలతో కూడిన స్తోత్రాలతో ఈ విధంగా మేలుకొలుపులు పాడారు -

"జయ గోవింద! ముకుంద! చక్రధర! కంసద్వేషీ! సాత్రాజితీప్రియ! నారాయణ! కౌస్తుభాభరణ! గజేంద్రరక్షకా! కాళీయసర్పదర్పహరణా! గరుడవాహనా! వనమాలీ! కృష్ణా! వైకుంఠవాసా! శౌరీ! యశోదాత్మజా! భక్తవత్సలా! మురారీ! గోపికావల్లభా!

"సముద్రమధ్యమున (ద్వారకలో) నివాసం ఉన్నవాడా! శార్ఙ్గధనుర్ధారీ! సజ్జనులచేత ధ్యానింపబడేవాడా! రవిచంద్రనేత్రా! పద్మనాభా! శూర-కులాలంకారా! శేషశయనా! గోవర్ధనోద్ధారా! కాంతిమయశరీరా! శౌర్యముతో ప్రకాశించేవాడా! శంఖచక్రధరా! శంకరప్రియా! దేవా! నిద్రనుండి మేలుకో.

"రామచిలుకలు నిద్రలేచి, వాటికి మాటలు నేర్పే అంతఃపురస్త్రీలను తమకు మాటలు నేర్పమని ముద్దుపలుకులతో మేలుకొలుపుతున్నాయి. ప్రభూ! మేల్కొనండి. (పక్షులు ప్రభాతసమయ సూచనగా కిలకిలారావాలు చేస్తున్నాయి అని కవి హృదయం.)

“సరసిజాక్షా! చంద్రుడు పడమటి కొండలోని దావాగ్ని చేత కాల్చబడిన కామధేనువు పేడ పిడకలా ఉన్నాడు. చకోరాలనే తేనెటీగలు వెన్నెల అనే తేనెను తాగివేసాక నిస్సారమయిపోయిన తేనెపట్టువలె ఉన్నాడు, పశ్చిమ-దిక్కుకు ప్రయాణంచేసే రాత్రి అనే ముసలి స్త్రీ యొక్క తెల్లని కేశబంధంలా ఉన్నాడు. ఆకాశమనే సౌధానికి సున్నం వేసే కాలమనే శిల్పి పిండి పారేసిన సున్నపు గుడ్డపిడచ వలె ఉన్నాడు.

“వెన్నెల తీగకు పూచిన పూలగుత్తిలా ఉన్నాడు చంద్రుడు. బూడిద రంగులోకి మారి, చక్కదనం కాస్తా పోగొట్టుకుని కేవలం బింబమాత్రంగా వెలుగుతూ నెమ్మదిగా అస్తమిస్తున్నాడు.

“చీకటి అనే దొంగకు భయపడిన సూర్యుడు వెలుగనే తన సంపదను ఇంటి దీపాలలో దాచుకొని మళ్ళీ ఉదయాన్నే తిరిగి తీసుకుంటున్నాడు. అది గమనించిన చంద్రుడు, ఈ గృహదీపాలు మంచి కావలి కాపులని భావించి, తానూ తన కాంతిని వాటిలో దాచుకున్నాడేమో అన్నట్లు, గృహ-దీపాలు తెల్లబడ్డాయి.

“ఇంటి ముందు జాము కావలి కోసం నిలుపబడ్డ ఏనుగులు[26] - తమ అరమూసిన కళ్ళతో, చెక్కిళ్ళ నుండి కారుతున్న మదజలాలను ఆస్వాదించడానికి తిరుగాడుతున్న ఆడు తుమ్మెదల ఝుంకారాలనే

---

[26] రాజభవనం వద్ద వంతులవారీగా ఏనుగులను కాపలా కోసం ఉంచేవారట. ఈ జాముటేనుగులు శృంగారనైషధంలో, కాదంబరి కావ్యంలో కూడా కనబడతాయి).

పాటలతో, కదిలే చెవులనే తాళవాద్యాలతో, హస్తవిన్యాసాల వంటి తొండపు కదలికలతో – నీ స్తోత్రం చేస్తున్న మాగధులను పోలి ఉన్నాయి.

“కాలమనే గోపబాలుడు (కృష్ణుడు) విజృంభించి, చీకటి అనే రాక్షసి (పూతన) యొక్క చంద్రుడనే స్తనమండలంలో ఉన్న కళంకమనే విషంతో కూడిన కాంతి అనే పాలధారలను పీల్చివేసి నశించేలా చేశాడు. అప్పుడా రాక్షసి మూర్ఛపోతూ నక్షత్రాలనే కనుగుడ్లు వాలిపోయేలా గట్టిగా నిట్టూర్చిందా అన్నట్లు ఉదయపు గాలులు బాగా వీచినాయి.

“వేకువజామున కురిసిన మంచులో తడిసిన చిగురాకులు, కృష్ణుడి ఎడబాటు వల్ల దుఃఖంతో ఏడ్చే యువతుల కన్నీటి బిందువులతో కూడిన దొండపండు వంటి పెదవులలా మెరుస్తున్నాయి.

“పద్మం అనే స్త్రీ పరిమళంగల కస్తూరి మాత్రలను నోట్లో వేసుకుని పుక్కిట్లోనే ఉంచుకుని నిద్రపోయి, లేచాక వాటిని ఉమ్మివేసిందా అన్నట్లు తామర మొగ్గలనుండి కొదమ తుమ్మెదలు చెలరేగినాయి[27].

“వేకువ జామున కోళ్ళు కూస్తున్నాయి. సూర్యుడి రథసారథి కిరణాలనే తాళపుచెవులతో తెరుస్తూ ఉండగా చీకటి తలుపులు చేస్తున్న కిర్రు చప్పుడు వలె ఉన్నాయి ఆ కోడి కూతలు, కలువలు అనే శిశువులను

[27] పద్మాలు రాత్రి వేళలో ముకుళిస్తాయి. అప్పుడు వాటిలో మధువు కోసం చేరిన తుమ్మెదలు చిక్కుకుపోతాయి. తెల్లవారుతుండగా మళ్ళీ తామరలు వికసిస్తాయి. అప్పుడు వాటిలో చిక్కుకు పోయిన తుమ్మెదలు ఒక్కసారిగా బయటపడతాయి. ఈ దృశ్యాన్ని ఉత్ప్రేక్షిస్తున్నాడు కవి.

నిద్రపుచ్చుతూ, జోల పాడటానికి “చిచ్చొళుళువ హాయీ” అంటూ చేసే చప్పుళ్ళలాగా ఉన్నాయి. సూర్యగమనాన్ని అడ్డగించేందుకు వేగంగా వస్తున్న మందేహులనే రాక్షసుల సింహగర్జనల లాగా ఉన్నాయి.

“రాజు ముట్టడి మాని శిబిరాన్ని ఎత్తివేసి పోగా, నక్షత్రాలనే భటులు తాము విడిదిచేసిన స్థలాలలో రగిల్చిన మంటలలా ఉదయాకాశం ఎర్రని రంగును పులుముకున్నది.

“పద్మిని అనే స్త్రీ ఆవులించినప్పుడు దిక్కులనే కాంతలు వేస్తున్న చిటికెల శబ్దాలవలె ఉన్నాయి – తామరలు వికసిస్తున్న చెరువు పక్కన గూళ్ళలోని పక్షుల రెక్కల చప్పుళ్ళు.

ప్రభాతశోభ

“రాత్రి ప్రసన్నమయింది (ప్ర-సన్న = క్షీణించినది). దిక్కులూ ప్రసన్నమయ్యాయి (ప్రసన్నత = నిర్మలత్వము/ప్రకాశము). యువతుల పెదవులు అపరాగయుక్తమయ్యాయి (అప-రాగయుక్తములు = ఎరుపు తగ్గినవి). చంద్రుడూ అపరాగయుక్తుడయ్యాడు (అపర-అగ-యుక్తుడు= పడమటి కొండను కూడియున్నవాడు/చేరుకున్నవాడు). అన్ని వస్తువులు అతిరోహితమయ్యాయి (అ-తిరోహితములు = చీకటి అనే ఆచ్ఛాదన తొలగినవి; స్పష్టముగా కనబడుతున్నవి). పర్వతశిఖరాలూ అతి-రోహితాలయ్యాయి (అతి-రోహితములు = మిక్కిలి ఎర్రని కాంతితో ప్రకాశిస్తున్నవి). నగరంలోని సౌధాగ్రభాగాలు ఆత్తసౌరభాలయ్యాయి

(ఆత్త-సౌర-భములు = సూర్యకాంతిని పొందాయి). తామరలు కూడా ఆత్తసౌరభాలయ్యాయి (ఆత్త-సౌరభములు = పరిమళములను కలిగినవి). లేగదూడలు విచ్యుతప్రగ్రహాలయ్యాయి (విప్పబడిన పలుపుతాళ్ళు కలవి). ఆకాశం కూడా విచ్యుతప్రగ్రహం అయ్యింది (శుక్రాది గ్రహాల చేత విడువబడినది). నియమపరులైన బ్రాహ్మణులు సమాధిగతులయ్యారు (ధ్యానస్థితిలో ఉన్నవారు) ఉన్నారు. గుడ్లగూబలూ సమాధిగతమయ్యాయి (నిద్రావస్థలో ఉన్నవి).

"సూర్యకిరణాలు దిక్కులంతటా వ్యాపిస్తూ ఉండగా కలువపూవు ముడుచుకుపోయింది. కలువలలోపల ఉన్న లక్ష్మి (కలువల సొగసు) సూర్యుడి కంటబడకుండా రేకులను కప్పుకున్నదా? రాజపత్నులు (రాణులు /చంద్రుడి భార్యలైన కలువలు) అసూర్యంపశ్యలు కదా!

"మేత కోసం గూళ్ళను వదిలిన పక్షులు చేసే కొల-కొల చప్పుడు తన మృదుసంభాషణగా వేకువ అనే వనిత దోహదక్రియ చేయగా, తూర్పు కొండ అనే గోగుచెట్టు పుష్పించినట్లు[28] సూర్యుడు ఎర్రని కాంతులతో ఉదయించాడు."

[28] చెట్లకు, పొదలకు, తీగలకు కాలం కాని కాలంలో పూలను పూయించే క్రియలను దోహదక్రియ అంటారు. సైన్సు ఒప్పదు కానీ సంస్కృతాంధ్రకావ్యాలలో దోహదక్రియలు తరచుగా కనబడతాయి. గోగుపూల చెట్టుకు ప్రియమైన మాటలు చెప్పడము దోహదక్రియ.

శ్రీకృష్ణుని ప్రయాణం, స్వర్గాగమనము

మాగధుల మధురవాక్యములను వింటూ శ్రీకృష్ణుడు నిద్ర మేల్కొన్నాడు.

నిద్రలేచిన ఆ మన్మథజనకుడు కాలకృత్యాలు తీర్చుకుని, పురో-హితులతో, వృద్ధులైన మంత్రులతో కలిసి ఆస్థానమంటపానికి వెళ్ళాడు. ఉగ్రసేన, వసుదేవ, బలభద్రాది పెద్దలకు నమస్కరించి, సాత్యకి, సారణాది తమ్ముళ్ళను ఆదరించాడు. ప్రద్యుమ్న సాంబాది కుమారుల ప్రణామాలను స్వీకరించాడు. యదు-వృష్ణి-కురు-భోజ-అంధక మొదలైన వంశములకు చెందిన బంధువులను పలకరించాడు. సభచేసి రాచకార్యాలను ముగించి, గరుత్మంతుని స్మరించాడు.

అప్పుడు, ఇంద్రుడు తనపై వజ్రాయుధాన్ని ప్రయోగిస్తే దాని గౌరవాన్ని నిలపడం కోసం ఒక ఈకను వదలిన వాడు, గజకచ్ఛపాలను ఆహరించిన-వాడు, తల్లి దాస్యాన్ని పోగొట్టడానికి దేవలోకం నుండి అమృతాన్ని తెచ్చిన మాతృభక్తుడు, లోకబాంధవుడైన సూర్యుడికి సారథియైన అనూరుడికి ముద్దుల తమ్ముడు, పక్షిరాజ్యాధినేత, సర్పాల వేటగాడు, కశ్యపప్రజాపతి పుణ్యఫలం, త్రిపురదహనసమయంలో శివుడికి విష్ణువు బాణమైనప్పుడు ఆ బాణానికి రెక్కగా అమరినవాడు, గజకచ్ఛపములను తినబోయే సమయంలో రోహిణమనే చెట్టు కొమ్మను విరిగేటట్లు చేసినవాడు, వాయువేగమనోవేగాలను మించిన వేగము కలవాడు అయిన గరుత్మంతుడు వచ్చి శ్రీకృష్ణుడి ముందు నిలిచి, వినయంగా

నమస్కరించాడు. ఆ గరుత్మంతుడు నేల మీదికి దిగగానే, భూమిని మోస్తున్న ఆదిశేషుడి తలలు కిందికి అదిమినట్లైనాయి. తనకు నమస్కరించి నిలిచిన గరుడుడితో, శ్రీకృష్ణదేవుడు, నారదుడు రావటం, పారిజాతపుష్పాన్ని కానుకగా ఇవ్వటం, తానది రుక్మిణీదేవికివ్వటం, ఆ విషయాన్ని చెలికత్తెల ద్వారా విన్న సత్యభామ అలగటం, తాను ఆమె అలక తీర్చి పారిజాతవృక్షాన్ని తెచ్చి ఇస్తానని ప్రతిజ్ఞ చెయ్యటం వరకూ జరిగిన కథనంతా ఆదరంగా చెప్పాడు. అప్పుడు గరుత్మంతుడు, "దేవా! పూర్వం వజ్రాయుధంతో నా రెక్కను కొట్టిన ఇంద్రుడిపై నాకు కోపంగా ఉన్నది. నీ దయ వల్ల నా పగ తీరబోతున్నందుకు చాలా ఆనందంగా ఉన్నది." అని అన్నాడు.

గరుత్మంతుడు అలా అనగానే, శ్రీకృష్ణుడు, "నువ్వు అంతటి వాడివే కదా", అని ప్రశంసించి, తరువాత తన బంధుమిత్రులను, హితులను పిలిపించి తన స్వర్గలోకప్రయాణం గురించి చెప్పి, పట్టణరక్షణకు ఏర్పాట్లు చేసి, పెద్దల అనుమతిని పొంది, సత్యభామతో కలిసి గరుడుణ్ణి అధిరోహించాడు. అంతట గరుడుడు తన రెక్కల గాలి కారణంగా ఆకాశంలోని మేఘాలు దూది పింజలలా తేలిపోతుండగా, మనోవేగంతో ఆకాశానికి లేచాడు. అలా వాళ్ళు వెళ్తుంటే, వారి ఇరువైపులా, నందక-ఖడ్గము, శార్ఙ్గ ధనుస్సు, కౌమోదకీ గద మొదలైన ఆయుధాలు బయలుదేరి వెంట వస్తున్నాయి. గరుత్మంతుడి రెక్కల గాలి నిండటం వల్ల పాంచజన్యశంఖం ఎవ్వరిచేత ఊదబడకుండానే ఘుమఘుమమని మోగుతున్నది. అలా ఆకాశమార్గాన వెళ్తుంటే, మేఘాల నుండి సత్యభామ

తలపై పడిన నీటిచుక్కలు ఆకాశలక్ష్మి కానుకగా ఇచ్చిన ముత్యాల గుత్తిలా మెరుస్తున్నాయి. మెరుపులతో ఉన్న మేఘాలు కృష్ణుడికి బంగారు కాడలతో ప్రకాశించే నల్లని గొడుగులు పట్టినట్లున్నాయి. శ్రీకృష్ణుడి ఒంటి నల్లని కాంతి, తన తండ్రి సూర్యుణ్ణి చూడటానికి యమునానది ఆకాశ-వీధిలోకి ఎగసిందా అన్నట్లున్నది. గరుత్మంతుడి రెక్కల వల్ల పుట్టిన గాలి వేగాన్ని తట్టుకోలేక సూర్యరథాన్ని లాగుతున్న గుఱ్ఱాలకు కళ్ళాలుగా కట్టిన పాములు ఆ రథము కిందికి జారిపోగా, గుఱ్ఱాలు నొగను విడిచిపెట్టి పక్కకు పోతుంటే సూర్యుడి సారథి అయిన అనూరుడు వాటిని అదిలించి దారిలో పెడుతూ కాలం నిలిచిపోకుండా జాగ్రత్తపడుతున్నాడు. దారిలో ఎదురైన తన అన్న అనూరుడికి గరుడుడు ఆగకుండానే నమస్కరించగా, అనూరుడు కూడా రథాన్ని నడుపుతూనే తమ్ముణ్ణి ఆశీర్వదించాడు. (ఇది నేడు సైన్యంలో ఉన్నవాళ్ళు చేసే బాయేఁ-దాహినే సెల్యూట్లను తలపిస్తున్నది.) ఆ దృశ్యాన్ని చూసి సత్యభామాకృష్ణులు ఆ అన్నదమ్ముల చాతుర్యాన్ని మెచ్చుకున్నారు.

మురారి అలా ఆకాశవీధిలో ప్రయాణిస్తూ, చిరునవ్వు నవ్వుతూ సత్యభామతో ఇలా అన్నాడు. "సత్యా! చూస్తున్నావా - అపరగరుడుడిలా బంగారు రంగు కాంతితో కప్పబడినదీ, వజ్రాయుధపు దెబ్బ తిన్న రెక్కలు గలదీ, సూర్యచంద్రుల వంతులవారీ పహరా[29] వలన రక్షింపబడుతున్నదీ అయిన మేరుపర్వతాన్ని? కన్నుల పండువుగా ఉన్నది కదూ! ఇక్కడి

[29] సూర్యచంద్రులు మేరుపర్వతం చుట్టూ పరిభ్రమిస్తారని పురాణకథనం.

పండుటాకులతో నిండిన చెట్లపై పడుకొని ఉన్న పాముల పడగలపైని రత్నాల కాంతులను చూసి కోయిలలు లేత చివుళ్ళని భ్రమిస్తున్నాయి. చంద్రకాంతమణులకాంతులను చూసి, నీరనుకొని భ్రమపడి కుమ్మటం వల్ల అడవి దున్నలు కొమ్ములు విరగగొట్టుకుంటున్నాయి. ఎలుగుబంట్లు గోమేధికరత్నకాంతుల మొలకలను చూసి తేనె బిందువులనుకొని వాటిని నాకాలని చూస్తున్నాయి, సింహాలు నీలరత్నపు గండశిలలను చూసి ఏనుగులని పొరబడి చీల్చబోయి గోళ్ళు విరగ్గొట్టుకుంటున్నాయి. గరుడ-పచ్చ రాళ్ళ కాంతులను చూసి, గడ్డిమోపులనుకొని తినాలన్న కోరికతో ఉన్న లేడిపిల్లలు అక్కడి పద్మరాగమణుల ఎర్రని కాంతులను చూసి దావా-నలమనుకొని వాటి మీదనుంచి దుమికిపోతున్నాయి. ఈ మేరుపర్వతం దేవతల కొండ!

“ఈ కొండ మీద ఉండే చెంచితలు చందమామ తమకు దగ్గరగా వచ్చినప్పుడు, చంద్రుడిలోని లేడిపై బాణం వేసి, అది చచ్చిపోయిందని మురిసి, తరువాత చంద్రుడిలో ఉన్న అమృతంతో తడిసిన ఆ లేడి ఇంకా జీవించి ఉన్నందున, తమ గురి తప్పినందుకు సిగ్గుపడి విల్లమ్ములను పారవేసి తిరుగుతున్నారు.

“ఆ బంగరు కొండపై ఏనుగులు అన్యోన్యంగా చెక్కిలీ చెక్కిలీ రాసుకోవటం వల్ల పెద్ద పెద్ద రాళ్ళ పగుళ్ళలో నిండిన కాటుక రంగు మదజలాన్ని సిరాగా చేసుకొని వనదేవతలచేత కర్ణాభరణాలుగా ధరించబడే తాటియాకులపై తమ ప్రియులకు సందేశపత్రాలు రాసి పంపే గంధర్వస్త్రీల వల్లనూ; తమ నోట కరచుకొని ఉన్న పాములను వదిలేసి

గాజువలె పారదర్శకంగా ఉన్న ఆ కొండ నేలలలో ప్రతిఫలిస్తున్న పాతాళనాగుల బింబాలను ముక్కులతో పొడుస్తూ రెక్కలతో కొడుతూ కాళ్ళతో తన్నుతూ కోపంతో విఫలప్రయత్నం చేస్తున్న నెమలి పిల్లలను తమ ప్రియులకు చూపించి నవ్వుతున్న గరుడజాతి స్త్రీల వల్లనూ; పగలు తీక్షణమైన సూర్యకిరణాల వల్ల సూర్యకాంతశిలల నుండి రేగుతున్న మంటల కారణంగా మరిగిన సెలయేటి నీరు సన్నని కాలువలై కరిగిన నల్ల జవ్వాది కొలనులలో పడి ఆ కొలను ఒడ్డున ఉన్న చెట్లను కోతులు ఊపగా రాలిన పూవులయొక్క వాసనతో ఘుమఘుమలాడుతుండగా ఆ పరిమళజలాలను ఒంటికి పూసుకొని రతిశ్రమను పోగొట్టుకుంటున్న యక్షకాంతల వల్లనూ, ఆ పర్వతం మీద సింహపు పిల్లల గోళ్ళచేత చీల్చ-బడిన ఏనుగుల కుంభస్థలాల నుండీ ఆ ఏనుగుల దంతపు పోట్లచేత బాధపడే అడవి పందుల నుండీ ఆ అడవి పందుల వాడి కోరలతో చీల్చబడిన వెదుళ్ళ నుండీ ఏపుగా ఎదిగిన ఆ వెదుళ్ళ కొనల చేత చీల్చబడిన మేఘాల నుండీ కుప్పలుగా పడిపోయిన ముత్యాలను [30] వేర్పరచుకుంటూ మాలలు గుచ్చుతున్న సాధ్యజాతి స్త్రీలవల్లనూ మనో-హరముగా ఉన్నదీ పర్వతము.

“అక్కడక్కడ కొండచరియలపై భుక్తాయాసంతో దొర్లుతున్న కొండ-చిలువల గుంపులను చూడు. తళతళలాడే వజ్రాయుధంతో ఇంద్రుడు ఈ

[30] ఏనుగుల కుంభస్థలాలలో, పందులలో, వెదురుచెట్లలో, మేఘాలలో (ఇంకా శంఖాలలో, ఆల్చిప్పలలో) ముత్యాలు పుడతాయని కవిసమయం.

పర్వతపు రెక్కలను నరకగా ఏర్పడిన గాయపు రంధ్రాలలో ఉంచిన జలగల వలె ఉన్నాయి అవి[31]. విశాలమైన రాళ్ళపైన నిద్రిస్తున్న పులులు దేవతల గోష్ఠీమంటపాలలో పరచిన రత్న కంబళ్ళను తలపిస్తున్నాయి. యథేచ్ఛగా తిరుగుతున్న తెల్లమూతి ఎలుగుబంట్లు చంద్రమండలాన్ని సగం మింగిన రాహుగ్రహం వలె ఉన్నాయి.

"ఈ మేరువు దేవేంద్రుడి సభ అయిన సుధర్మను పోలియున్నది. సుధర్మ భవనము శక్రపుర-మహిళాలి-కుచ-చందన-సుగంధ-అగురు-వాతపోతమేదురము (అమరపురిలోని స్త్రీల వక్షోజాలపై రాసుకున్న చందనం యొక్క గంధాన్ని మోస్తున్న పిల్లగాలులతో నిండి యున్నది). మేరువు కూడా శక్ర-పుర-మహిళా-లికుచ-చందన-సుగంధ-అగురు వాత-పోతమేదురము (శక్రములు = అంకుడు చెట్లు; పురములు = గుగ్గిలపు చెట్లు; అలి వృక్షములు = ప్రియంగు లతలు, లికుచములు = గజనిమ్మ చెట్లు; చందనవృక్షాలు; సుగంధభరితమైన అగురు చెట్లు – వీటన్నింటితోనూ, పిల్లగాలుల చేతనూ నిండి ఉన్నది).

"సముద్రముతో పోల్చదగ్గదీ మేరువు. సముద్రము నీల-నల-పనస-కీలిత-తుంగ-సేతు-సహితము (నీలుడూ, నలుడూ, పనసుడూ అనే

[31] గాయం/పుండు ఉన్న చోట్లలో జలగలను ఉంచితే అది చెడు రక్తాన్ని పీల్చి గాయాన్ని/పుండును మాన్పుతుంది. ఈ రకమైన వైద్యం చాలా దేశాలలో ఎప్పటినుంచో ఉన్నది. ఇప్పటికీ ఉన్నది, వివిధవ్యాధులను నయం చేసేందుకి జలగలను వాడే వైద్యాన్ని హిరుడో థెరపీ (hirudo therapy) అంటారు.

వానరవీరులచే కట్టబడిన ఎత్తైన ఆనకట్టతో ఉన్నది). మేరుపర్వతమూ నీలనల-పనస-కీలిత-తుంగ-సేతు-సహితమే (నల్లగడ్డి, పనసచెట్లూ, చిన్న చిన్న గుట్టలు, నీటి కట్టలు కలిగి ఉన్నది)

“సొగసైన దండము, ముఖము ఉన్నందుకు వీణ “లలితప్రవాళ-కకుభము” అని అనిపించుకున్నది. మేరుపర్వతము మీద లేత చిగుళ్ళు (లలితప్రవాళములు) ఉన్న మద్దిచెట్లు (కకుభములు) ఉంటాయి కనుక అదీ లలితప్రవాళకకుభమే.

“నూరు పర్వాలు ఉన్నందుకు మహాభారతం శతపర్వ అయ్యింది. నూరు కణుపులు (పర్వములు ఉన్న) వెదురు చెట్లతో మనోహరంగా ఉన్న మేరుపర్వతం కూడా శతపర్వయే.

“సమరభూమి “కలితానేకపాటనము” (కలిత-అనేక-పాటనము = అనేకమైన భగ్నదేహాలతో ఉన్నది). మేరు పర్వతమూ కలితానేకపాటనమే (కలితము = కూడియున్నటువంటిది; అనేకపము = ఏనుగు; అటనము = తిరగటము; కలితానేకపాటనము = ఏనుగుల సంచారము ఉన్న చోటు).

“వ్యాకరణశాస్త్రం ధాతుగణాలచే ప్రకాశిస్తుంది. మేరువు కూడా (గైరికాది) ధాతువులచే ప్రకాశించేదే. మంచి సంగీతం నిషాదభరితమై ఉంటుంది (నిషాదము = స్వరాలలో ఒకటి). మేరువూ అంతే (నిషాదులు = కిరాతులు).

“మేరువు గ్రావనిబద్ధౌఘము (గ్రావ-నిబద్ధ-ఓఘము = కొండలపై కూర్చినట్లు ఉన్న మేఘాలు కలది). అగ్రావనిబద్ధౌఘము కూడా (అగ్ర-అవని-బద్ధ-ఓఘము = అగ్రభూములలో గొప్ప నీటివనరులు కలిగి ఉన్నది).

“ఈ మేరువు గవయస్థానము (గవయమృగాలకు – అడవి ఎద్దులకు - స్థానమైనది కనుక). అది అగవయస్స్థానము కూడా (అగము = వృక్షము, వయః = పక్షి; వృక్షాలకూ, పక్షులకూ నిలయమైనది కనుక).

“ఇది వైణవారావాసితము (వైణవ-ఆరావ-ఆసితము = వెదుళ్ళ ధ్వనికి ఉనికిపట్టు) అయి శోభిస్తున్నది. ఇది నవైణవారాసితము కూడా (నవ-ఏణ-వార-ఆసితము = జింకపిల్లల గుంపులకు నివాసము).

“ఓ సత్యభామా! కల్పవృక్షముల నుంచి స్రవించిన మద్యాలను [32] తాగిన మైకంలో ఉన్న అప్సరసలు మేరుపర్వత శిఖరాలపైనుండి ఎలుగెత్తి తమ ప్రభువైన ఇంద్రుడిపై పాటలు పాడుతున్నారు చూసావా? సాత్రాజితీ! అరుగో, సిద్ధులు. కామధేనువు పాలతో తయారైన పెరుగుతో కలిపిన అన్నాన్ని తమ వెంట దారిబత్తెంలా తెచ్చుకొని, విశాలమైన భూర్జపత్రాలలో పెట్టుకొని తిని, కల్పవృక్షం నీడలో తమ శ్రమను పోగొట్టుకుంటూ గుంపులుగా కైలాసానికి పోతున్నారు, చూడు.

[32] కల్పవృక్షం కోరిన కోర్కెలను తీర్చే చెట్టు. మద్యపు ప్రస్తావన ఇక్కడ వచ్చింది. ఇంకా ముందర మరిన్ని వస్తువులు కనబడతాయి.

“లేడిపిల్ల కళ్ళవలె చలించే కళ్ళుగల ఓ సత్యభామా! వారే విద్యాధరులు, చూసావా! రత్నకుండలాలను ధరించి, చేతిలో కత్తులను, వీణలనూ పట్టుకొని, చందమామ లాంటి మచ్చలేని తెల్లటి తలపాగాలను కట్టుకుని, మెడలో ముత్యాలహారాలు ధరించి, నొసట త్రిపుండ్రాలతో, ఏకాగ్రచిత్తంతో శివధ్యానం చేస్తూ కైలాసానికి పోతున్నారు.

“ఓ పూర్ణచంద్రముఖీ! ఈ గంధర్వులను చూసావా!? వీళ్ళు సరస్వతీదేవి దగ్గర సంగీతం నేర్చుకున్న విద్వాంసులు. విమానాలలో గగనమార్గాలలో సంచరించేవాళ్ళు. గుఱ్ఱము తల ఉంటుంది వీరికి. దేవతాస్త్రీలకు నాట్యంలో తమ గానంతో సహకరించేవాళ్ళు. వీళ్ళు యక్షులతో కలసి ఉంటారు.

“సత్యభామా! చూడు. వీళ్ళు యక్షులు. జంటలుగా దిక్పాలకుల సభల్లో గానం చేస్తుంటారు. వీళ్ళేమో గుహ్యకులు. హాస్యరసాన్ని పండించడంలో ప్రవీణులు. శివుడి కింకరుడైన భృంగికి మిత్రులు. వీళ్ళు గరుడజాతి ప్రజలు. విష్వక్సేనుడికి స్నేహితులు. గరుత్మంతుడి హితాన్ని మించి వీళ్ళు మరేమీ కోరుకోరు. వీళ్ళు చారణులు. చిత్ర విచిత్రమైన కథలు, ఇతిహాసాలు తెలిసిన వాళ్ళు. అన్ని లోకాలూ తిరుగుతూ ఉంటారు. వీళ్ళందరూ దేవేంద్రుడి సభకు పోతున్నారు. ఎప్పుడూ వివిధవాద్యాలతో, విద్యలతో కళలతో పొద్దుపుచ్చుతుంటారు. చూడు. వీళ్ళంతా మనను ఆశ్చర్యంతో చూస్తున్నారు. ఓ మదగజగమనా! సత్యభామా! గమనిస్తున్నావా?

“వనితా! ఇటు చూడు. ఈశ్వరుడి శిరస్సనే రంగస్థలంపై నాట్యం చేసే నర్తకి, జహ్నుమహర్షి గారాలపట్టి, కపిలమహర్షి ఆగ్రహజ్వాలలలో భస్మమైన సగరపుత్రులను మోక్షమనే మేడమీదకు చేర్చిన నిచ్చెన, ఆకాశం నుండి పాతాళం వరకూ మూడు లోకాలలోనూ దూకుతూ ప్రవహించేదీ, యమునకు ప్రియసఖీ, కనఖల అనే కొండతో కూడినదీ, సురనదీ అయిన గంగను చూడు.

“అవిగో! ఈ నల్లచారలున్న లేళ్ళ సందడులను చూడు. అనసూయ, అరుంధతీ మొదలైన ఋషిపత్నులు తమ కర్ణాభరణాలుగా ధరించే లేత గరికను తిని పెరిగాయి వీటి పిల్లలు. ఈ ఆశ్రమవాటికల వాకిళ్ళు కల్పవృక్షంనుండి పుట్టిన అనేక రకాలైన నారచీరలతో ప్రకాశిస్తున్నాయి. ఈ దివ్యఋషుల ఆశ్రమాల పరిసరాలు ఆహవనీయాది అగ్నుల నుండి వచ్చే పొగలతో నల్లగా మారి ఉన్నాయి.

“అరుగో, వారే అప్సరసలు. అవిగో అమృతధారలు . అవి కల్పవృక్షాల వరుసలు. లక్ష్మీదేవి, చంద్రుడు, చింతామణి. వీటిని అన్నింటినీ మించినది - అదుగో అటు చూడు - తన దూడ అయిన నందిని కంఠాన్ని నాకుతూ పచ్చికలో పడుకున్న కామధేనువు. చూస్తున్నావా!

“ఓ హాయనమాత్రకురంగలోచనా! (ఒక్క ఏడాది మాత్రమే వయస్సు ఉన్న లేడికి ఉన్నటువంటి కన్నులు గలదానా) అదుగో చూడు! మేరుపర్వత-శిఖరం మీద ఆ పర్వతరాజు నుదుట కట్టిన పట్టబంధం లాగా ఉన్న కోట,

ఆ పర్వతరాజు తలపైని కిరీటం వలె ఉన్న వైజయంతమనే ఇంద్రుడి ప్రాసాదము కనబడుతున్నదా?!

“ఆ అమరావతీనగరం పక్కనే దిక్పాలకుల దివ్య విమానాలు నిలిచి ఉన్నాయి. అవి ఇంద్రపురి వైభవం ముందు ఓడిపోయి, వినయంగా ఆ నగరాన్ని సేవించడానికి వచ్చిన దిక్పాలకుల పట్టణాలలా ఉన్నాయి.

“యుద్ధాలలో వెన్ను చూపక ప్రాణాలను విడిచిన వీరులూ, ఎన్నో యజ్ఞాలను చేసి పుణ్యం గడించుకున్న బ్రాహ్మణులూ, భవబంధాలను తెంచుకున్న యోగిపుంగవులు, ఈ స్వర్గలోకంలో అప్సరస్త్రీల వదన-చుంబనసౌఖ్యాన్ని అనుభవిస్తూ ధన్యులవుతున్నారు.

“ఓ సత్యభామా! సముద్రంలో పడ్డవాడు చేపలకు, కొండలకు, సుడులకు చిక్కి తీరం చేరలేక చింతిస్తాడు. అలానే మానవుడు స్త్రీల చూపులనే చేపలకు, స్తనాలనే కొండలకు, మోహమనే సుడిగుండాలకు వశుడై, సంసారమనే సాగరాన్ని దాటడానికి తంటాలు పడుతుంటాడు. కానీ దాటలేడు. అటువంటివాడిని దరి చేర్చే నావయే సత్కర్మ. దీని ద్వారా ఈ సంసారమనే సాగరాన్ని దాటి, ఈ పురమనే దీవికి చేరుకుంటాడు మానవుడు.”

అలా స్వర్గలోకపు మాహాత్మ్యాన్ని సత్యభామకు చెప్తూ, సంతోషంతో ప్రయాణం చేస్తూ వెళ్ళి మెల్లగా మేరుపర్వతశిఖరప్రదేశం చేరుతుంటే, గరుత్మంతుడు ఆకాశమార్గాన ఎగురుతూ, భంజలిక, మురళి, సుడాల మొదలైన అశ్వగతిభేదాలను ప్రదర్శిస్తున్నాడు. అతడికి ఎదురైన దేవతలు

గౌరవాశ్చర్యాలతో పక్కకు తప్పుకుని దారి ఇస్తూ నమస్కరిస్తున్నారు. అలా దేవతల మన్ననలనందుకుంటూ, గరుత్మంతుడు సురగంగాతీరపు బాటలలోనికి ప్రవేశిస్తున్నాడు. నెమలి పింఛపు కన్నులలా గుండ్రంగా అమరిన కామధేనువు గిట్టల గుర్తులతో ఆ తీరప్రదేశం ఎంతో రమణీయంగా ఉంది.

ఆ ప్రదేశంలో లేత తామర తూడులను తినడానికి గుంపులు గుంపులుగా వస్తున్న హంసలు చేసే ధ్వనులను అతిశయింపజేస్తూ కమలగంధాన్ని మోసుకొంటూ తమకు చేరువగా వస్తున్న కమ్మని గాలులు అలసిన శరీరాలను సేద తీరుస్తుంటే శ్రీకృష్ణుడు ఆనందంగా వస్తున్నాడు. అంతకు ముందే ఇంద్రుడు నారదమహర్షి ద్వారా శ్రీకృష్ణుడి రాకను తెలుసుకున్నవాడై, సంభ్రమంగా ఐరావతాన్నధిరోహించి కుమారుడు జయంతుడిని, ఇతర దిక్పాలకులను వెంటబెట్టుకొని, మేనకాది దేవవేశ్యలు సేవిస్తుండగా శ్రీకృష్ణుడికి ఎదురుగా వెళ్ళి స్వాగతించాడు.

తృతీయాశ్వాసము

స్వర్గలోకంలో ఇంద్రాదులు శ్రీకృష్ణుని సేవించుట

ఇంద్రుడు అంత దూరం నుండి శ్రీకృష్ణుణ్ణి చూసి సంభ్రమంతో అంకుశంతో ఐరావతపు కుంభస్థలాన్ని అదిమాడు. అది ముంగాలును వంచింది. ఇంద్రుడు కిందికి దిగి, కల్పవృక్షపు పట్టుతో [33] చేసినఉత్తరీయాన్ని భుజంపైనుండి తీసి, నడుముకు కట్టుకుని, శ్రీకృష్ణుడికి ఎదురుగా వెళ్ళి తల నేలకు తాకేలా వంచి నమస్కరించి స్వాగతం పలికాడు. మిక్కుటమైన ఆనందంతో ఇంద్రుడి కళ్ళు నీటితో నిండాయి, శరీరం పులకరించింది. ఇంద్రుడు తన శిరస్సుపై ధరించిన పూవులలోని తేనెలను తాగడానికి మూగిన తుమ్మెదల ఝుంకారాలు శ్రీహరిని కుశలం అడుగుతున్నట్లున్నాయి. అమితభక్తితో దేవరాజు శ్రీకృష్ణుడి పాదాలపై వాలిపోయాడు.

అప్పుడు, తన కన్నులనే తామరపూవులు సంతోషంతో విప్పారగా దనుజాంతకుడైన దామోదరుడు తన ఆజానుబాహువులను చాపి - కొత్త మేఘం పర్వతశిఖరాన్ని పెనవేసినట్లు - తనకు అత్యంతగౌరవంతో పూజలు చేస్తున్న ఇంద్రుణ్ణి కౌగిలించుకున్నాడు.

---

[33] ఈ కావ్యంలో దేవతలు ధరించే వస్త్రాల ప్రస్తావనలు వచ్చిన పలు సందర్భాలలో ఆ పట్టు కల్పవృక్షాల నుంచి వచ్చింది అని చెబుతూ ఉంటాడు కవి.

యదువీరుడైన శ్రీకృష్ణుడికి అగ్నిదేవుడు అంజలి ఘటించాడు. యముడు సాష్టాంగనమస్కారం చేశాడు. నిర్రృతి, వరుణుడు, వాయు-దేవుడు, కుబేరుడు, ఈశానుడు వరుసగా నమస్కరించారు.

చక్రధారి అయిన శ్రీకృష్ణుడు తనకు నమస్కరించిన వారిలో కొందరిని సరససంభాషణలతో, మరి కొందరిని ఆదరముతో కూడిన చూపులతో సంభావించాడు. ఇంద్రుణ్ణి ఐరావతాన్ని అధిరోహించమని చెప్పి, రంభాది అప్సరసలు వింజామరలు వీస్తూ తనను సేవిస్తుండగా, తానూ సత్యభామతో గరుత్మంతుడి పైన ఎక్కాడు. దిక్పాలకులు తమ తమ వాహనాలెక్కి ఆయనను అనుసరిస్తుండగా, ఒక్కసారిగా హుడుక్క, ఢక్కా, పటహాలనే వాద్యాలు ఆశ్చర్యపరుస్తూ, ఆకాశం గర్జించినట్లు ధ్వనించినాయి. అప్పుడు సిద్ధసాధ్యాది దేవతాగణాలు అనుసరించి రాగా, దేవేంద్రుడు దారి తొలగమని సందడి చేస్తుంటే, అతసీకుసుమం (అవిసె పువ్వు) వలె నల్లని దేహవర్ణం గల శ్రీకృష్ణదేవుడు, నారదాది మునులు తనను కీర్తిస్తుండగా ఆకాశమార్గంలో వెళ్ళాడు.

దేవతాస్త్రీలు శ్రీకృష్ణుడిని చూడాలనే ఉబలాటంతో త్వరత్వరగా ఇష్టం వచ్చినట్టు అలంకరించుకొని, ఒకరినొకరు తోసుకుంటూ ఇతరులకు అవకాశం ఇవ్వకుండా మెరసే ఎత్తైన మేడల మీదికి చేరారు. ఒక స్త్రీ తన ఇష్టసఖితో అంటున్నది, "సఖీ! కృష్ణుణ్ణి చూసేటప్పుడు చెమట పడుతుంది. అప్పుడు వంటికి పూసుకున్న పూతలు చెరిగిపోతాయి. ఆనందబాష్పాల వల్ల కంటి కాటుక కరిగి కారి పోతుంది. వళ్ళు

పులకరిస్తుంది కాబట్టి మకరికాపత్రాలు[34] కూడా చిట్లిపోతాయి. కనుక అలంకరించుకోవటం వృథా. అది వదిలిపెట్టి శ్రీహరిని చూడటానికి త్వరగా రా” అని పిలుస్తున్నది.

ఒక స్త్రీ కృష్ణుణ్ణి చూడటానికి గవాక్షం (కిటికీ) దగ్గరకు చేరింది. అక్కడ అప్పటికే పెద్ద గుంపు ఉన్నది. అప్పుడామె ఒక అమాయకురాలిని పిలిచి ఏదో పని చెప్పి పంపించి ఆ చోటును ఆక్రమించి, అలా మోసపోయిన అమ్మాయిని మిగిలినవాళ్ళు ఆటపట్టిస్తుంటే, కృష్ణుడిని చూడసాగింది.

ఒక వనిత అప్పుడే స్నానం చేసింది. కృష్ణుడొస్తున్నాడని విని తొందరలో తడి ఆరని కురులు వక్షోజాలపై పడుతుండగా గబగబా వచ్చింది. ఆమె గోపాలుడి కోసం నెమలి పింఛాన్ని కానుకగా తెచ్చిందా అన్నట్లుంది. ఒక సన్నని నడుమున్న స్త్రీ కృష్ణుణ్ణి చూడటం వల్ల తన శరీరంలో కలిగిన సాత్త్విక లీలలను [35] దాచి పెట్టటం కోసం, ‘ఎత్తైన మేడ ఎక్కడం వల్ల శ్రమ కలిగింది.’ అని చెలులతో అబద్ధం చెప్పింది.

ఒకామె పక్కనున్నామెను తోసుకుంటూ వెళ్ళి కృష్ణుణ్ణి చూస్తున్నది. అప్పుడు తోయబడ్డ స్త్రీ అసూయతో, “ఓసీ! నువ్వు ఒక్కసారి కూడా

[34] లత్తుకతో, చందనంతో చెక్కిళ్ళపై, రొమ్ములపై గీసుకునే మొసలి ఆకారపు బొమ్మలు

[35] నాట్యశాస్త్రం ఎనిమిది సాత్త్వికభావాలను పేర్కొన్నది - స్తంభః = నిశ్చేష్టత; స్వేదః = చెమట పట్టటం; రోమాంచః = గగుర్పాటు; స్వరభంగః = గొంతు గద్గదం కావటం; వేపథుః = వణుకు పుట్టటం; వైవర్ణ్యం = కళ తప్పిపోవటం/పాలిపోవటం; అశ్రుః = కన్నీళ్ళు; ప్రళయం = పూర్తిగా వివశత్వం పొందటం

మాత్సర్యాన్ని వదలటం లేదు. పెద్దదానివి. ప్రౌఢవు. కాబట్టి అతడు నిన్నే చూస్తాడులే. ఇంకెవరినీ చూడడు," అని ఎద్దేవా చేసింది. వీళ్ళు సవతులు. వీళ్ళకు మాత్సర్యం సహజం.

ఒక కాంత శ్రీకృష్ణుణ్ణి చూసి నిశ్చలంగా ఉండిపోయింది. అప్పుడామెకు చెమట పోసి, వణుకు పుట్టింది. పోకముడి ఊడింది. అయితే చెమట కారణంగా చీర ఒంటిని అంటుకొని జారిపోకుండా ఉన్నది. కంపంవల్ల ఆమె చేతిలోని లాజలు (పేలాలు) అప్రయత్నంగా శ్రీకృష్ణుడిపై చల్లినట్లు పడుతున్నాయి.

ఒకామె తొందరలో కాలి అందెను చేతికి కంకణంలా తొడుక్కున్నది. శ్రీకృష్ణుణ్ణి చూసి శరీరం పొంగిపోయి అది కాస్తా విరిగి ముక్కలైంది.

ఒకామె కృష్ణుడిపై దోసిలితో లాజలను చల్లింది. ఈర్ష్య కొద్దీ - ఆమె కొప్పు పూలను చల్లింది, కళ్ళు ఆనందబాష్పాలను చల్లాయి, నుదురు స్వేదబిందువులను చల్లాయి, స్తనాలు ముత్యాలను చల్లాయి[36].

ఒక దేవవనిత సరసంగా శ్రీకృష్ణుణ్ణి తన పెంపుడు చిలుకతో "కృష్ణ కృష్ణ" అని పిలిపించింది. ఆ దృశ్యాన్ని కృష్ణుడు సత్యభామకు చూపించాడు. అది తెలుసుకుని, తన మోహాన్ని అన్యకాంత దగ్గర

[36] పూలను, ముత్యాలను, చెమట చుక్కలను, కన్నీళ్ళను ముత్యంతో పోల్చడం కద్దు. లాజలు చల్లిన ఊపుకు కొప్పు సడలి పూలు రాలటాన్ని, సాత్త్వికభావోదయం కారణంగా చెమట చిందడాన్ని, ఆనందాశ్రువులు రాలడాన్ని, స్తనాల పైన ముత్యాల పేర్లు తెగి ముత్యాలు రాలడాన్ని ఈర్ష్య కారణంగా జరిగాయని చమత్కరిస్తున్నాడు కవి.

అందునా శ్రీకృష్ణుడి భార్య అయిన సత్యభామ దగ్గర బయట పెట్టడానికి ఇష్టపడని ఆ దేవతా స్త్రీ కృష్ణుణ్ణి మందలిస్తున్నట్లు కోపంగా చూసింది. ఆమె అలా చూడటాన్ని కూడా శ్రీకృష్ణుడు సత్యభామకు చూపాడు.

అమరావతిలో గవాక్షాలన్నీ స్త్రీలతో, ఆ స్త్రీల హృదయాలన్నీ ప్రేమతో నిండి ఉన్నాయి. ఆ అనురాగం కృష్ణమయమై పోయింది.

శ్రీకృష్ణుణ్ణి చూడాలనే ఉత్సాహం వల్ల పుట్టిన అనురాగంతో అచ్చరలు తోసుకుంటూ ఒకళ్ళనొకళ్ళు నిందించుకుంటున్నారు. అవన్నీ వింటూ కృష్ణుడు చిరునవ్వు చిందిస్తూ, రాజవీథి దాటి, దేవేంద్రుడి భవన-సింహద్వారం వద్దకు చేరుకున్నాడు. మణులు పొదిగిన రంగురంగుల బెత్తములను ధరించి నిలిచినవారి అదలింపులతో దిక్కులు నిండు-తుండగా, ఇంద్రుడు ప్రేమతో చెయ్యినందియ్యగా గరుడుడి పైనుండి దిగి, జాము కావలి ఏనుగుల మదజలంతో తడిసిన మూడు కక్ష్యలను దాటి వెళ్ళి, ఎదురుగా దేవమాత అదితిని చూసాడు.

శ్రీకృష్ణుడు దేవమాత అదితిని దర్శించుట

ఆమె విశాలమైన చింతామణి పీఠం మీద కూర్చుని ఉన్నది. ఆ పీఠం పైని శయ్య కల్పవృక్షపుష్పాలతో చేయబడింది. ఆమె పాదాలు ఇంద్రాణియైన శచీదేవి ఒడిలో ఉన్నాయి. శచీదేవి ఆమె పాదాలను మృదువుగా ఒత్తుతున్నది. పక్కన సరస్వతీదేవి చిత్రవిచిత్రమైన కథలు చెప్తూ దేవమాతను ఆనందింపచేస్తున్నది. సప్తర్షుల భార్యలామెకు

వినయంతో సేవలు చేస్తున్నారు. వీవనలు, వింజామరలు, తాంబూలపు పెట్టెలు పట్టుకొని దిక్పాలకుల భార్యలు తిరుగుతున్నారు. దేవతలనే ముత్యములకు జన్మనిచ్చిన ముత్యపుచిప్పవలె అదితి ప్రకాశిస్తున్నది. ఆమెను సమీపించి కృష్ణుడు సత్యభామతో కలిసి నమస్కరించాడు. గతంలో నరకాసురుడు అపహరించినట్టివి, తన బంగారు ఉత్తరీయపు చెంగులో దాచి తెచ్చినవీ అయిన ఆమె కుండలాలను ప్రేమతో అదితికి సమర్పించాడు. ఆమె వాటిని అందుకొని శ్రీకృష్ణుణ్ణి ఆశీర్వదించింది. పక్కనే ఉన్న చింతామణి పీఠం మీద కూర్చోబెట్టుకుంది.

అదితి శ్రీకృష్ణుడి శరీరాన్ని ఆప్యాయంగా నిమిరింది. శిరస్సును వాసన చూసి, "ఓ కృష్ణా! నియమనిష్ఠలతో ధ్యానం చేసే మహర్షులు సైతం నీ దర్శనభాగ్యానికి నోచుకోలేరు. అటువంటి నీ దర్శనం కలగటం వల్ల నేను ధన్యురాలనై పాపవిముక్తిని పొందాను" అన్నది.

అదితి హరి అవతారములను, కృష్ణలీలలను వర్ణించుట

"చక్రాయుధమును భూషణముగా చేసుకున్న ఓ శ్రీకృష్ణా! నువ్వే సృష్టికి కర్తవు, భర్తవు, హర్తవు. త్రిమూర్తిస్వరూపుడవు నువ్వే. నువ్వే కేవలం ఆత్మారాముడవై, ఆనందస్వరూపుడవై ఉన్నావు. మురాసురుడిని చంపినవాడా, నిన్ను నేను పొగడగలనా?

"పెద్ద చేపగా రూపాన్ని ధరించి, నీ తోక దెబ్బలతో సముద్రంలో దాగిన పర్వతాలకు వజ్రాయుధపు దెబ్బలను గుర్తుచేసి, వేదాపహారియైన

అసురుడిని పదునైన నీ రెక్కతో చీల్చి, వేదాలను బ్రహ్మ దేవుడికిచ్చి దేవతల స్తుతులను అందుకున్నావు.

"ఓ శేషశాయీ! అమృతమథనవేళ మందరపర్వతం ఒరిగిపోకుండా నీ మూపున ధరించి కాపాడావు. ఇంకా మాయామోహినివై దేవతలకు అమృతాన్ని పంచి, రాక్షసులను మూఢుల్ని చేశావు.

"శ్రీకృష్ణా! భూమి సముద్రంలో మునిగిపోగా, నువ్వు వరాహరూపంలో పాతాళంలోనికి చొరబడి, నీ కోరతో భూమిని ఎత్తి రక్షించావు గదా! ఓ కృష్ణా! బ్రహ్మాండం బద్దలయ్యేలా నీ శరీరాన్ని పెంచి, సముద్రంలో మునిగిన భూదేవి అనే స్త్రీరత్నాన్ని నీ దంతపు కొసపై నిలిపినప్పుడు, మొగలిపూవు మొగ్గపై వాలిన ఆడు తుమ్మెదను తలపించింది ఆ దృశ్యం. (దంతం మొగలి రేకులా తెల్లగా, భూమి తుమ్మెదలా నల్లగా ఉండటం పోలిక).

"శ్రీకృష్ణా! చిటపటలాడుతూ పటపట పళ్ళు కొరుకుతూ హిరణ్యకశిపుడు, 'ఓరీ! విష్ణువు సర్వాంతర్యామి అయితే ఈ స్తంభంలో చూపమ'ని ప్రహ్లాదుణ్ణి గద్దించగా, పతేలుమని రాతిస్తంభాన్ని పగులగొట్టుకొని, నరసింహరూపంలో బయల్పడి, వాడిగోళ్ళనే తాళపు-చెవులతో హిరణ్యకశిపుడి గుండె తలుపులను గుచ్చి తెరిచావు గదా!

"నాయనా! నా తండ్రీ! నన్ను కశ్యపుడి భార్యలలో ధన్యురాలిని చేయడానికి నాకు కొడుకనే మిషతో పొట్టివాడిగా పుట్టి, బలిని పాతాళానికి తొక్కావు కదా, అప్పుడు ఆకాశాన్ని అంటేటట్లు ఎత్తిన నీ

పాదమనే తామరపూవులో సూర్యుడు దుద్దు (పువ్వు మధ్యభాగము) వలె అమరగా, కిరణాలు కేసరాల వలె అమరాయి.

“గొప్ప గొడ్డలిని ధరించి పరశురామావతారంలో పరాక్రమంతో రాజహంసలను (రాజశ్రేష్ఠులను) నరికావు. క్రౌంచపర్వతంపై గొడ్డలి విసరి ఏర్పరచిన కనుమ గుండా రాజహంసలను ఈ భూమికి తీసుకొని వచ్చావు కూడా[37]. కార్తవీర్యార్జునుడి వెయ్యి చేతులనూ నరికి వాడికి గర్వభంగం చేసి, భూమిని యావత్తూ కశ్యపుడికి దానమిచ్చావు, నువ్వు ఉండటానికి భూమి కోసం, సముద్రం మీద బాణంవేసి వెనుకకు జరిగేలా చేశావు[38].

“పద్మముఖి అయిన సీతను పోగొట్టుకుని, అవమానాలు పొంది, వానర సైన్యాన్ని సమీకరించి, సముద్రంపైన సేతువు కట్టి, రావణుడి కంఠములనే అరణ్యాన్ని దహించివేసావు. కైలాసగిరికి రావణుడు చేసిన అవమానమనే బురదను కీర్తి అనే జలాలచేత కడిగి, రాముడనే పేరుతో ప్రఖ్యాతి పొందావు కదా!

“ఓ కృష్ణా! యదువంశపు ముత్యమా! రేవతికి పతివై బలరాముడి అవతారంలో ప్రలంబాసురుణ్ణి సంహరించావు. యమునాప్రవాహవేగాన్ని

[37] పరశురాముడు శివుడి దగ్గర ధనుర్విద్యను నేర్చుకుంటున్నప్పుడు కుమారస్వామితో పోటీపడుతూ క్రౌంచపర్వతాన్ని భేదించాడని కథ. ఆ క్రౌంచరంధ్రం గుండా మానససరోవరానికి వెళ్ళేందుకు దారి ఏర్పడింది. దాన్ని హంసద్వారమని అంటారు.

[38] సముద్రుడు వెనక్కి వెళ్ళగా బహిర్గతమైన భూమియే ఇప్పటి కేరళ.

నియంత్రించావు. కొడుకును రక్షించడానికి కౌరవులందరు భయపడేలా నీ నాగేటి మొనతో హస్తినాపురాన్ని పెకలించావు.

“లోకరక్షణ కోసం మేల్కొన్న కన్నులుగలవాడా, శ్రీకృష్ణా! పరమపతివ్రతలైన త్రిపురాసురుల భార్యలకు మాటిమాటికీ పాతివ్రత్య-భంగం చేసి, వాళ్ళను వంచించి, అవధ్యులైన వాళ్ళ భర్తలను శివుడి చేత చంపించడానికి బుద్ధరూపాన్ని ధరించావు కదా!” అని ఆ దేవమాత అదితి శ్రీకృష్ణుణ్ణి ఇంకా ఇలా స్తుతించింది.[39]

“ఓ యదుకులతిలకా! సృష్టికర్త అనే పెద్ద తుమ్మెద చేత ప్రకాశించే నాభిపద్మము కలవాడా! లక్ష్మీదేవికి పాదపీఠమై వెలుగుతున్న కౌస్తుభమణి నుండి పుట్టిన లేయెండల వంటి కాంతిగలవాడా! నీ పాదాల నుండి పుట్టిన గంగ నీటితో, దుమ్ము కొట్టుకుని చిక్కులు పడ్డ తన జటలను ప్రక్షాళన చేసుకుంటాడు శివుడు. జాలంధరము, ఉడ్యాణము, మూలము[40] అనే మూడు బంధాలతో నియంత్రించి వాయువును విజృంభింపజేయటం వలన ఆరు గ్రంథులు తెరుచుకొని వాటి మధ్యలోని కుండలినిని జాగృతం చేసుకున్న యోగుల హృదయకమలాలలో నిలిచి ఉండే పరమాత్మా! భూభారాన్ని తొలగించమని ఈ దేవతలు బ్రహ్మదేవుణ్ణి ముందుంచుకొని

[39] అదితి చేసిన ఈ దశావతారవర్ణనలో బలరాముడు ఉన్నాడు, కల్కి లేడు. కల్కికి బదులుగా కృష్ణుడిని స్తుతించింది అదితి.

[40] జలంధరబంధము, ఉడ్యాణ (ఉడ్డియన/ఓడ్యాణ) బంధము మూలబంధము – శ్వాసను నియంత్రించే యోగసాధనాప్రక్రియలు; గ్రంథిషట్కము – మూలాధారాది షట్చక్రాల అనుసంధానంగా ఉండే గ్రంథులు.

ప్రార్థించగా దేవకీదేవి గర్భవాసాన పుట్టినప్పుడు, నాలుగు చేతులు, వాటిలో పంచాయుధాలను [41] ధరించి, పీతాంబరధారివై, శ్రీవత్సాంకితవక్షసుడవై దర్శనమిచ్చినవాడా! నిన్ను ఆ విధంగా చూసి దేవకీదేవి భయపడి "కావు కావు"మని ప్రార్థించగా, అంతలోనే పసివాడవై "కావుకావు"మని ఏడ్చినవాడా! తండ్రిచేత నందగోకులమునకు చేర్చబడి, విషపు పాలివ్వడానికి వచ్చిన పూతనయొక్క స్తనాన్ని చేతితో పట్టుకుని దాని ప్రాణమనే శంఖాన్ని పూరించి చంపి, శకటాసురుడి కీళ్ళు విరగతన్ని, గోపికల ఇళ్ళలో పాలు, పెరుగు, వెన్నలను దొంగిలించి, వాళ్ళు వెళ్ళి యశోదతో చెప్పగా, "నిజంగానే నీవు పిల్లవాడివా" అంటూ ఆమె నిన్ను రోటికి కట్టేస్తే దానిని ఈడ్చుకుంటూ వెళ్ళి జంట మద్దిచెట్లను కూల్చి, మళ్ళీ ఏమీ ఎరుగని అమాయకపు బాలుడిలా నటించావే!

"కృష్ణా! ఆవులూ, దూడలూ, గోప బాలకులూ అడవిలో తిరుగుతూ ఉండగా, అందంగా కదిలే ముంగురులతో, శిఖపై నెమలి పింఛంతో, మెడలో గురివింద పూసల దండతో, మొలలో వేణువుతో చక్కగా ప్రకాశిస్తూ నువ్వు రక్షిస్తున్న గోగోపకులను బ్రహ్మ దాచిపెట్టాడు. అప్పుడు నువ్వే ఆవుల, దూడల, మరియు గోపాలకుల రూపాలను ధరించి, గోకులంలో ఉన్న పెద్దలకు ఆందోళన కలుగకుండా, బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేసి, ఆ విరించికి గర్వభంగం చేశావు కదా! కాళింది మడుగులో ఉవ్వెత్తున లేచే తరంగాలు మృదంగధ్వనులను అనుకరిస్తుంటే, కాళియుడి

[41] పాంచజన్యము, సుదర్శనము, శార్ఙ్గము, కౌమోదకి, నందకము

పడగలనే రంగస్థలం మీద ఆనందోత్సాహవిలాసాలతో నాట్యం చెయ్యలేదూ? నీతోటి గోపాలకులకూ నీకూ యజ్ఞాలలో పెట్టిన నైవేద్యాలను మునిపత్నులు వాళ్ళ భర్తలకు తెలియకుండా తెచ్చి పెడితే, వాటిని ఆరగించి ఆ మునిపత్నులకు నువ్వు మోక్షమిచ్చావు గదా! పెద్ద పాము రూపంలో వచ్చి గుహలాంటి నోటిని తెరచి ఆలమందలను మింగుతున్న రాక్షసుడి నోటిలోకి నువ్వు వేగంగా ప్రవేశించి, దేహాన్ని పెంచి, ఆ సర్పరూపంలో ఉన్న రాక్షసుడి శరీరాన్ని రెండుగా చీల్చి, ఆవులను రక్షించలేదా? గోపకులు ఇంద్రోత్సవం చేస్తుంటే వారించి, ఆ పూజలను గోవర్ధనపర్వతరూపంలో నువ్వే స్వీకరించగా, అలిగిన ఇంద్రుడు పుష్కలావర్తమేఘాలను పంపి కుంభవృష్టిని కురిపించగా, అందరూ భయపడి పారిపోతుంటే, నువ్వు గోవర్ధనగిరిని నీ చిటికెనవేలితో పైకెత్తి, వాళ్ళనందర్నీ దాని కిందికి చేర్చి రక్షించావు గదా! మదించిన ఏనుగు అందమైన పద్మాలను పెల్లగించినంత అవలీలగా, ఎప్పుడూ దేవతలను ఆపదలపాలు చేసే అరిష్టమనే మదమెక్కిన ఎద్దు రాక్షసుణ్ణి పట్టికొట్టావు. పొగరెక్కిన గుర్రం ఆకారంలో నీ పైకి వచ్చిన కేశి రక్కసుడి ప్రాణమనే వాయువును నీ భుజమనే సర్పం తాగివేసింది కదా.

"శరత్కాలపు చిక్కని చక్కని వెన్నెలలో ప్రకాశించే యమునానదీ-తీరపు ఇసుక తిన్నెలపై త్రిభంగిగా నిలిచి, ముడిచిన కనుబొమల అందంతో, మోమును ఎడమ భుజంపై వంచి, పెదవులపై మురళిని ఆన్చి ఆ వేణురంధ్రాలపై వేళ్ళు ఆడుతుండగా, పంచమస్వరంలో వాయిస్తుంటే, ఆలమందలు నెమరు వేయటం మరచిపోయి వింటూ నిశ్చలంగా ఉండి

పోయినాయి. గోవర్ధనగిరి శిలలు కరిగిపోయినాయి. యమునాప్రవాహ-వేగం మందగించింది. మోళ్ళు చిగిర్చినాయి. రాధ మొదలైన గోపస్త్రీలు మన్మథబాధకు తాళలేక నీ చెంతకు రాగా, అలా వచ్చిన వాళ్ళను రాసక్రీడావినోదంతో పరవశింపజేసి, ఆనందమహార్ణవంలో ఓల-లాడించావు నువ్వు. గర్వాంధులైన రాక్షసులకు అసాధ్యమైన నీ పరాక్రమాన్ని చూడగోరి నీ మామ కంసుడు అక్రూరుడిని పంపి నిన్ను పిలిపించగా, దారిలో అక్రూరుడు ఆశ్చర్యపోయేలా నీ దివ్యరూపదర్శనం కలిగించి, అతణ్ణి నీ భక్తుణ్ణి చేసుకొని, ఆదరించలేదా? ఆ కంసుడికి భయం కలిగిస్తూ, మధురానగరంలో ప్రవేశించి, చందనం సమర్పించిన కుబ్జ అనే దాసికి, అందమైనరూపాన్ని ఇచ్చి అనుగ్రహించావు గదా! యజ్ఞంలో పూజింపబడిన ధనుస్సును విరిచి, ఎదిరించిన రక్షకభటులను చంపి, కంసుడి భవనప్రాంగణం చేరగానే, మావటీడు మదమెక్కిన కువలయాపీడమనే పట్టపుటేన్గును నీమీదికి ఉసిగొల్పగా దానిని చంపి, ఆ ఏనుగు మదజలంతో తిలకం ధరించి, దాని కుంభస్థలం నుండి రాలిన ముత్యాలతో చెవులకు అందమైన దండను కూర్చుకొని, దాని దంతాన్ని పెరికి గదలా ధరించి సభలో ప్రవేశించావు.

“ఆ సభలో కంసుడి ప్రేరేపణతో చాణూర ముష్టికులనే మల్లులు నీ మీదికి రాగా, నువ్వూ, నీ అన్న బలరాముడూ కలిసి వాళ్ళను చంపలేదా! అప్పుడు కంసుడు భయంతో పారిపోబోగా నువ్వా కంసుణ్ణి కంఠం నొక్కి చంపావు గదా! అప్పుడు దేవతలు సంతోషంతో దుందుభులు మోగించి, ఆటపాటలతో కల్పవృక్షపు పూలవానను నీమీద కురిపించారు. లోకాలన్నీ

ఆనందించినాయి. ఆ కంసుడి రాజ్యంలో గొప్పవాడూ, పూజనీయుడూ అయిన ఉగ్రసేనుణ్ణి రాజుగా చేశావు. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం గలవాడూ, దుష్టుడూ, గర్వాంధుడూ అయిన జరాసంధుణ్ణి భీముడి చేత చంపించావు. ధర్మరాజుతో రాజసూయయాగాన్ని చేయించావు. అక్కడ అసూయతో నిన్ను నిందించిన శిశుపాలుణ్ణి చక్రం ప్రయోగించి నరికావు. అలాగే పౌండ్రకవాసుదేవుడనే దుష్టుణ్ణి కూడా నీ సుదర్శనచక్రంతో ముక్కలు చేశావు. యుద్ధంలో వినాయకుడు, కుమారస్వామి పన్నిన వ్యూహాలను చెదరగొట్టి, శంకరుణ్ణి ఓడించి, బాణాసురుడి వేయి చేతులను నరికి, లోకాన్ని రక్షించావు. భయంకరుడూ, భూమి పుత్రుడూ అయిన నరకాసురుణ్ణి శిక్షించినవాడా! పుత్రవియోగంతో కుములుతున్న సాందీపని మహర్షికి కుమారుణ్ణి తెచ్చి ఇచ్చినవాడా! వేదవృక్షపు కొమ్మల చివర ప్రకాశించే లేత చిగుళ్ళవంటి ఎర్రని పాదాలుగలవాడా! మాధవా! శ్రీకృష్ణా! సత్యభామాపతీ!'' అని కొనియాడింది.

ఈ విధంగా స్తోత్రం చేసి దేవమాత అదితి, "సమస్త ప్రపంచానికి ఆధారభూతుడవైన ఓ కృష్ణా! ఈ రోజూ, రేపూ నువ్వూ, నీ భార్య సత్యభామ తప్పని సరిగా మా ఆతిథ్యం స్వీకరించాలి'' అని కోరింది.

శ్రీకృష్ణుడు దేవమాత అదితికి మొక్కి, ఇంద్రుడి వైపు చూశాడు. ఇంద్రుడు వినయంగా, శ్రీకృష్ణుణ్ణి తన నివాసమైన వైజయంతానికి రమ్మని ప్రార్థించాడు. అప్పుడు లోకపాలకులు సేవిస్తుండగా, శ్రీకృష్ణుడు చిరునవ్వుతో వైజయంతానికి వెళ్ళాడు.

వైజయంతీ వర్ణన

అక్కడ సురగంగానదినుండి తెచ్చిన పద్మాలను తోరణాలుగా కట్టారు. ఆ భవనానికి ఇరువైపులా బంగారు విమానాలున్నాయి. ఆ విమానాలకు చిరుగంటలు ఉన్నాయి. అవి లయబద్ధంగా శబ్దిస్తున్నాయి. ఆ సవ్వడివల్ల ఆ విమానాలు మధురమైన సంగీతానికి నృత్యం చేస్తూ ఆ వైజయంతభవనానికి సంతానమేమో అన్నట్లు ఉన్నాయి. ఆ వైజయంత భవనశిఖరం పైన చింతామణి అనే రత్నం ఉంది. దానిలో ఏ వస్తువైనా ప్రతిఫలిస్తుంది. ఆ బింబాలెలా ఉన్నాయంటే, కోరినవారి కోరికలను తీర్చడానికి చింతామణి ముందే సేకరించిన వస్తుసముదాయంలా ఉన్నాయి. ఆ ప్రాసాదంలో ఇంద్రనీలమణులతో చేసిన అనేక గవాక్షాలు (కిటికీలు) ఉన్నాయి. వాటినుండి వచ్చే కాంతులు స్వర్గలక్ష్మీకటాక్ష-వీక్షణాలలా ఉన్నాయి. ఆ మేడలోని రత్నస్తంభాలపై నాట్యమాడే అప్సరసల ప్రతిబింబాలు కనుపిస్తున్నాయి. ఆ బింబాలు నాట్యం చూడటానికి వచ్చిన గృహదేవతలలా ఉన్నాయి.

ఆ భవనం గోడలపైన పులోముడు, నముచి, బలుడు, పాకాసురుడు మొదలైన రాక్షసులను చంపడానికి సిద్ధమవుతున్న ఇంద్రుడి యుద్ధ-సన్నాహాలను చిత్రించారు. ఆ వైజయంతపు ప్రాసాదపు శిఖరాలు స్ఫటిక-మయాలు. వాటినుండి వచ్చే తెల్లని కాంతులు వలయాకారంలో వ్యాపించి, ఆ ప్రదేశం క్షీరసాగరంలా అగుపిస్తున్నది. అలా ఉన్న ఆ ప్రదేశంలో పడుకున్న ఐరావతం, ఉచ్చైశ్రవం పాలకడలిలో స్నానం చేస్తున్నట్లు

కనిపిస్తున్నాయి. మణులు పొదిగిన భృంగారకాలను (లవంగాలు మొదలైన సుగంధద్రవ్యాలను పెట్టుకునే పెట్టెలు), తాంబూలపు పేటికలను, తాటాకు విసనకర్రలను, చామరాలను, నిలువుటద్దాలను, తమ్మ పడిగెలనూ (తాంబూలాన్ని ఉమ్మివేసే పాత్రలను), పాదుకలనూ చేతబట్టుకున్న యంత్రపుత్రికలు (రోబోలు) ఉన్నాయక్కడ. వాటిని విశ్వకర్మ సృష్టించాడు. యంత్రబలంతో అవి కదులుతూ ఉంటే వాటిని చూసి 'నిజమైన పరిచారికలా' అని భ్రమ కలుగుతున్నది. అక్కడ కట్టిన తెల్లని పట్టు జెండాలు గాలికి కదులుతూ ఆకాశగంగను ఆహ్వానిస్తున్నట్లు, ఆ ఆహ్వానాన్ని మన్నించి ఆకాశగంగ వస్తున్నట్లు ఉంది. పైపైన ఎగురు-తున్న జెండాలు గంగాతరంగాలలా ఉన్నాయి. ఆ వైజయంతప్రాసాదానికి రెండు వైపులా ఉన్న మణివేదికలను కల్పవృక్షపు మకరందంతో తడుపుతూ ఉండటం వల్ల, అవి చాలా చల్లగా ఉన్నాయి. వైజయంతపు ముఖద్వారాల పక్కన ఉన్న అరుగులతోనున్న చావడులలో బంగారు మంచాలున్నాయి. వాటిపైన కల్పవృక్షపు లేచిగుళ్ళు పరచి ఉన్నాయి. వాటి ఎర్రని కాంతి వల్ల ఆ మంచాలపై కూర్చున్నవారికి తాము సంజె కాంతులపై కూర్చున్నట్లుంది. ఆ మేడలో కట్టిన తెల్లని మేల్కట్లు, కల్పవృక్షపు పుష్ప-పరాగము అనే సువాసనాద్రవ్యం వల్ల పరిమళిస్తున్న వెన్నెలలా ఉన్నాయి.

శచీదేవి ఆ భవనపు నేలపై పారిజాతపుష్పాలను చల్లింది. ఆ పుష్పాలు మణిమయభూములలో ప్రతిఫలిస్తున్న నక్షత్రాలలా ప్రకాశిస్తున్నాయి. ఆ వైజయంతప్రాసాదంలో అగ్నిదేవుడి భార్య స్వాహాదేవి బంగారు పళ్ళెంలో హారతి రూపమైన కర్పూరదీపాలను పెట్టింది. యముడి భార్య అయిన

ధూమోర్ణాదేవి చందన కాలాగురు ధూపాలను ఏర్పాటు చేసింది. నిర్రుతి భార్య ఇంటి వెలుపల అతిథిసత్కారానికని ఉంచే బలి అన్నాలను సిద్ధం చేసింది. వరుణుడి ఇల్లాలు పగడాల తోరణాలతో వైజయంతాన్ని అలంకరించింది. వాయుదేవుడి భార్యచేత నియమించబడిన బాలికలు కర్పూరపు వీవనలను వీస్తున్నారు. కుబేరుడి ధర్మపత్ని శంఖ, పద్మ, మకరాకృతులున్న ముగ్గులతో ఆ ప్రాసాదాన్ని అలంకరించింది. శ్రీకృష్ణుడు కన్నులపండుగగా అందులో ప్రవేశించి, దిక్పాలకులైన ఇంద్ర-అగ్ని-యమ-నిర్రుతి-వరుణ-వాయు-కుబేర-ఈశానులకు యథాక్రమంగా, పేరుపేరునా వీడ్కోలు పలికి సత్యభామతో కలసి యథోచితకార్యాలను చేశాక -

నందనోద్యానవర్ణనము

ఆ బలభద్రుడి ప్రియానుజుడైన శ్రీకృష్ణుడు, సత్యభామతో, "సత్యా! మనోహరమైనదీ, దేవతల విహారవనమూ అయిన నందనవనం అదుగో. చూద్దామా?!" అని అంటూ మేనక, మంజుఘోష, రంభ, హరిణి మొదలైన దేవతాస్త్రీలు సేవిస్తుండగా, ఆనందంతో ఆకాశగంగాతీరానికి బయలుదేరాడు. ఆ నందనవనంలో మంచి గంధం, కల్పవృక్షం మొదలైన చెట్ల నుండి పూల తేనెల ప్రవాహాల తుంపరలు పడుతున్నాయి. తుమ్మెదల రెక్కల కదలికతో పిల్లగాలులు వ్యాపిస్తున్నాయి. కుంభాలవంటి స్తనాలుగల రంభ ఆలింగనం వల్ల పుష్పించిన ఎర్రగోరింట చెట్లున్నాయి. మంజుఘోష అనే అప్సరస ముఖపద్మకాంతుల దోహదము వలన పూసిన పూలగుత్తులుగల సంపెంగ చెట్లతోనూ, హరిణి అనే అచ్చర మద్యాన్ని

పుక్కిలించి ఉమ్మితే మొగ్గతొడిగిన పొగడచెట్లతోనూ, ఊర్వశి లాక్షా-రసాన్ని పూసుకొన్న ప్రకాశించే పాదాలతో తన్నటంవల్ల పూచిన అశోక-వృక్షాలతోనూ, మేనక విడిచిన సుగంధపూరితమైన నిట్టూర్పుల గాలితో మొగ్గలు తొడిగిన సింధువారపుష్పాలతోనూ విరాజిల్లుతున్న ఆ నందన-వనమందు శ్రీకృష్ణుడు సత్యభామతో విహరిస్తున్నాడు.

పర్వతాల రెక్కలు నరికిన ఆ ఇంద్రుడి ఉద్యానవనంలో దేవవేశ్యలు కొలుస్తూ ఉండగా సత్యభామతో కలిసి విహరిస్తున్న శ్రీకృష్ణస్వామిని సేవించడం కోసం వర్ష, శరత్, హేమంత, శిశిర, వసంత, గ్రీష్మ ఋతువులు కూడా వచ్చినాయి. ఒక చోట వార్షికమేఘమనే నాట్యరంగంలో మెరుపు అనే నర్తకి విలాసాలను చూపిస్తున్నది. మరోవైపు పద్మాల మధ్య రొద చేసే హంసలు కనుపిస్తున్నాయి. ఇంకోవైపు అరవిరిసిన చేమంతులు, ఆ చేమంతుల వాసనతోనున్న మంచుబిందువులు అలరిస్తున్నాయి. ఒకవైపు పూచిన కదంబవృక్షాలతో, లవంగపు చెట్లతో పరిమళభరితమైన చల్లని వాతావరణం, మరోవైపు తామ్రపర్ణీనదీజలాలతో తడిసిన పిల్లగాలులు మనస్సును ఆహ్లాదపరుస్తున్నాయి. ఇంకొకవైపు వికసించిన మల్లెలు, పాటలీకుసుమాలు, నల్ల కలువలు అతిశయంగా ప్రకాశిస్తున్నాయి.

మామిడి కొమ్మలు మలయమారుతముతో కూడి కొత్త చివుళ్ళనే గర్భాలను ధరించినాయి. ఆయాసపడుతున్న గర్భిణులు ఆభరణాలను తొలగించినట్లు పండుటాకులను రాలుస్తున్నాయి.

వసంతుడు గురివిందచెట్లను చేరగా మామిడికి కోపం వచ్చి పెదవి కొరుక్కున్నది కాబోలు. ఒక స్త్రీ తన పెదవిని కొరుక్కుంటే, ఆమె ఎర్రని, నున్నని పెదవిపై కనుపించే తెల్లని పలువరుసలా మామిడి చివుళ్ళపై తెల్లని పూత పూసింది.

విరహుల గుండెలను ముక్కలు చేస్తానని మన్మథుడి దగ్గర ప్రతిజ్ఞ చేసిందా అన్నట్లు, కోకిల చిగురాకుల గుత్తిని ముక్కుతో పొడుస్తున్నది.

మలయమారుతం వీచింది. ఆ నందనవనంలోని పొదులలోని తీగలు పండుటాకులను రాలుస్తూ మెల్లగా కదిలినాయి. వాటిని చూడగానే, చిన్నప్పుడు బాల్యచాపల్యం వల్ల, తాను గోపికల వస్త్రాలను దొంగిలించిన సంగతీ, అందువల్ల గోపికలు నీటిలోనుండి బయటకు రాకుండా ఉండిపోయిన మధురస్మృతులన్నీ కృష్ణుడి మదిలో మెదిలినాయి.

ఆ నందనవనంలో మామిడి పూలు ఇంకా పూర్తిగా వికసించలేదు. వాటిలోని తేనెను తాగనూ లేక, విడిచిపోనూ లేక తుమ్మెదలు వాటి చుట్టూ తిరుగుతున్నాయి. కొన్ని తుమ్మెదలు తొందరపడి లేతచివుళ్ళను కొరికి, అవి వగరుగా ఉండటంతో గొజ్జగి నీటితో నోళ్ళు కడుక్కుం-టున్నాయి. సంపెంగ పొదల నడుమన గోరింటచెట్టున్నది. దానిని చూసి తుమ్మెదలు కొన్ని నోరూరుతుండగా ఉస్సురంటున్నాయి. ఇంకా విచ్చుకోని పాటలపుష్పాల పైన కోరికతో వెళ్ళి, అవి ఎప్పటికీ విచ్చుకోక పోతే, వేరే గతి లేక అప్పటి దాకా తాగుతున్న మల్లెపూల తేనెలనే కొన్ని తుమ్మెదలు తాగుతున్నాయి. ఇలా తుమ్మెదల గుంపులు వసంతంలో

కనుచూపు మేర వ్యాపించి, మన్మథుడి సైన్యాలా అన్నట్లు, ఉత్సవకోలాహలం చేస్తున్నాయి. ఆ నందనవనము అన్ని ఋతువులకూ నెలవై నయనానందం కలిగిస్తుంటే దేవవనితాబృందాలు సేవిస్తుండగా నడుస్తూ ఉన్న ఆ నందనందనుడు సత్యభామతో ఇలా అన్నాడు.

"ఓ తామరదళనేత్రా! సత్యభామా! చూస్తున్నావా? ఈ నందనవనమనే తరుణిని వసంతుడు పెళ్ళాడుతున్న సమయంలో, ఒకరిపై ఒకరు దోసిళ్ళతో చల్లుకుంటున్న తలంబ్రాల వలె పోక చెట్ల నుండి కొత్త మొగ్గలు నేల మీద రాలిపడుతున్నాయి.

"తుమ్మెదల బారుతో 'మీకూ మాకూ తేడా లే'దని వాదించే కేశ సంపదగల ఓ సత్యభామా! చూసావా! ఈ చిలుకలు ఫలాలను తిన్న ముక్కులతోనే లవలీపత్రాలను పొడుస్తున్నాయి. ఆ పండ్లరసం ఆకులకు అంటుకుంటున్నది. చూడటానికి అది వసంతుడు లవలీలతలనే స్త్రీల చెక్కిళ్ళపై కుంకుమ పత్రాలను అద్దినట్లుంది. (లవలీ తీగెలు స్త్రీలు. తెల్లని లవలీపత్రాలు ఆ స్త్రీల చెక్కిళ్ళు. ఆ చెక్కిళ్ళకు ఆంటిన పండ్లరసం కుంకుమ పత్రాలు అద్దినట్లు ఉండటం).

"సింహపు నడుము లాంటి సన్నని కనీకనిపించని నడుముగల సత్యభామా! మదించిన ఈ చిలుకలు వాటి ముక్కులతో దానిమ్మ పండ్లను తుంచినాయి. అప్పుడా పండ్ల నుండి ఎర్రని గింజలు జారి పడినాయి. అవి, దానిమ్మ చెట్లనే కొత్త మేఘాలు తేనె అనే వర్షాన్ని కురిపించడం వల్ల వచ్చిన ఆరుద్ర పురుగులలా ఉన్నాయి.

"కోకిల అనే విటుడు, మామిడి తీగ అనే విలాసిని యొక్క చిగురాకు అనే పెదవిని కొరికినప్పుడు, తుమ్మెదలనే కంకణాలు మోగేలా కొమ్మలనే చేతులను విదిల్చింది చూడు.

"ఒక తుమ్మెద తన ఆడు తేటిని నిర్లక్ష్యం చేసి, వేరొక దానితో కలిసి పూతేనెను తాగుతున్నది. అప్పుడు అసూయతో రగిలిన ఆడు తుమ్మెద చనిపోవాలనుకుంది. సంపెంగపూల గంధపు ప్రవాహంలో దూకాలని ప్రయత్నించింది. దాని మగడైన గండు తుమ్మెదా, తోటి చెలులూ ఎంత చెప్పినా వినడం లేదు, చూసావా?" అని ప్రసంగిస్తూ, సత్యభామ విశాలమైన భుజాలపై చేయి వేసి ఆ వనంలో విహరించాడు.

ఆ వనదేవత నందనవనాన్ని కల్పకవృక్షపు పట్టుబట్టలతో[42] తుడిచి శుభ్రం చేసి, అశోకపుష్పాల తేనెలతో కల్లాపి జల్లి, శ్రీకృష్ణుడి కోసం సిద్ధం చేసిందా అన్నట్లు ఆ నందనవనం శోభించింది.

[42] కల్పవృక్షపు ఫలాలకు సంబంధించి ఒక అదనపు సమాచారం మేఘదూతం ఉత్తరభాగంలో 12 వ శ్లోకంలో కనబడుతుంది.

"ఆ [అలకా] నగరములోనున్న కల్పవృక్షము ఒక్కటే – నానావర్ణశోభితమైన వస్త్రమును, కనులకు విలాసమును ఇవ్వగల మధువును, చిగురుటాకులతో సహా పూచే పూవులను, రకరకాల ఆభరణాలను, పాదాలకు పూసుకోదగ్గ లత్తుకను – స్త్రీలకు కావలసిన అలంకారసామగ్రినంతా కల్పించగలుగుతుంది."

చతుర్థాశ్వాసము

పారిజాతము

అలా సత్యభామా కృష్ణులు వనవిహారం చేస్తూ, వచ్చి పారిజాత వృక్షాన్ని చూసారు. దేవతల శత్రువులైన రాక్షసులను సంహరించే శ్రీకృష్ణుడు సంభ్రమంతో సత్యభామను చూసి, "కాంతా! చూసావా? ఇదే పారిజాత-వృక్షం. వృక్షాలలో చక్రవర్తి ఇది. ముల్లోకాలకూ పూజనీయమైనది. అపూర్వపరిమళం గలవి దీని పుష్పాలు. శివుడి శిరస్సును చంద్రుడివలె, విష్ణువు వక్షస్థలాన్ని కౌస్తుభంవలె ఇది ఈ స్వర్గలోకాన్ని అలంకరిస్తున్నది.

"తరుణీ! ఈ పారిజాత వృక్షపు కొమ్మల మధ్య కదిలే లేచిగుళ్ళు పట్టు-బట్టలవలె ఉన్నాయి. వాటి నుండి వీచే గాలులు శచీదేవి పరివారంలోని వారాంగనలకు పూలు కోస్తున్నందువల్ల కలిగిన అలసటను పోగొడు-తున్నాయి.

"సత్యా! అటు చూడు. దీనికి పూచిన మాణిక్యాల వంటి పూలగుత్తుల యొక్క కాంతులను చూసి, తుమ్మెదల గుంపులు వాటిని తేనెలని భ్రమించి, వాటి చుట్టూ తిరుగుతూ రెక్కలాడిస్తూ తొండాలతో ఆ పూలను పొడుస్తున్నాయి.

"ఆ కల్పకవృక్షానికి[43] ఆభరణాలు వేలాడుతున్నాయి[44]. వాటి కాంతి పక్షులపై పడి అవి కూడా మెరుస్తుండటంతో, బెదురుచూపుల దేవతాస్త్రీలు ఏవి ఆభరణాలో, ఏవి పక్షులో తెలుసుకోలేకపోతున్నారు. అప్పుడు జాగ్రత్తగా పరిశీలించి, పక్షుల కూతలను విని, కూయనివి ఆభరణాలని పోల్చుకుంటున్నారు.

"ఓ యువతీ, ఈ కల్పవృక్షపు పాదులోని నీటిలో కనబడుతున్న దీని నీడను చూడు. మన కన్నా ముందే ఇది భూమికి దిగిపోతున్నట్లున్నది.

"ఓ గజగామినీ సత్యభామా! దేవేంద్రుడు తన భార్య శచీదేవిని తన ఒడిలో కూర్చోబెట్టుకుని, ఆమె అందమైన నిడుపాటి శిరోజాలను దువ్వి, చిక్కదీసి, అకాశగంగలోని తామరతూండ్ల దారాలతో ఈ పారిజాత-కుసుమాలను దండ కట్టి, చాలా ఆనందంగా మహోఘనమైన ఆమె కొప్పులో ఆ దండను ముడుస్తాడు.

"ఓ సత్యా! విను. పడతులు ఈ పారిజాతవృక్షాన్ని ఒక్కదానినే, తిలక, సంపెంగ, క్రోవి, సింధువార, ప్రేంకణ, మామిడి, గోగు, పొన్న, పొగడ, కంకేళి చెట్లనుకొని మనస్సులో ఊహించి అదే క్రమంలో ఆపై చెట్లకు చేయవలసిన దోహదక్రియలైన చూడటం, ముఖం ఎత్తడం, కౌగిలించడం, వాసన చూడటం, పాడటం, తాకటం, మాట్లాడటం, నవ్వటం, మధువును

[43] పారిజాతాన్ని కల్పవృక్షాలలో ఒకటిగా పరిగణిస్తారు (మిగతావి సంతానము, మందారము, కల్పకము, హరిచందనము)

[44] కల్పవృక్ష ఫలాలు ఈ ఆభరణాలు .

పుక్కిలించి వాటిపై ఉమ్మటం, కాళ్ళకు పారాణి పూసుకుని ఆ చెట్లను తన్నటం మొదలైనవి చేయగా, ఈ కల్పవృక్షం ఒక్కటే వాళ్ళు కోరిన ఫలపుష్పాలను ఇస్తుంది.

“సత్యా! అందమైన యువతులు తిలకించటంవల్ల తిలకవృక్షమూ, కల్లు ఉమ్మివేయటంవల్ల పొగడచెట్టు, సంగీతం పాడటంవల్ల ప్రేంకణ-వృక్షమూ, కరస్పర్శవల్ల మామిడి, నవ్వటంవల్ల సురపొన్న, ముఖమెత్తి చూడటంవల్ల చంపకమూ, ఆలింగనం చేసుకోవడంవల్ల గోరింటా, వాసనచూడటంవల్ల వావిలీ, కాలితో తన్నటం వల్ల అశోకమూ, మాట్లాడటంవల్ల గోగుచెట్టూ పుష్పిస్తాయి, ఫలిస్తాయి. అన్నీ తానే అయి ఈ కల్పవృక్షము అన్ని ఋతువులలోనూ అన్ని రకాల ఫలపుష్పాలను ఇస్తుంది.”

కృష్ణుడి మాటలను విని సత్యభామ ఇలా అన్నది- “స్వామీ! ఇంకా ఎందుకు ఆలస్యం? ఈ దేవేంద్రుడి పారిజాతవృక్షాన్ని పెకలించుకొని, నీ ప్రతిజ్ఞ చెల్లేలా నా ఇంటి పెరటితోటలో చక్కగా నిలబెట్టు.”

సత్యభామ పలుకులను విని శ్రీకృష్ణుడు దరహాసంతో- “కాంతా, ఈ వనంలో నిన్ను సంతోషంతో దేవతాస్త్రీలు కొలుస్తుండగా నీ కోరికను తీరుస్తాను.” అని కల్పవృక్షపు పూలగుత్తిని కోసి ఆమె చెవికి అలంకారంగా ఉంచాడు. ఇలా మురాంతకుడైన శ్రీకృష్ణుడు ప్రాణసఖిని ఊరడించి, పద్మములవంటి కళ్ళున్న సత్యభామతో కలిసి పూలు కోయాలనే ఆసక్తితో, పూలగుత్తుల వంటి గోపికాస్తనాలపై కోరిక గలవీ, పదునైనవీ అయిన తన గోళ్ళతో ఆ పూలను కోశాడు.

అక్కడ సురవనితలు పూలు కోస్తుంటే, వాళ్ళ పెద్దపెద్ద కళ్ళను చూసి గండు తుమ్మెదలు కలువలనుకొని మీద వాలుతున్నాయి. వాటినుండి తప్పించుకోవాలంటే కళ్ళు మూసుకోవాలి. కానీ దేవతలు అనిమిషులు కాబట్టి కళ్ళు మూతలు పడవు. అందుచేత వాళ్ళు అటు కళ్ళను మూసుకోలేకా, ఇటు తుమ్మెదల బాధను సహించలేకా చిత్రమైన బాధను పొందుతూ, ఆ తుమ్మెదల బాధనుండి చక్కగా కళ్ళుమూసుకుని తప్పించుకుంటున్న సత్యభాను చూసి, తాము కూడా మానవులమైతే ఎంత బాగుండును! అని అనుకున్నారు. ఒక్కసారి ఆ భాగ్యం లభిస్తే చాలనుకొన్నారు.

అక్కడ సంపెంగల పుప్పొడులలో సర్వశుభచిహ్నాలుగల ఆకృతులలో శ్రీకృష్ణుడి పాదచిహ్నాలు ఏర్పడినాయి. వారి వెంట వస్తున్న అప్సరసలు ఆ పాదపద్మాల చిహ్నాలను తొక్కకుండా విలాసంగా పక్కకు తప్పుకుంటూ నడుస్తూ తమలో తాము మాట్లాడుకుంటున్నారు.

"ఓ కొమ్మా! తొందరేల? కొనగోటితో గోరింటపూలు కొయ్యి."

"అలా పద్మాలపై నీరు ధారగా పొయ్యకు. నీళ్ళను నెమ్మదిగా చిలకరించు."

"ఓ లేడి కన్నుల చిన్నదానా! ఆ తీగనలా కొట్టకు. దాని ఒళ్ళు నొచ్చుకుంటుంది. అదేం మోటు పరిహాసం?"

"విచారించకు. ఈ గోరువంకను చూడు. తీరా ప్రియుడు వచ్చే వేళకు అలక ఏల? ఓ గజగమనా! ఈ మొల్లలను అందంగా ముడువు."

"ఓ వనితా! అలా అబద్ధాలాడకు. నాకది నచ్చదు."

"పందెం వేసినందుకు, న్యాయమన్నది లేకుండా పాట పాడి ఈ ప్రేంకణపుష్పాన్ని తెచ్చాను."

"పొన్న మొగ్గల మాలను అందంగా గుచ్చావు. మెడలో వేసుకుంటే బాగుంటుంది."

"ఓ మీననేత్రా! దీని పువ్వులను ఇంకా ఎందుకు అడుగుతున్నావు? దురాశ కదూ!"

"నీ జడ పరాగంతో, తీయమామిడి పూలతేనెతో నిండి పోయింది. తుడుచుకో."

"ఓ పడతీ! పొన్న పూల కోసం ఇలా ఏవేవో మాట్లాడటం దేనికి?"

"ఓ భామా! త్వరపడి ఆ పూల గుత్తిని కోయకు. అదింకా విచ్చుకోలేదు."

"ఓ మగువా! మాటిమాటికీ అలా పూలమాలలను తీసి చూడకు. ఆ మాలలు చిక్కుపడుతున్నాయి."

"ఇక్కడికి రావద్దు. తిరిగి వెళ్ళిపొండి. ఈ ఎలమావి చెట్లు మేము విహరించే చోటులు."

"మాటిమాటికీ ఇలా నీచమైన మాటలాడకు. 'బాలకి' అని నన్ను దుర్భాషలాడుతున్నావు."

"మందగమనాన్ని చూపించి, చెలీ! నువ్వు హంసను మోసం చేసి పట్టుకున్నావు."

"చెలీ! ఈ అశోకవృక్షము పరిమళం దట్టంగా కమ్ముకునేలా పూచింది, ఘృతాచీ! ఈ అశోకవృక్షానికి నీ కాలితాపుతో దోహదం చేసావా?"

"'తేనె కోసం రావే' అని పిలుస్తున్నావు. రంభా! అవునులే, రంభలలో అనేకము (అరటి చెట్లలో తేనె ఎక్కువగానే ఉంటుంది)"

"పువ్వులు ఇమ్మని నిన్ను కోరినప్పుడు నువ్వు కపటంగా ముఖం చాటువేసావు. వద్దు. నా గజనిమ్మ చెట్టును ముట్టుకోవద్దు."

"ప్రాణానికి ప్రాణమని నీవే అంటావు కదా. ఈ తీగను తొక్కవద్దు."

"మంజుఘోషా! ఈ వనంలో బంగారు తీగలు ఉండటం అనుమానమా?"

"ఈ తీగ తుమ్మెదలను చూసి భయపడదు."

"ఏమి అరచిందో, మేము మరిచామా ఏమిటి?"

"మానినీ! చిలుకలు అమృతమధురాలైన ఫలరసాలను తాగి గంతులు వేస్తున్నాయి.

"గుత్తులు గుత్తులుగా పూచిన లేత మామిడి చిగుళ్ళను తిని కోకిలలు కుహూ కుహూ అని కూస్తున్నాయి."

"మొగలికొమ్మ తన కమ్మని పరిమళంతో కొంకికర్రతో కోస్తున్న కాంతకు చిక్కింది."

"రమణీ! గొజ్జగి పొదలు చాలా దూరం."

"పంతమెందుకులే, రా."

అలా ఏవేవో మాట్లాడుకుంటూ స్త్రీలు పూలు కోస్తున్నారు. తీగలతో కట్టిన ఉయ్యాలలూగుతున్నారు. మిన్నేటి బంగారు పద్మాలు పరచిన వేదికలపై కూర్చుని, పూల పుప్పొడులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ, ఆనందంగా విహరిస్తున్నారు. ఇంతలో సూర్యుడు ఆకాశం మధ్యకు చేరాడు. అది మధ్యాహ్నకాలం. జారిన చీర ముడులతో, వాడిన వదనాలతో, వీడిన కొప్పులతో, చెక్కిళ్ళ మీద చెదిరిన పత్రరచనలతో, చిక్కుపడ్డ మణిహారాలతో, నిట్టూర్పులతో, పుప్పొళ్ళ వల్ల ఎర్రబడ్డ వాల్గన్నులతో, ఆ దేవతాస్త్రీలందరూ, మన్మథపూజానంతరం ఆయాసపడుతున్న వారిలా ఉన్నారు.

భయంకరమైన ఎండలకు తొడిమలు వాడిపోయి, పూలు రాలి-పోతున్నాయి. అవి వనదేవత శరీరం నుండి జారుతున్న చెమట బిందువులలా ఉన్నాయి.

గాలే ఆహారంగా కల పాములు చల్లగాలి లేక ఆకలితో ఒరిగి-పోయినాయి. మదించిన తుమ్మెదలు వేడిగా కాగిపోతున్న పద్మ-మకరందాలను తాగడానికి భయపడ్డాయి. మేరుపర్వతశిఖరాలలోని

గండశిలలు నీరైపోయేలా ఎండలకు మండిపోతున్నాయి. కొంగల భయానికి చేపలు ఎండిన నీటిపడియల బురదలో దాక్కుంటున్నాయి.

పక్షుల కళ్ళు కదలటం లేదు. రెక్కలు విడివడి పోయినట్లున్నాయి. వాటి వక్షస్థలాలు ఎండి లోపలికి కుంగి వీపులకు అంటుకు పోతున్నాయి. ఎండిపోయిన ముఖాలు, శుష్కించిన నోళ్ళు తెరిచి, కంఠాలు పరితపిస్తుంటే, బరువుగా నిట్టూర్పులు విడుస్తున్నాయి. ఎండ వేడికి కందిపోయి, రంగు మారి, సన్నటి స్వరంతో స్వజాతి పక్షులను పిలుస్తూ, ఆ మధ్యాహ్నసమయంలో చెట్లపై ఆకుల మాటున నిలిచి ఉన్నాయి.

ఒక చోట చక్రవాకం, ఎండ వేడికి సలసల కాగుతున్న పద్మ-మకరందాన్ని తన రెక్కలతో విసరి చల్లార్చి ప్రియురాలికి తనివితీరేలా తాగిస్తున్నది. ప్రేయసి తాపాన్ని పోగొట్టడానికి తామర తూడును ముక్కలుగా కొరికి తినేందుకు ఇస్తున్నది.

ఇక ఐరావతం, అభ్రమువు అనే పేరుగల తన భార్య ఎండకు అలసిపోగా, దానికి ఉపశాంతి కలుగజేయడానికి, దానిపై తన తొండంతో నీటిని పీల్చి చల్లుతున్నది. విసనకర్రల లాంటి తన చెవులతో చల్లని గాలులను విసురుతున్నది.

జలక్రీడలు

అప్పుడు జగదీశ్వరుడైన శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి జలక్రీడకు బయలుదేరాడు. ఆ ఉద్యానవనంలోని పూల తీగలను గొడుగులా

పట్టుకొని వాళ్ళను సేవిస్తూ దేవతాస్త్రీలు వాళ్ళను అనుసరించారు. ఆ సత్యభామ స్తనభారం చేతనూ, జఘనభారం చేతనూ శరీరాన్ని మోసే శక్తి లేక, మందమందంగా నడుస్తూ శ్రీకృష్ణుడి భుజాన్ని ఊతగా చేసుకున్నది. అప్పుడు మేనూ మేనూ తగులుతూ ఉండటం చేత వాళ్ళ శరీరాలు ఆ స్పర్శకు పులకరించి పోతున్నాయి. 'ఎండ వేడిని తాళలేక తననీటిలోనే మునిగింది ఆకాశగంగ. తన తడి జుట్టును ఆరబెట్టుకునేందుకు ఆమె కొప్పు విప్పిందేమో అన్నట్లున్నాయి, అలల కదలిక వల్ల ఒడ్డుకు చేరిన నాచు తీగలు' అని అనుకుంటూ శ్రీకృష్ణుడు రత్నసోపానాలను దిగి, ధర్మపత్ని అయిన సత్యభామ చేతులు పట్టుకుని ఆ దేవసరోవరాన్ని చేరబోయాడు. సురభామినులు కూడా ఆభరణాలను తీసి, కల్పవృక్షం ప్రసాదించిన స్నానానికి అనుకూలమైన వస్త్రాలను[45] ధరించి, కొత్త మల్లెల కాంతులను ధిక్కరించే శరీరకాంతులతో, మనోహరమైన పెద్ద జడలు గుండ్రని పిరుదులను రాసుకుంటూ ఉండగా సురగంగలో ప్రవేశించారు. వాళ్ళు నదిలో దిగి ఈదుతుంటే, వారి పీనపయోధరాల తాకిడికి నీళ్ళు నాలుగు దిక్కులకూ చెదిరి, జలాలు వారి నాభిప్రదేశాలలో చేరినాయి. లోతైన ఆ ప్రదేశాలు ఆ జలాలను దాచేసినాయి. గంభీరస్వభావులు ఇతరులు కష్టాలలో ఉంటే ఆదుకుంటారు గదా![46]

[45] తొలుతగా చైనాలో ఉత్పత్తి అయినందున పట్టును ''చీని'' అని, పట్టు వస్త్రాన్ని ''చీనాంబరం'' అని అంటాము. అప్సరలు తొడిగిన ఈ బట్టలను ''చీని పావడలు''అని పేర్కొన్నాడు తిమ్మన!
[46] గంభీరం అంటే లోతు అని అర్థము; ఆ అప్సరసల బొడ్లు లోతుగా ఉన్నాయని చమత్కారము.

దేవవేశ్యలనే ఆడ ఏనుగులు, స్తనాలనే కుంభస్థలాలు బయటపడుతూ ఉండగా, శ్రీకృష్ణుడనే మగ ఏనుగు పైన, పద్మాల పుప్పొళ్ళు కలిసిన పరిమళభరితమైన ఆకాశగంగాజలాలను తమ చేతులనే తొండాలతో చల్లినాయి. అనిమిషభామలు నీళ్ళపై చరిచినప్పుడు మృదంగధ్వని వంటి శబ్దం పలికింది. ఆ నీటిలో ఉన్న తామర తీగలు, పువ్వులు చలించినాయి, తుమ్మెదలు ఝుమ్మంటూ పైకి లేచాయి - తమ హస్తాలను ఊపుతూ పద్మినులు నృత్యం చేస్తుంటే, ఆ తుమ్మెదల ఝుంకారాలు కంకణ-ధ్వనులవలె మోగాయి. గడుసువారైన ఆ సురభామినులు పాదాలనూ, చేతులనూ, ముఖాలనూ నీటిపై తేలుస్తూ సంతోషంతో ఈదు-లాడుతున్నారు. అప్పుడా సురగంగలోని పద్మాలు రెండింతలైనట్లున్నాయి. దానికి, ఆ స్త్రీల ముఖాలు, చేతులు, పాదాలు పద్మాలలా ఉండటమే కారణం. పరస్పరం తామరపూలతో కొట్టు కుంటూ ఆ దేవవనితలు తమ చేతులను పైకెత్తారు. అలా ఎత్తిన తీగల వంటి చేతులకు చివర ఉన్న తెల్లని గోళ్ళు, మదనుడి విజయాలను సూచించడానికి చెక్కించిన స్తంభాలపై ఉన్న బిరుదు అక్షరాలలా ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఆ దేవతాస్త్రీలతో కలిసి గంగానదిలో వికసించిన పద్మాల గుత్తులతో బంతులాట ఆడుతున్నాడు. అందువల్ల ఆయన శరీరం అంతా తామర రేకులు అంటుకొని ఉండగా ఎంతగానో శోభిల్లాడు. ఇంద్రుడికి వేయి కళ్ళు ఉండగా అతని తమ్ముడైన ఉపేంద్రుడికి వేయి కన్నులు ఉండవా?

సత్యభామ తన ప్రాణనాథుడైన శ్రీకృష్ణుడి మనోహరమైన భుజాలను పట్టుకుని మెల్లగా అలల ఊయలల నడుమన విహరించే రాజహంస పిల్ల

వలె జలక్రీడలు ఆడుతున్నది. సురగంగ కూడా నాచును శిరోభూషణంగా (వేణీప్రవాహం కాబట్టి), కదలాడే వేణి (స్త్రీపరంగా కేశాలు) కలదై, చక్రవాకపక్షులనే స్తనాలుగలదై, దేవతాస్త్రీల సాన్నిధ్యంలో తానూ ఒక అప్సరసలా ప్రకాశించింది. అమరవనితలు జలక్రీడలాడుతుండగా, తెగిపడిన హారాలలోని రత్నాలు పడిన చోట తామ్రపర్ణీనదిలా, వాళ్ళ నిడుపాటి శిరోజాల కాంతివల్ల మరొక చోట యమునానదిలా, వాళ్ళ ఎత్తైన వక్షోజాలకు పూసిన కుంకుమవల్ల ఇంకొకచోట శోణానదిలా ఆ దివ్యగంగ ప్రకాశించింది. శిరోజాలు, ముక్కెరలలోని రత్నాలు, సన్నని నడుములు, స్తనాల జంటలు, చెవుల ఆభరణాలు కదలాడుతుండగా ఆ దేవతాస్త్రీలు ప్రయత్నపూర్వకంగా చేతులు ఆన్చి పట్టుకొని జారుడు బండలపైన ఒకరి వెనుక ఒకరు జారుతున్నారు. వాళ్ళలా జారుతుంటే మన్మథుడు ఒకదాని వెనుక ఒకటి పుంఖానుపుంఖాలుగా ప్రయోగిస్తున్న సంపెంగపూల బాణాలలా తోస్తున్నారు. శ్రీకృష్ణుడు అనేకవిధాలుగా ఆ సురగంగలో జలకాలాడి, సత్యభామతో కలిసి, పిరుదులనంటిన కేశపాశాలు గల దేవవేశ్యలు సేవిస్తుండగా, స్వేచ్ఛగా తిరిగే మదపుటేనుగులా వియద్గంగ నుండి బయటకు వచ్చాడు.

తమ శిరోజాలను ఆరబెట్టుకుని, కొత్త పుష్పాలను తలలో తురుముకుని శరీరాలకు సుగంధలేపనాలను పూసుకొని, ఆభరణాలను ధరించి, కల్పవృక్షజనితమైన పట్టుపుట్టాలను కట్టుకొని ఆ దేవతాస్త్రీలు మన్మథబాణాలలా ఉన్నారు. పద్మపత్రాక్షుడైన శ్రీకృష్ణుడు సత్యభామతో

కలిసి అమూల్యమైన ఆభరణాలను ధరించి, దేవతాస్త్రీల సేవలందు-కుంటూ, దేవేంద్రుడి బాహువులచేత రక్షింపబడే అమరావతి పట్టణాన్ని జేరి, మిగతా దేవలోకవాసులు ఉత్సుకతతో మరింత నిశ్చలమైన కన్నులతో మేడల పైనుంచి చూస్తూండగా వైజయంతభవనప్రవేశం చేశాడు.

సూర్యాస్తమయం

అప్పటికి సూర్యుడు అస్తమిస్తున్నాడు. అప్పటిదాకా కాంతులు అనే తన కాంతల సమూహంతో పద్మవనాలలో సంచరిస్తున్న సూర్యుడు తానూ (పడమటి) సముద్రంలో జలక్రీడలాడటానికి వెళ్తున్నాడా అన్నట్లు, పడమటి దిక్కున వెలిగాడు.

చురచురలాడని సాయంకాలపు ముసలి ఎండ సురవనితల స్తనాలపై కుంకుమ రంగును వ్యాపింపజేసింది. బంగారు కొండకు (మేరు పర్వతానికి) ఒక వింత మిసిమిని కలిగించి, సాయంత్రపుటెండ తీక్ష్ణత ఎంత మాత్రమూ లేకుండా వ్యాపించింది.

ఎండకు వెరచి అప్పటిదాకా మేరుపర్వతగుహలలో తలదాచుకున్న కిన్నరుల జంటలు బయటకు వచ్చి, తాపం తీరేలా సురగంగలో స్నానం చేసి, అమరావతిలోని రమ్యమైన భవనాల ముంజూరుగూళ్ళ[47] కిందికి చేరుకున్నాయి.

[47] ఇంటి వసారా పైకప్పు ముందుభాగము

సూర్యబింబం పడమటి సముద్రంలో మునిగిపోయింది - సంజ వన్నె అనే గరుత్మంతుడి రెక్కల దెబ్బ తాకి ఆకాశమనే సర్పపు పడగమీది మాణిక్యం నేల రాలిందా అన్నట్లు.

అప్పుడు చీకట్లు వ్యాపించాయి – మహేంద్రవాహనమైన ఐరావతపు మదజలమువలె, అగ్నిహోత్రుడి దట్టమైన పొగల కాంతివలె, యముడి మహిషపు నిగనిగవలె, రాక్షసుడైన నిరృతి కరవాలపు కాంతివలె, వరుణుడి పతాకంవలె, కుబేరుడి ఇంద్రనీలమణుల కాంతివలె, ఈశానుడి కంఠ-ప్రదేశపు నీలిమవలె.

చంద్రోదయం

పద్మముల శోభను కాజేసే దొంగ, చకోరాలకు ప్రాణమూ, మన్మథుడి మేనమామ, చల్లదనానికి గనీ, ఈశ్వరుడి కొప్పున వెలిగే అందమైన మణీ, అమృతానికి నిలయుడూ అయిన చంద్రుడు ఆ సమయంలో ఆకాశాన్ని ఒరుసుకుంటున్న శంఖపు శోభతో తూరుపు కొండపై నెమ్మదిగా ఉదయించాడు. ఆ రాత్రి శ్రీకృష్ణుడు సత్యభామతో గూడి వైజయంత-ప్రాసాదంలో మన్మథసామ్రాజ్యాన్ని పాలించి సుఖంగా నిద్రించాడు. తెల్లవారింది.

సూర్యోదయం

ముకుళించిన పద్మాలలో చిక్కిన గండు తుమ్మెదలనే బాణాల కొనలను వదిలించే విశల్యకరణి అనే ఔషధం లాగా, కాలగతివల్ల నశించిన

దినలక్ష్మిని మళ్ళీ బతికించే సంజీవకరణి అనే మందులాగా, రాత్రి అనే కత్తిచేత ముక్కలైన చక్రవాకపక్షులను మళ్ళీ కలిపే సంధానకరణి అనే ఔషధంలాగా, చీకటివల్ల అందం పోయిన దిక్కులకు బంగారు శోభను సంతరించి పెట్టే సౌవర్ణకరణి అనే మందులాగా, అతిశయించే ఎండలనే అగ్నిని పుట్టించే అరణిలాగా (ఇంకో కర్రతో రాపిడి చేసి అగ్నిని పుట్టించే కర్రను అరణి అంటారు), పాపమనే భయంకరసముద్రాన్ని దాటించే తరణిలాగా (ఓడలాగా), తొలిచదువులు (వేదములు) అనే మాణిక్యాలను ఉంచిన బరణిలాగా (భరిణె వలె) తూర్పు కొండ అనే ఎత్తైన తోవపై ఉదయించాడు సూర్యుడు.

[పారిజాతాపహరణంలో ఇక్కడ కొన్ని మందులు వాటి ఉపయోగాలు చెప్పబడినాయి. గమనించండి. వీటి ప్రసక్తి శ్రీమద్రామాయణం యుద్ధకాండలో కూడా ఉంది. ఎవరనగలరు మన ప్రాచీనభారతదేశంలో ఆయుర్వేదంలో ఔషధాలు, చికిత్సా విధానాలు లేవని?]

పారిజాతాపహరణం

పారిజాతవృక్షాన్ని అపహరించడానికి అదే తగిన సమయమని ఎంచి, శ్రీకృష్ణుడు సత్యభామతో గరుత్మంతుడిపైనెక్కి నందనవనంలోనికి నిబ్బరముతో ప్రవేశించాడు. సకల దేవతల నమస్కారాలను అందుకొనే శ్రీకృష్ణుడు ఈరోజు తనను భూమికి తీసుకుని పోవడానికి వచ్చాడని సంతోషించిన పారిజాతవృక్షము గాలికి ఊగుతున్న కొమ్మలతో సంభ్రమాన్ని ప్రకటించింది.

అయితే, శ్రీకృష్ణుడు పారిజాతవృక్షాన్ని మాత్రమే తీసుకుని వెళ్తాడని, తమను తీసుకువెళ్ళడం లేదనే బాధతో తతిమ్మా చెట్లు మకరందాన్ని కన్నీళ్ళుగా కార్చినాయి. శ్రీకృష్ణుడే దేవతల కోర్కెలను తీర్చే కల్పవృక్షం. తనలాగే దేవతల కోరికలను తీర్చే ఆ కల్పవృక్షము పట్ల అసూయ పడ్డాడేమో అన్నట్లు, ఆ కంసారి గర్వంతో, గోవర్ధనపర్వతాన్ని ఎత్తిన చేతితో పెకలించి, విలాసంగా గరుత్మంతుడిపైన పెట్టి, సత్యభామకు సంతోషం కలిగించాడు. పద్మనాభుడు వేగంగా పారిజాత వృక్షాన్ని పెకలించి ఎత్తగానే, ఆ కల్పవృక్షపు తీగలు, కొమ్మలలో వేలాడుతున్న పట్టుబట్టల రూపాలైన చిగుళ్ళను గట్టిగా పట్టుకొని తీసుకొనిపోవడానికి వీలులేకుండా అడ్డుపడుతున్నట్లు వెనక్కి లాగినాయి. భార్యలు ప్రాణనాథుడిని వదలి ఉండటానికి ఒప్పుకోరు గదా! (ఇక్కడ చెట్టు భర్త అనీ, వాటికి చుట్టుకుని ఉండే తీగలు భార్యలనీ భావం).

గరుత్మంతుడు గాలిలోకి లేవగానే, అతని రెక్కల గాలికి, మిగిలిన దేవతావృక్షాలు కూడా తమ పట్టు సడలిపోగా ఆకాశంలోకి ఎగిరినాయి. అది చూసి వనపాలకులు శ్రీకృష్ణుడికి అడ్డు తగిలారు.

"ఓ యదువీరా! శ్రీకృష్ణా! ఇలా దుండగం చేసి ఈ దేవతావృక్షాన్ని దొంగిలించి, మోసంతో తీసుకుని పోవడం తగునా? దేవేంద్రుడు ఈ కల్పవృక్షాన్ని శచీదేవికి బహూకరించాడు. ఆమె అనుమతి లేకుండా తుమ్మెదలు కూడా ఈ పారిజాతవృక్షం దగ్గర తిరగడానికి భయ-పడతాయి. అటువంటి సురతరువును, చుట్టరికాన్ని కూడా వెక్కిరిస్తూ తీసుకుని వెళ్ళడానికి నీకు మనసెలా ఒప్పింది? మళ్ళీ దీనిని ఎక్కడినుండి

తీసావో అక్కడే మళ్ళీ పాతు. ఇంద్రుడికి ఈ సంగతి తెలిస్తే మంచిది కాదు.'' అన్నారు.

ఆ వనపాలకుల మాటలను విని సత్యభామ చిరునవ్వు నవ్వింది. ఏదో చెప్పాలనుకుంటున్న కృష్ణుణ్ణి చేతి సైగతో వారించి జారుతున్న పైటను సవరించుకొని, విడిపోతున్న జుట్టును ముడి వేసుకుంది. ఎర్రబడిన కళ్ళతో చూస్తూ ఇలా అన్నది. ''ఓ వనపాలకులారా! వినండి. పాలసముద్రంలో పుట్టిన ఈ దేవవృక్షానికి ఇంద్రాణి ఎవ్వతె? ఇంద్రుడెవరు? దీనితో పాటు పుట్టిన లక్ష్మీదేవిని, కౌస్తుభరత్నాన్ని ఎవరు గొప్పగా ధరించారో అతడిదే ఇది కూడా. ఇదేమైనా తేరగా వచ్చిందా ఒకరి సొమ్ము కావడానికి? ఇదుగో, ఇప్పుడే నా భర్తచేత ఈ కల్పవృక్షాన్ని పెకలింపజేసి ఎత్తుకొని పోతున్నాను. వృథాగా మాటలెందుకు? వీరపత్ని ఐతే, శచీదేవి తన భర్త ఇంద్రుణ్ణి ఇక్కడికి పంపించి, సత్యభామావిధేయుడి నుండి మళ్ళీ తీసుకొని పోవడమే గొప్ప.'' అన్నది.

ఆమె గర్వంగా పలికిన ఆ మాటలను విని వనపాలకులు ఆశ్చర్య-పోయారు. వెంటనే వెళ్ళి ఇంద్రుడికి విషయాన్ని విన్నవించారు. దేవేంద్రుడికి కోపం వచ్చింది. ''ఏమిటి ఈ కృష్ణుడు? ఇదేమైనా వ్రేపల్లె అనుకుంటున్నాడా? అక్కడ మద్దిచెట్లను పెకలించినట్లు ఇక్కడ ఈ పారిజాతవృక్షాన్ని పెకలించవచ్చును అనుకుంటున్నాడా? ఇది మంచిదేనా? గరుత్మంతుడైనా చెప్పలేదా కృష్ణుడికి నా వజ్రాయుధం దెబ్బ ఇలా ఉంటుందని? ఆశ్చర్యంగా ఉంది.'' అని శచీదేవి ముఖం చూసి ఇలా అన్నాడు. ''దేవీ! పద్మముఖీ! విను. ఇంత మాత్రానికే దిగులెందుకు? ఇదుగో

ఇప్పుడే వెళ్ళి, ఆ సత్యభామకు గర్వభంగం చేసి, కల్పవృక్షాన్ని విడిపించి వస్తాను'' అని అహంకారంతో లేచి, అంతఃపురం లోనుండి సుధర్మ అనే తన సభాభవనానికి వచ్చాడు.

అలా సుధర్మాసభాభవనానికి వచ్చిన ఇంద్రుడు, "ఆ యాదవకృష్ణుడికి కన్నూ మిన్నూ కానరావడం లేదు. పారిజాత వృక్షాన్ని దొంగిలించుకు పోతాడా?'' అంటూ కళ్ళెర్రజేసి దిక్పాలకులను చూసి తన వజ్రాయుధాన్ని చేబట్టాడు.

యుద్ధసన్నాహం

దేవేంద్రుడి భవనం ముందు రణభేరి మోగింది. ఆ భేరి తనను కొడుతున్న కర్రల దెబ్బల బాధను ఓర్వలేక సృష్టిస్థితిలయకారకుడైన శ్రీకృష్ణుడి జోలికి వెళ్ళవద్దని మొరబెట్టుకుంటున్నదా అన్నట్లు మోగింది.

ఆ సమయంంలో, కళ్ళాలు అమర్చిన గుఱ్ఱాలతో, గొలుసులు విప్పిన ఏనుగులతో, జెండాలు కట్టిన రథాలపై ఉన్న సారథులతో, అపజయం ఎరుగని వీరుల వీరాలాపాలతో మార్మోగుతూ ఆ అమరావతి అంతా మందరపర్వతంవల్ల చిలుకబడుతున్న సముద్రంలా అల్లకల్లోలంగా ఉన్నది.

''చూసావా! 'నీ తమ్ముణ్ణి, మిత్రుణ్ణి.' అంటూ వచ్చి, ఇంద్రుడి చేత సకలమర్యాదలు చేయించుకుని, చివరకు పారిజాతవృక్షాన్ని దొంగిలించి ఎంత అన్యాయం చేశాడో శ్రీకృష్ణుడు? ఔరా, మంచి చుట్టమే ఇతడు," అని అందరూ చెప్పుకుంటున్నారు.

ఆ సమయంలో - తత్తరపాటుతో, పర్యాణం (పల్యాణం/పల్లం/జీను) వెయ్యకుండా గుఱ్ఱాలెక్కి పరుగున వెళ్ళాలనుకునేవాళ్ళూ, ‘కృష్ణుడు’, ‘కృష్ణుడు’ అని మళ్ళీ మళ్ళీ అంటూ, ‘ఏమి, ఏమి?’ ‘ఎక్కడ, ఎక్కడ?’ అని అడిగేవారికి అర్థమయ్యే విధంగా సమాధానం చెప్పే వ్యవధానం లేక, ‘పారిజాతము, పారిజాతము’ అని అంటూ యుద్ధోత్సాహంతో అటూ ఇటూ తిరిగేవాళ్ళూ, శస్త్రశాలలోనికి వెళ్ళి కుంతము, ముసలము, ముద్గరము, శూలము వంటి ఆయుధాలను చేతికందుకునే తొందరలో తమవి కాని ఆయుధాలను తీసుకుని వాటి సొంతదారులతో గొడవపడేవాళ్ళు… “మరుదధిపతియైన ఇంద్రుడికి, మలినవర్త్ముడు (నల్లని పొగ మార్గముగా గలవాడు) అయిన అగ్నికి, మహిషవాహనుడైన యముడికి, మాంసాహారి నిర్రృతికి, మకరాలయాధిపతి వరుణుడికి, మాతరిశ్వుడనే పేరుగల వాయువుకు, మనుష్యధర్ముడని పిలవబడే కుబేరుడికి, మహేశ్వరుడైన ఈశానుడికి ఒక మానవుడు సాటియా?”[48] అనేవాళ్ళూ, కత్తులను ఝుళిపించేవాళ్ళూ, మిత్రులను పిలిచేవాళ్ళూ, యుద్ధానికి భయపడేవాళ్ళను నిరసించేవాళ్ళూ, వాహనాలను ఎక్కి అదిలిస్తున్నవాళ్ళూ అందరూ రాజద్వారం దగ్గర గుమిగూడారు.

ఆ సమయంలో అమరావతిలో ఏనుగులు గొలుసులు విప్పబడినా, హఠాత్తుగా మేల్కొనడం వల్ల కళ్ళు మండుతుంటే కదలకుండా నిలుచున్నాయి. మావటివాళ్ళు అంకుశంతో పొడిస్తే గానీ కదలటం లేదు. ఇక అశ్వాలు ఎగురుతూ, మొగ్గలు వేస్తూ, వాలిపోతూ, నేలపై పొర్లుతూ,

[48] మరుదధిపతి, మలినవర్త్ముడు… ఈ మకారశబ్దాల ప్రయోగం మూలంలోనిదే.

కావాలని మొండికేస్తూ కళ్ళాలనూ, జీనులనూ వెయ్యనివ్వటం లేదు. కల్పవృక్షపు మద్యాన్ని తాగిన ఒక అమరుడు ఇంద్రనీలమణులు తాపిన గువ్వగూటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని తనకు ప్రతివీరుడనుకొని కోపంగా చూసి, కొట్టగా, అతని చేతిలోని కత్తి రెండు ముక్కలైంది. ఆ వీరుడు మద్యం మత్తులో ఆ విరిగిన కత్తితోటే యుద్ధానికి బయలుదేరాడు. ఇంకొక దేవధానుష్కుడు అకారణంగా నారి తెగిపోయిన తన వింటిని వదిలిపెట్టకుండా పట్టుకొని దానినే ఇనుప గుదియలాగా విసురుతూ ఉత్సాహంతో రణరంగానికి వచ్చాడు. ఇంకొక వీరుడు వింటికి నారిని తొడగాలని ప్రయత్నించి, అది ఎంతకూ ఎక్కక పోవడంతో, విల్లును వదలి కత్తిని తీసుకుని యుద్ధానికి బయలుదేరాడు. ఒక దేవతాస్త్రీ తన భర్తను యుద్ధానికి పోకుండా ఆపాలనుకున్నది. తామరలలాంటి ఆమె చేతులకు అతను చిక్కటం లేదు. దుఃఖంతో ఆమె గొంతు బొంగురుపోయింది. యుద్ధానికి పోవద్దని స్పష్టంగా బిగ్గరగా చెప్పలేక, వాడి చూపులతో ఆమె వెంటబడి వస్తుంటే ఆ భర్త యుద్ధానికి బయలుదేరాడు. ఇంకొక దేవవీరుడు యుద్ధానికి వెళ్ళడానికి భార్య అనుమతిని పొందాడు. అంతకు ముందు అతనికి ప్రణయకలహం వల్ల భార్య కౌగిలి లభించలేదు. ఇప్పుడీ వంకతో ఆలింగనం చేసుకుని ఆనందంతో యుద్ధానికి బయలుదేరాడు. ఒక సురయోధుడు భార్యతో, “నన్ను యుద్ధానికి పంపు. ఆ గరుడుడి బంగారు రెక్కలను తెంపి నీకు కర్ణాభరణంగా తీసుకుని వస్తాను” అని తనకు అడ్డంగా నిలుచున్న దేవవనితను ఊరడించి, గొప్ప దండాన్ని చేత పట్టుకొని రణభూమికి వచ్చాడు.

మనోవేగంతో పరువెత్తే అశ్వాలను పూన్చి, మాతలి సారథిగా, నల్లమబ్బు జెండాతో ఉన్న రథం మీద కవచధారియై యుద్ధాభిలాషతో వచ్చాడు ఇంద్రుడు. ఆయన ధరించిన కవచం పూర్వం పులోముడు, వృత్రాసురుడు, బలాసురుడు మొదలైన రాక్షసవీరుల వాడి బాణాలను అడ్డుకున్న ఖ్యాతిగలది. తన వేగాన్ని ఆపాలని ప్రయత్నించే గాలిని పూర్తిగా తాగి వేయడానికి సర్పాన్ని నియమించుకొన్నదా అన్నట్లు ఇంద్రుడి అశ్వమైన ఉచ్చైశ్రవం దాని కాలికి సర్పాకార కడియాన్ని ధరించింది. దాని మెడలోని పట్టెడ తన దేవమణి అనే సుడికి కావలిగా కట్టిన ప్రహరీ గోడ వలె ఉన్నది. దాని వీపుపై కప్పిన వస్త్రం రెండువైపులా జీరాడుతూ గరుడుణ్ణి ఎదుర్కోవడానికి కట్టుకున్న వెండి రెక్కలలా అనిపిస్తున్నది. కళ్ళెం లాగినప్పుడు అది విడిచే నిట్టూర్పులు పారిజాతవృక్షాన్ని అపహరించడం వల్ల కలిగిన రోషంతో వచ్చిన ఊర్పులలా ఉన్నాయి. దాని గిట్టల కింద నలిగిన బంగారు నేల ధూళి అంతటా వ్యాపించి సంధ్యాసమయంలోని ఎర్రని చంద్రకాంతిలా పరచుకుంది. శ్రేష్ఠుడైన అశ్వికుడు రేవంతుడు తన ప్రభువైన ఇంద్రుడి ముందు ఇటువంటి దివ్యమైన ఉచ్చైశ్రవాన్ని తెచ్చి నిలబెట్టాడు.

ఎంతో పెద్దగా ఉన్న నాలుగు దంతాలు స్తంభాలుగా, మదజలం కారుతూ చిత్రవిచిత్రమైన రంగులలో ఉన్న చెక్కిళ్ళు గోడలుగా, ఉద్దండమైన పతాకముతో యుద్ధలక్ష్మి అంతఃపురపు మేడలాగా వచ్చింది దేవేంద్రుడి ఏనుగు అయిన ఐరావతము.

ఇక అగ్నిదేవుడు తన ఏడు చేతులలోనూ తోమరము, శక్తి, చాపము, శస్త్రి (చురకత్తి), డమరు, స్రువము, వ్యజనము అనే దివ్యమైన ఆయుధాలను ధరించి, ద్విగుణీకృతతేజంతో, భయంకరరూపంతో పొట్టేలు వాహనాన్ని ఎక్కి వచ్చాడు. కాలదండము నుండి పుట్టిన నిప్పు రవ్వలకు తోడుగా కోపరసము చిందుతున్న కన్నుల కాంతులు మేఘాలలో దాగిన మెరుపులను ధిక్కరిస్తుండగా యముడు మహిషవాహనమెక్కి ఔద్ధత్యంతో యుద్ధానికి బయలుదేరాడు. కామరూపులూ, యుద్ధవీరులూ అయిన రాక్షసులు వెంట రాగా, మాంసాహారి అయిన నిర్మతి, కుముదమనే ఏనుగు ముందు నడుస్తుండగా, కత్తి యొక్క కాంతులు విజృంభిస్తూ ఉండగా తన వాహనమైన నరుడి భుజాలపై కూర్చుని వచ్చాడు. సముద్రాధిపతి వరుణదేవుడు జలచరాలైన మొసళ్ళు, తాబేళ్ళు, ఎండ్రకాయలు మొదలైనవాటి ముఖాలను కలిగిన భయంకరులైన దానవ-సేవకులు కొలుస్తుంటే పాశాన్ని ధరించి రాజహంసనెక్కి రణభూమికి వచ్చాడు. వాయువు తన లేడి వాహనంపై నెక్కి వచ్చాడు. అతని శరీరం నుంచి వచ్చే సుగంధం సైనికుల శ్రమను పోగొడుతున్నది. అతను గదను తిప్పుతుంటే ఎగజిమ్మబడిన మేఘాలు దిగ్గజాలకు తగిలి చామరాలలా కనిపిస్తున్నాయి.

కుబేరుడు తన పుత్రులైన నలకూబరమణికంఠులు సైన్యాలను నడిపిస్తుండగా తళతళమని మెరిసే కత్తిని పట్టుకొని గుఱ్ఱమెక్కి ఇంద్రుడి పక్కనే నడిపాడు. దిక్పాలకుడైన ఈశానుడు నందినెక్కి ప్రమథగుణాలతో కూడి యుద్ధోత్సాహంతో పదునైన త్రిశులాన్ని ధరించి రణరంగానికి

వచ్చాడు. స్వర్గలోకంలోని ప్రజలందరూ ఆయుధాలను ధరించి వీరనమస్కారాలు చేస్తూ, “ఓ ఇంద్రా! నేను, నేను” అంటూ పక్కన జేరి కొలుస్తూ వస్తున్నారు. “శ్రీకృష్ణుడు ఎందుకు ఇలా చేశాడు!?” అని దిక్పాలకులతో మళ్ళీ మళ్ళీ చర్చిస్తూ ఇంద్రుడు శ్రీకృష్ణుణ్ణి గెలవాలనే ఆశ ప్రమాదకరమని అనుకోకుండా యుద్ధానికి బయలుదేరాడు. అతని వెంట మరుత్తులు, వసువులు, విశ్వులు, రుద్రులు, భాస్వరులు, తుషితులు మొదలైన దేవగణాలు ముప్పైమూడు కోట్లు యుద్ధరంగానికి గర్వంతో వచ్చారు. చిత్రసేనాది గంధర్వులు గుఱ్ఱపు స్వారిలో తమకు సాటివారు లేరన్న గర్వంతో, శరీరాలను పూర్తిగా కప్పిన కవచాలతో, చురకత్తులను, ఖడ్గాలను ధరించి గర్వపు మాటలాడుతూ నగరం బయట ఇంద్రుడికి తోడుగా నడిచారు. కోట్ల సంఖ్యలో నడుస్తున్న దేవగణాల ధాటికి మేరుపర్వతం కంపిస్తున్నది. అప్పుడా బంగరు కొండమీద నుండి లేచిన ధూళి, తెల్ల గొడుగులు లెక్కలేనన్ని ఆపుతున్నా కూడా, దిక్కులను కప్పి వేసింది. అంతగా కదిలి పోయింది ఆ మేరుపర్వతం.

ఆ అమరసైన్యపు ఆయుధాల కొసలు ఒకదానికొకటి తగిలి వాటి-నుండి పుట్టిన ఘణ ఘణ ధ్వనులు పెద్ద కోలాహలాన్ని రేపినాయి. ఇంద్రుడి సైన్యం శివజటాజూటనిర్గతగంగానదీప్రవాహంలా నగర-ద్వారంనుండి బయటకు నడచింది.

పంచమాశ్వాసము

యుద్ధం

అలా వచ్చిన దేవసైన్యాలు కృష్ణుడిని ఎదుర్కొన్నాయి. “పారిజాత-వృక్షాన్ని దొంగిలించినవాడా! శ్రీకృష్ణా! ఆగు. ఇదుగో మేం వచ్చేశాం. ఇంకెక్కడికి పోతావు?” అనే బెదిరింపులు అంతటా నిండాయి. దిక్కులలో అగ్నిబాణాలు, సింహనాదాలు ఒక్కసారిగా వ్యాపించినాయి. అక్కడి పరిస్థితి మాటలకందడంలేదు. అప్పుడు పద్మనేత్ర అయిన సత్యభామను, కల్పవృక్షాన్ని క్రిందికి దించాడు యదువీరుడైన శ్రీకృష్ణుడు. తొందర-పడుతున్న దేవసైన్యాలను చూసి చిరునవ్వు నవ్వాడు. కోపంతో కనుబొమలు ముడివేస్తూ, ఉడుము చర్మముతో చేసిన అంగుళీ-త్రాణముతోనున్న తన చేతితో తన శార్ఙ్గ ధనువుపైనున్న శేషుని కుబుసాన్ని తొలగించాడు. వింటినెక్కుపెట్టి ధనుష్టంకారం చేశాడు. కొండల వంటి తన భుజాలపైన అమ్ముల పొదులను బిగించి కట్టుకున్నాడు. ఒక్కసారిగా సురసైన్యం పైన శరవర్షాన్ని కురిపించాడు. ఇంతకు ముందు శ్రీకృష్ణుని బాణాలు దేవతలను రక్షించడం కోసం రాక్షసులను వధించినాయి. అందువల్ల దేవతల నెత్తుటి రుచి ఆ బాణాలకు తెలియదు. ఇప్పుడా శరాలకు దేవతల నెత్తుటి రుచి కూడా తెలుస్తున్నది.

“ఇప్పటివరకు దేవతల మేలు కోరి రాక్షసులను చంపిన మేము ఇప్పుడీ దేవతలను ఖండించవలసి వచ్చిం”దని సిగ్గుపడుతున్నట్లుగా కఠోరమైన

శార్ఙ్గ ధనుస్సు నుండి వెలువడుతున్న బాణాలు శత్రువుల మర్మస్థానాలను చీల్చిన తరువాత యుద్ధభూమిలోకి దూరిపోతున్నాయి. దేవతలు ప్రయోగించే బాణాలు శ్రీకృష్ణుడి బాణాలకు తగిలి ముక్కలై గరుత్మంతుడి రెక్కల గాలికి ఎగిరి దూరంగా పడిపోతున్నాయి. అమృతపు వాసనతో పరవశించే గరుత్మంతుడి ముక్కు ఏనుగులను చీల్చి చెండాడుతున్నది. కృష్ణుడి బాణాలకంటే ముందే వెళ్ళి లక్ష్యాలను ఛేదిస్తున్నాడు గరుడుడు. భటుల మీద, గుఱ్ఱాల మీద, రథాల మీద అన్నివిధాలుగా గరుత్మంతుడే విరుచుకుపడుతున్నాడు. రథాల మీద ఎగురుతున్న జెండాలను గోళ్ళతో చింపి పడేస్తున్నాడు.

అప్పుడు అంతటా వ్యాపించిన కృష్ణుడి శరపరంపరలనే వర్షపు రాపిడి చేత సూర్యుణ్ణి మేఘాలు కప్పినట్లయి ఆ దినం దుర్దినమైంది [49]. ద్వాదశాదిత్యులు కూడా శ్రీకృష్ణుణ్ణి ఎదిరించి తేజస్సును కోల్పోయారు.

చుక్కలనే రాణులయొక్క వక్షోజాల రాపిడి చేత కఠినమైన చంద్రుడి వక్షస్థలం శ్రీకృష్ణుడి బాణాలచేత చీల్చబడగా కారుతున్న నెత్తుటిలో మునిగితేలుతూ చంద్రుడు - ఉదయంతో నిమిత్తం లేకుండానే - ఎర్రబడ్డాడు. (సాధారణంగా చంద్రోదయసమయంలో చంద్రబింబం ఎర్రగా ఉంటుంది. ఈ యుద్ధంలో కృష్ణుడి బాణాల కారణంగా ఎర్రబడింది.)

[49] దుర్దినము = పగటిపూట మేఘములు కమ్మిన దినము (మేఘచ్ఛన్నేఽహ్ని దుర్దినమ్ – అమరకోశం)

భవరోగవైద్యుడైన శ్రీకృష్ణుణ్ణి సమీపించినంత మాత్రాననే కుబేరుడు అపగతగదుడైనాడు (రోగము నశించినవాడు అని వైద్యపరమైన అర్థము; గదను జారవిడిచినవాడు అని యుద్ధపరమైన అర్థము). ఏకాదశరుద్రులూ నిర్ముక్తశూలులయ్యారు (శూల రోగము నశించినవారు అని వైద్యపరమైన అర్థము; శూలమనే ఆయుధాన్ని వదిలిపెట్టినవారు యుద్ధపరమైన అర్థము)

రెండుచేతులతోనూ వెంటవెంట బాణాలను ప్రయోగిస్తున్నాడు, శ్రీకృష్ణుడు. ఆ బాణఘాతాలకు యముడి మహిషానికే కాదు యముడికి కూడా శృంగభంగం అయ్యింది (మహిషానికి కొమ్ములు విరిగాయి; యముడికి గర్వభంగమైంది). నిర్రృతి చేతి కత్తి చీలిపోగా, అతడి భుజము కోరలు పీకేసిన పాములా వ్యర్థమైపోయింది. అగ్నిదేవుడు తన కాంతిని కోల్పోయి నిశ్చేష్టుడైనాడు. భయంవల్ల తేలికై వాయుదేవుడు పారిపోయాడు. ఉదధినాయకుడవడం సముద్రుడికి ఉపకరించింది - వెళ్ళి తన ఇల్లైన సముద్రంలో దాక్కోగలిగాడు.

శ్రీకృష్ణుడి బాణాల దెబ్బలకు యక్షుల వక్షాలు గవాక్షాలయ్యాయి (చిల్లులు పడి, తెరచిన కిటికీలు అయ్యాయి). సుదర్శనచక్రధారలతో విద్యాధరుల ముక్కులు, చెవులు తెగిపోయినాయి. కౌమోదకీ-గదాఘాతాలకు సాధ్యుల తలలు పిండి పిండి అయినాయి. నందకఖడ్గము సిద్ధుల అవయవాలను ముక్కలు చేసింది. గరుడుడి రెక్కల దెబ్బల వల్ల తూలిపోయిన సురలు కవచాలతో పాటు ధైర్యాన్ని కూడా పోగొట్టుకున్నారు.

భయంతో ఏనుగులపైనుండి దిగి పారిపోయేవాళ్ళూ, మేరుపర్వత-శిఖరాల పైకి ఎగబాకేవాళ్ళూ, గుఱ్ఱాలతోనూ, సారథులతోనూ పొడి పొడైపోయిన రథాలవల్ల దాగేచోటు లేక ఏనుగుల పీనుగుల వెనుక దాక్కునేవాళ్ళూ, నరకబడిన కాళ్ళూ మెడలూ కలిగిన గుఱ్ఱాల శవాలను కౌగిలించుకుని, చచ్చినవాళ్ళలా ఊపిరి బిగబట్టి పడుకునేవాళ్ళూ, రణరంగం నుండి పారిపోయేవాళ్ళూ, అడ్డదిడ్డంగా పరుగులు తీసేవాళ్ళూ, రక్షించమని శరణువేడేవాళ్ళూ, జుట్టు చెదిరిపోయిన-వాళ్ళతో కూడిన దేవసైన్యంతో రణరంగం భీభత్సంగా ఉన్నది.

శ్రీకృష్ణుడి బాణాల ధాటికి ఇంద్రియజ్ఞానాన్ని కోల్పోయిన జయంతుడు, నలకూబరుడు మొదలైన వీరులకు బంగారు పద్మాల రేకులతో చేసిన దొన్నెలలో ఆకాశగంగాజలాలను తెచ్చి సేవకులు ఉపచారాలు చేస్తున్నారు. వాళ్ళను జాగ్రత్తగా వాహనాల పైకెక్కించి ఇళ్ళకు చేరుస్తున్నారు. నేలపై విరిగి పడిపోయిన ఛత్రాలను చూసి, వికసించిన పద్మాలనే భ్రాంతితో వాటికోసం అర్రులు చాస్తూ, తమ రౌతు అయిన వరుణుణ్ణి కిందికి తోసి పడేసి హంసలు నేలకు దిగుతున్నాయి. తలలు పగిలి మెదళ్ళు బయటకు వచ్చి రక్తంతో కలిసి బురదగా మారిన గుంటలలో పడి దొర్లాలనే కోరికతో ముందుకు నడవటానికి మొరాయిస్తున్న మహిషవాహనాన్ని వదలి యముడు పారిపోయాడు. అలా బుసలు కొడుతూ తిరుగుతున్న దున్నపోతు వల్లా, మూర్ఛపోయిన చంద్రుడి బింబం నుండి జారిన కొమ్ములతో బయటకు వచ్చిన జింకను చూసి దానిని ఆడ లేడి అనుకొని భ్రమించి దాని వెనుక పరుగుతీసిన

వాయుదేవుని వాహనం జింక వల్లా, గరుడుడి వాడి గోళ్ళచేతా ముక్కు కొనల చేతా చీల్చబడి ముక్కలైన ఏకాదశరుద్రుల శిరస్సులపైనున్న చంద్రరేఖలతోనూ, ఆ ముక్కలను చెవులకు అలంకారాలుగా పెట్టుకోవాలని ఎగబడుతున్న భేతాళకన్యలతోనూ, యుద్ధరంగం కోలాహలంగా ఉన్నది. అప్పుడు దేవేంద్రుడు యుద్ధరంగం నుండి పారిపోతున్న దిక్పాలకులను పారిపోవద్దని కోపంతో తిట్టి భయపెట్టి తన ధనుస్సును ఎక్కుపెట్టి పెకెత్తి పట్టుకొని తన సైన్యాన్ని తిరిగి రమ్మని పిలుస్తున్నాడు.

దేవేంద్రుడి సైన్యం పర్వతపాదాన్ని తాకి వెనక్కి తిరిగే నదిలా, దేవరాజు ఆజ్ఞతో తిరిగి వచ్చి శ్రీకృష్ణుణ్ణి చుట్టుముట్టి భయంకరంగా యుద్ధం చేస్తున్నది. టింగు టింగుమనే శబ్దంతో శ్రీకృష్ణుడి వింటి నుండి వెలువడే బాణాలు తన సారథిని బాధించి గుఱ్ఱాలనూ, తననూ నొప్పించి చలింపజేయగా దేవేంద్రుడు వెనక్కి తగ్గాడు. అప్పుడు కృష్ణుడికి ఇంద్రుడి సైన్యాలు అడ్డు పడినాయి. కృష్ణుడిని గెలువగలమా లేదా అనే అనుమానం పెట్టుకోకుండా, యుద్ధోత్సాహంతో తనను ఎదుర్కొన్న రథికులను, మదించిన ఏనుగులనే చీకట్లతో రాత్రిని తలపింపజేసే ఆ దేవసైన్యాన్ని శ్రీకృష్ణుడు తన కౌమోదకీగదతో, శార్ఙ్గమనే ధనుస్సు నుండి వెలువడే బాణాలతో, సుదర్శనచక్రధారలతో చావగొట్టి తరిమేశాడు. దేవ-సైన్యమంతా యుద్ధ రంగం నుండి పారిపోయింది. అప్పుడు ఇంద్రుడు సిగ్గు, కోపం ప్రకోపించగా తన ఐరావతాన్ని కృష్ణుడి పైకి పురిగొల్పాడు.

తిరిగి వచ్చిన ఇంద్రుణ్ణి చూసి కృష్ణుడు తన పక్కనే ఉన్న సత్యభామ మనోహరమైన ముఖాన్ని చూస్తూ వ్యంగ్యంగా నవ్వుతూ, “చూసావా సత్యా! తనకు యుద్ధంలో సహాయం చెయ్యడానికి వచ్చిన దిక్పాలకుల తలలు వాలిపోయాయి. తానూ ఒకసారి పారిపోయాడు. అయినా సరే, అప్సరసలు నవ్వి గేలి చేసారని, నా బాణాల ధాటిని లెక్క చెయ్యకుండా, సిగ్గు లేకుండా మళ్ళీ వచ్చాడీ ఇంద్రుడు”, అన్నాడు.

సత్యభామతో అలా అని కృష్ణుడు ఇంద్రుని వంక చూసి, “దేవేంద్రా! ఇదుగో కాచుకో! అంటూ ఇంద్రుడి భుజం మధ్యలో గుచ్చుకునేలా ఒక వాడి బాణాన్ని ప్రయోగించాడు. ఆ దెబ్బ తిని కూడా దేవేంద్రుడు చలించకుండా పద్నాలుగు బాణాలతో శ్రీకృష్ణుణ్ణి, ముప్పై రెండు బాణాలతో గరుత్మంతుణ్ణి కొట్టాడు.

ఇంతలో, మిగిలిన దిక్పాలకులు కూడా మత్తగజాలనెక్కి మళ్ళీ యుద్ధానికి వచ్చారు. అగ్ని, యముడు, నిర్ఋతి, వరుణ, వాయు, కుబేర, ఈశానులు వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది బాణాలు వేశారు. వాటన్నింటినీ శ్రీకృష్ణుడు తన శరాలతో తుత్తునియలు చేసి మహోగ్రమైన బాణాలను ప్రయోగించి అందరినీ తీవ్రంగా గాయపరచాడు.

కల్పవృక్షంపై మోహం గల తమ తమ ఇష్టభార్యల కోసం ఇంద్రుడు-ఉపేంద్రుడు రాక్షసుల ప్రాణాలను హరించే బాణాలను పరస్పరం ప్రయోగించుకుంటూ యుద్ధం చేశారు. మురాసురుణ్ణి చంపిన శ్రీకృష్ణుడూ, బలాసురుణ్ణి చంపిన ఇంద్రుడూ సమంగా పోరాడుతూ

ఒకరినొకరు బాణాలతో కప్పేస్తున్నారు. అలా ఇద్దరూ బాణాల నడుమ కప్పబడటం వల్ల వాళ్ళ యుద్ధాన్ని చూద్దామని వేడుకతో ప్రయత్నిస్తున్న సర్పజాతీ గరుడజాతి వారి కోరిక తీరకుండా పోయింది. ఆ బాణాల చివరన కట్టిన రెక్కలు వాటినుండి రగిలే నిప్పుల వల్ల కాలిపోతున్నాయి. అయినా అవి వాటి లక్ష్యాలవైపు దూసుకుని పోతూనే ఉన్నాయి. అది చూసి దేవతలు, సిద్ధులు, సాధ్యులు ఆశ్చర్యపడుతున్నారు.

వాళ్ళ బాణాలు ఆకాశంలో పందిరి వేసినట్లు దట్టంగా కమ్మి, ఒకదాని-కొకటి తగిలి భస్మమైపోతుంటే చూపరులకు ఆనందంగా ఉన్నది ఆ దృశ్యం. ఇంద్రుడు గరుత్మంతుడితో, "ఆనాడు నిన్ను వజ్రాయుధంతో కొట్టిన నన్ను మరచావా? నిలు, నిలు" అని పక్షిరాజును బాణాల గూటిలో కట్టిపడేశాడు. అప్పుడు శ్రీకృష్ణుడు కోపంతో నందకఖడ్గంతో ఆ అస్త్రాల గూటిని తుంచి, వెంటనే అనేకబాణాలను బలమైన తన పిడికిలితో సంధించి దేవేంద్రుడి భద్రగజము యొక్క కుంభస్థలాన్ని ముక్కలుగా చేశాడు. ఐరావతపు కుంభస్థలం పగిలి అందులోనుండి ముత్యాల వరుస హిమాచలశృంగాల మీద నుండి జారిపడే ఆకాశగంగాప్రవాహంలా నేలకు జారింది.

ఆ యుద్ధాన్ని చూస్తున్న సిద్ధులూ, సాధ్యులూ, చారణులు వీళ్ళు ఒకరికొకరు సాటి అని పొగిడారు. ఆ యుద్ధాన్ని చూసి దేవర్షి నారదుడు ఆనందంతో, యుద్ధపర్యవసానాన్ని ఊహిస్తూ తన చామరాన్ని వీస్తూ నాట్యం చేస్తున్నాడు.

దేవేంద్రుడు కోపంతో ఆగ్నేయ. వాయువ్య, సూర్య, బ్రహ్మాస్త్రాలను ప్రయోగిస్తే అవి వరుసగా శ్రీకృష్ణుడి తేజస్సులోనూ, నిట్టూర్పులలోనూ, కుడి కంటిలో, నాభిలోనూ లీనమైనాయి. పాశుపతాన్ని వేస్తే అది శ్రీకృష్ణుడి అర్ధశరీరంలో కలిసిపోయింది. అఖిలాత్మకుడైన ఈశ్వరుడిని గెలవడం ఇంద్రుడి వల్ల అవుతుందా?

శ్రీకృష్ణుడు సమయం చూసి ఒక అర్ధచంద్రబాణంతో ఇంద్రుడి వింటినారిని త్రుంచాడు. వాడి బాణాలను ప్రయోగించి దేవేంద్రుడి వార్షికమేఘపతాకాన్ని ఒరిగిపోయేలా చేశాడు.

ఇంద్రుడు భృకుటి ముడివేసి, వికృతమైన ముఖంతో, లోపలి రోషాగ్ని-జ్వాలలు పైకి వచ్చాయా అన్నట్లుండిన ఎర్రబడిన వేయి కళ్ళతో, నారి తెగిన తన వింటిని విడిచిపెట్టాడు. పర్వతాల రెక్కలను నరికిన తన వజ్రాయుధాన్ని చేతబట్టి ఉగ్రత్వంతో నిండిన వేయి కళ్ళతో కౌస్తుభ-మణితో ప్రకాశించే శ్రీకృష్ణుడి వక్షస్థలాన్ని చూశాడు. అలా చూడగానే, తామరాకు మీద నీటి బొట్లవలె లోకాలన్నీ ఒక్కసారిగా కదలిపోయినాయి. “ఓ కృష్ణా! ఈ వజ్రాయుధం దెబ్బకు తట్టుకుంటే నువ్వు లోకైకవీరుడవే”, అంటూ దేవతలంతా హాహాకారాలు చేస్తుంటే, దేవేంద్రుడు భయంకరమైన తన వజ్రాయుధాన్ని శ్రీకృష్ణుడిపై ప్రయోగించాడు. ఆ వజ్రాయుధంనుండి వెలువడుతున్న అగ్నిజ్వాలలు ఆకాశాన్ని కప్పివేసినాయి. అది చేసే శబ్దంవల్ల దిగ్గజాలకు చెవుడొచ్చింది. ఆ వేగానికి చక్రవాళాది పర్వతాలు కదిలి, భూమండలం ఎగరగొట్టబడినట్లైంది. కిందపడిపోతున్న ద్వాదశాదిత్యుల తీక్ష్ణమైన కిరణాలకు సాటిగా

వజ్రాయుధం బయలుదేరింది. అది చూసి, తన అందమైన ముఖములో చిరునవ్వు చిందులు తొక్కుతుంటే శ్రీకృష్ణుడు గరుత్మంతుణ్ణి అడ్డంగా తిప్పి, వేగంగా, సూర్యకాంతివలె సహింపరాని ప్రకాశంతో తనను సమీపించిన ఆ వజ్రాయుధాన్ని క్రీగంటితో చూస్తూ నందకఖడ్గాన్ని పట్టుకోవడంవలన కాయలు కాచిన తన బలమైన చేతితో లీలాకమలాన్ని పట్టుకున్నట్లు పట్టుకున్నాడు.

శ్రీకృష్ణుడు తన పైకి వచ్చిన వజ్రాయుధాన్ని అలా పట్టుకోగానే, యుద్ధంలో తలలు పగిలిన విద్యాధరులు పారిపోయారు. దేవతలు నీరసించిపోయారు గంధర్వులు బండరాళ్ళపై పడ్డ వక్కలలాగా చెల్లాచెదరైనారు. గరుడులు మాయమైనారు. కిన్నెరులు కనిపించిన దారుల వెంటబడి పోయారు. నాగులు పటాపంచలైనారు. సిద్ధులు ఎటుపడితే అటు పారిపోయారు. దిక్పాలకులు దిగంతాలకు చేరారు. ఇక అప్పుడు మహర్షులు దేవరాజును రక్షించమని ప్రార్థించారు. తన ముఖ్యమైన ఆయుధాన్ని ఒడిసి పట్టుకున్న శ్రీకృష్ణుణ్ణి చూసి ఇంద్రుడు సిగ్గుతో, భయంతో ఐరావతాన్ని దిగి, “ఓ ముకుందా! నేను ఆపరాధం చేశాను,” అని వేగంగా వచ్చి సాష్టాంగనమస్కారం చేశాడు.

అప్పుడు శ్రీకృష్ణపరమాత్ముడు దయార్ద్రహృదయుడై, “దేవేంద్రా! లే. నీ తప్పేమీ లేదు. నీ మరదలైన సత్యభామ ఈ కల్పవృక్షం కావాలని కోరింది. అందువల్ల దీన్ని తీసుకుని పోవాలనుకున్నాను. ఇది నీ సొత్తు కాబట్టి నువ్వే తీసుకో” అని, వజ్రాయుధాన్ని ఇంద్రుడికి ఇచ్చి, కల్పవృక్షాన్ని కూడా ఇవ్వజూపాడు. అప్పుడు ఇంద్రుడు శ్రీకృష్ణుడికి మళ్ళీ నమస్కరించి,

సంతోషంగా, "శ్రీకృష్ణా! ఏది సొమ్ము? ('నా సొమ్ము' అనేందుకు) నేనెవడిని? నువ్వే కర్తవు. ఈ ప్రపంచంలోనివి అన్నీ నీవే. శూరవంశమునకు అలంకారమైనవాడా! నువ్వు ఈ భూమిపై ఉన్నంతకాలం అనితర-సాధ్యమైన ఈ పారిజాతవృక్షం నీ దగ్గరే ఉంటుంది" అని అన్నాడు. శ్రీకృష్ణుడు సంతోషంతో ఇంద్రుడి దగ్గర సెలవు తీసుకున్నాడు.

అలా ఇంద్రుణ్ణి వీడ్కొని కృష్ణుడు దేవ-గంధర్వ-సిద్ధ-సాధ్య-నాగులను దయగల చూపులు చూసి, దేవతాభూజమైన ఆ పారిజాతవృక్షాన్నీ, సత్య-భామను తన వాహనమైన గరుత్మంతుడి మూపుపైన అధిరోహింపజేసి, తన పరాక్రమంతో ప్రేయసి సత్యభామ కోరికను తీర్చడంలో కృతార్థుడై సంతోషంతో తిరుగుప్రయాణమైనాడు. ఇంద్రుడితో జరిగిన యుద్ధ-విశేషాలను ముచ్చటిస్తూ, పద్మంలాంటి ముఖంలో ఉల్లాసమూ, దరహాసమూ చిందుతుండగా కల్పవృక్షం ప్రసాదించిన ఆభరణాదులను ఇచ్చి వనితారత్నమైన సత్యభామను సంతోష పెడుతూ శేషశాయి అయిన శ్రీకృష్ణుడు శీఘ్రంగా మేరుపర్వతాన్ని దాటాడు. అలా ప్రయాణం చేసి వాళ్ళు రైవతకపర్వతం దగ్గరకు వచ్చారు.

శ్రీకృష్ణుని ద్వారకానగరప్రవేశం, పారిజాతప్రతిష్ఠ

అక్కడ యదు, వృష్ణి, భోజ, కుకురాంధకాది రాజప్రముఖులు సేనలతో ఎదురు వచ్చి స్వాగతించారు. పట్టణబహిర్ద్వారం దగ్గర పురస్త్రీలు సేసలు, ముత్యాల అక్షింతలు చల్లుతూ ఆహ్వానించగా, ఉప్పొంగిన మనసుతో శ్రీకృష్ణుడు నగర ప్రవేశం చేశాడు. శ్రీకృష్ణుడు నగరద్వారం దాటి

లోపలికి రాగానే, పారిజాతపుష్పసువాసనలు నగరమంతా వ్యాపించాయి. ఆ కల్పవృక్షాన్ని చూడగానే ద్వారకలోని దరిద్రుల గృహాలు ధనధాన్య-రాశులతో, విశాలమైన గజశాలలతో, అశ్వశాలలతో, మణిమయ-సౌధాలతో, గోవులు, మహిషములతో, వందలకొద్దీ భటులతో, మణి-భూషణాలతో నిండిపోయాయి. ఆ వృక్షం గాలి సోకగానే ముసలివాళ్ళ శరీరాలమీద ముడుతలు మాయమైపోయాయి. బలహీనమైన శరీరాలు శక్తితో ఉప్పొంగాయి. ఊడిపోయిన దంతాలు తిరిగి మొలిచాయి. కాళ్ళ వణుకు ఆగిపోయింది. గోళ్ళు నేవళంగా అయి, వెంట్రుకలు నల్లబడ్డాయి. వాళ్ళకు మళ్ళీ యౌవనోదయమైంది.

ఆ కల్పవృక్షపు పూల పరిమళాన్ని ఆఘ్రాణించటం వల్ల చెవిటివాళ్ళు వినగలుగుతున్నారు. గుడ్డివాళ్ళు చూడగలుగుతున్నారు. కుంటివాళ్ళు నడుస్తున్నారు. మూగవాళ్ళు మాట్లాడుతున్నారు.

మురారి తన భవనం ముందు గరుడుణ్ణి నిలిపి ముందు తాను దిగి తరువాత సత్యభామను దింపి నవ్వుతూ ఆనందంగా లోపలికి వెళ్ళాడు. భక్తితో దేవకీవసుదేవులకు నమస్కరించి, బలరాముడికి అభివాదం చేశాడు. గురువులు, బంధువులు, పెద్దలు, పురోహితుల పట్ల వినయం చూపి, మిత్రులను ఆలింగనం చేసుకుని కొడుకుల, తమ్ముళ్ళ, మంత్రుల నమస్కారాలను అందుకున్నాడు. ఆప్తవర్గాన్ని ఆదరించి, గరుడుణ్ణి సాగనంపి, శ్రీకృష్ణుడు తన ఇష్టసఖి సత్యభామతో కలిసి ఆమె మందిరానికి వెళ్ళాడు. అక్కడ ఆమెతో సరససంభాషణ చేస్తూ, "సత్యా! నా మాట నిలబెట్టుకున్నాను గదా! ఇదుగో పారిజాతవృక్షం" అన్నాడు. విని

సత్యభామ ఆనందించింది. ప్రాణనాథుణ్ణి అనేక విధాలుగా స్తుతించింది. తన మందిరపు ఉద్యానవనం మధ్యలో ఆ పారిజాతవృక్షాన్ని నాటించింది. రోజూ యథావిధిగా పూజిస్తున్నది. పదహారువేలమంది భార్యలు శ్రీకృష్ణ-సత్యభామల ప్రేమానురాగాలను గురించి ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. "భర్త అంటే శ్రీకృష్ణుడే. భార్య అంటే సత్యభామే. అనురాగం, దాంపత్యం అంటే వాళ్ళదే. కాకపోతే శ్రీకృష్ణుడు ఇంద్రుణ్ణి గెలిచి తన భార్య కోసం కల్పవృక్షాన్ని తెచ్చిస్తాడా?" అని పొగిడారు.

సత్యభామాదేవి ఉద్యానవనంలో ఉన్న ఆ పారిజాత వృక్షం ఒక్కొక్కసారి విశాలంగా పెరిగి పట్టణం అంతటికీ చల్లని నీడనిస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి చాలా చిన్నదిగా మారిపోయి చూసే వాళ్ళకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక సారి రకరకాల పూల వాసనలతో అందరికీ ఆనందాన్ని కలిగిస్తుంది. మరొకసారి బంగారు రంగుతో రత్నాలలా బాగా పండిన పండ్లతో కనుపిస్తుంది. కోరిన రూపాలను ధరిస్తూ, ఆ కల్పవృక్షం మనసులోని కోరికలన్నింటినీ తీరుస్తూ, అందరికీ ఆనందాశ్చర్యాలను కలిగిస్తూ ఉంటుంది.

నారదుని రాక, పుణ్యక వ్రతం

ఈ విధంగా కోరికలన్నీ తీరి ఆనందంగా ఉన్నటువంటివారూ, లోకులందరిచేత పొగడబడే గొప్పవాళ్ళూ, ఎప్పుడూ సుఖసంతోషాలతో తులదూగేవాళ్ళూ అయిన ఆ సత్యభామాకృష్ణులను చూడాలనే వేడుకతో, ఒకరోజు తన శరీరకాంతితో శరత్కాలమేఘాల తెల్లని కాంతిని ధిక్కరించే

నారదమహాముని అక్కడికి వచ్చాడు. సత్యభామాకృష్ణులు ఆయనకు స్వాగతం పలికి, ఉచితసత్కారాలు చేశారు. సుఖంగా కూర్చుని మాట్లాడుతూ, వికసితముఖారవిందుడైన నారదుడు సత్యభామను చూసి ఇలా అన్నాడు. "ఓ సత్యభామా! నీ అదృష్టాన్ని, ఐశ్వర్యాన్ని ఏమని పొగడను? దేవవృక్షమైన పారిజాతాన్ని నీ పెరటి చెట్టుగా చేసుకున్నావు. దానివల్ల నీ సవతులనే గాక ఇంద్రాణిని కూడా జయించినట్లయింది. ఐతే సాటిలేని నీ మహిమకు తగినట్లు నువ్వు పుణ్యకవ్రతాన్ని చెయ్యాలి. ఇంతకు ముందు ఈ వ్రతాన్ని అరుంధతి, పార్వతీదేవి, శచీదేవి శ్రద్ధగా చేశారు. ఇప్పుడు నువ్వా వ్రతం చెయ్యి. నేను నీకు ఆ వ్రతవిధానాన్ని పూర్తిగా చెప్తాను," అన్నాడు.

"తూర్పు తెల్లవారుతుండగా మౌనవ్రతం పూని, నదికి వెళ్ళి స్నానం చేసి, శుభ్రవస్త్రాలను ధరించాలి. నవరత్నాభరణాలను ధరించి, వంటికి చందనాది లేపనాలను అలదుకోవాలి. తలలో సువాసనలు వెదజల్లే పూలను తురుముకోవాలి. అత్తమామలకు, భర్తకు నమస్కరించి వారి అనుమతినీ, ఆశీస్సులను తీసుకోవాలి. తరువాత, ఓ సత్యభామా! నీకు ఇప్పటివరకూ ఉన్న కోపం, గర్వం, అసూయా, ఈర్ష్యలను వదిలిపెట్టి వినయం, సంతోషం నిండిన మనస్సుతో సవతులందరి ఇళ్ళకూ మొదటి రోజే స్వయంగా వెళ్ళి, వాళ్ళందరినీ వ్రతానికి రమ్మని ఆహ్వానించి, వెంట తీసుకుని రావాలి. ఆ పిమ్మట ప్రతిరోజూ పదివేలమంది ముత్తైదువులను పూజించి, శ్రేష్ఠమైన పచ్చ కర్పూరాన్ని, పరిమళద్రవ్యాలను, కొత్త వస్త్రాలను, స్వర్ణాభరణాలను ఇస్తూ, సంతోషంతో చైత్రశుద్ధనవమి మొదలు ఈ

వ్రతదీక్షను చేపట్టి నెలరోజుల పాటు నిర్వర్తించాలి. ఆ తరువాత వేద-విహితధర్మాన్ని ఆచరించేవాడూ, రూపసీ, విద్యావంతుడు, ఏ అంగ-వైకల్యం లేనివాడూ, శాస్త్రకోవిదుడూ, గొప్ప వంశంలో పుట్టినవాడూ ప్రశాంతహృదయం గలవాడూ, దయాశీలీ, బ్రహ్మజ్ఞానీ అయిన ఒక బ్రాహ్మణోత్తముణ్ణి ప్రార్థించి ఈ వ్రతానికి ఆచార్యుడిగా నియమించు-కోవాలి. అలా చేసి, ఆయనకు మదపుటేన్గులను, గుఱ్ఱాలను, స్త్రీలను, నవరత్నాలను, గోవులను, భూమిని, సేవకులను, ధనధాన్యాలను, నేయి, తేనె మొదలైన ద్రవ్యాలను, కర్పూరము, కస్తూరి, జవ్వాది, అగరు, పోకలు మొదలైన వాటి రాశులను కోట్లకొద్దీ దానం చేయాలి. అటువంటి వస్తువులను ఎన్నింటినో దక్షిణతో చేర్చి, కల్పవృక్షంతో సహా భర్తను సమంత్రకంగా ధారాదత్తం చెయ్యాలి. ఇంకా ఆ బ్రాహ్మణుడు ఏమేమి కోరితే అవన్నీ ఆనందంగా ఇచ్చి మళ్ళీ భర్తను అతని దగ్గర నుండి స్వీకరించాలి. ఇదీ వ్రతవిధానం. ఈ విధంగా ప్రసిద్ధమైన ఈ వ్రతాన్ని సంపూర్ణంగా చేస్తే, ధనకనకవస్తువాహనసంపత్తీ, పుత్రపౌత్రసమృద్ధీ కలిగి తనకూ తన భర్తకూ ఏవిధమైన అరమరికలు లేకుండా ఇతరులెవరికీ సాధ్యం కాని సుఖాలను పొందగలుగుతారు" అన్నాడు నారదమహర్షి.

ఇలా ప్రసిద్ధమైన పుణ్యకవ్రతవిధానాన్ని దేవర్షి విపులంగా, చక్కగా, అర్థమయ్యేలా చెప్పగానే సత్యభామాదేవికి ఆ వ్రతం చెయ్యాలనే కోరిక బలంగా కలిగింది. దానితో ఆమె పతియైన శ్రీకృష్ణుడి అనుమతి పొంది వ్రతారంభం చేసింది. యాదవులు, వృష్ణులు, కుకురాంధక భోజాదులు సత్యభామాకృష్ణులకు ఆప్తవర్గంలోనివారు. అలాగే సంబంధం కలుపుకొన్న

రుక్మిణీదేవి తండ్రి భీష్మకుడు మొదలైన పదహారువేల రాజకుటుంబాలు, కౌరవపాండవులు, పాంచాలదేశస్తులు, ఇంకా దగ్గర బంధువులు, నందాది గోపకులు, మిత్రవర్గపు రాజులు, వాళ్ళ బంధువులు, మిత్రులు ఇలా లోకంలో ఉన్న రాజులందరూ సకుటుంబసపరివారసమేతంగా సత్యభామ చేస్తున్న పుణ్యకవ్రతానికి వచ్చారు. ఇప్పుడు పుణ్యకవ్రతమనేది లోకానికే ఉత్సవంలా ఉన్నది. అటువంటి ఈ ఉత్సవానికి కొండలనుండి, నదులనుండి, సముద్రాలనుండి, అరణ్యాలనుండి, దిగంతాలనుండి ద్వీపాలనుండి, ఇంకా అనేక దూరప్రదేశాల నుండి సంభారాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరినాయి. వ్రతానికి వచ్చినవాళ్ళు కూడా అనేక వస్తుసముదాయాలను తీసుకుని వచ్చారు.

రాక్షసాంతకుడైన శ్రీకృష్ణుడి అజ్ఞతో దేవశిల్పి విశ్వకర్మ రైవతకపర్వతం వద్ద మణిమయమైన దానమంటపాన్ని నిర్మించాడు. ఆ పుణ్యకవ్రతం చాలా వింతలతో కూడుకున్నది. ఆకాశమంతా దేవతల విమానాలతో నిండిపోయింది. వచ్చిన రాజుల కిరీటమణికాంతులతో దిక్కులన్నీ వివిధ వర్ణకాంతులతో నిండిపోయినాయి. విచ్చేసిన మహర్షిపుంగవులతో భూమి అంతా నిండిపోయింది. వ్రతం చూడటానికి వచ్చిన జనసమూహం వల్ల భూమికి బరువెక్కువైంది. ఆ బరువును మోయలేక ఆదిశేషుని పడగలు వంగినాయి. ఆ ఉత్సవంలో మోగుతున్న వాద్యాల ఘోషతో బ్రహ్మాండ-మంతా నిండిపోయింది. సత్యభామాకృష్ణులు మంగళస్నానాలు చేసి శుభ్రవస్త్రాలను, అమూల్యాభరణాలను ధరించారు. హరిచందనాదులను శరీరాలకు అలదుకున్నారు. పెద్దలైన సభాసదుల అనుమతితో వ్రతదీక్షను

స్వీకరించారు. వ్రతవిధానాన్ని అనుసరించి దానమివ్వటానికి ఆ సభలో ఉన్న అందరి అంగీకారంతో శ్రీకృష్ణుడు నారదమహర్షికి నమస్కరించి అనుమతి వేడాడు. మదవతులు మణులు తాపిన బంగారు కలశాలను చేబూని సుగంధజలాలను పోస్తుంటే ఆ నీటితో దేవర్షికి స్నానం చేయించారు.

అలా స్నానం చేయించి ఆ దేవర్షికి తెల్లగా వెన్నెలలా ఉన్న వస్త్రద్వయాన్ని సమర్పించారు. కర్పూరం, కస్తూరి కలిపిన చందనాన్ని ఆయన వంటికి పూసి, పరిమళాలు వెదజల్లే పుష్పాలను ఆయన సిగలో ముడిచారు. రత్నాభరణాలతో ఆయనను అలంకరించి తగిన ఉపచారాలను చేసి సంతోషపెట్టారు. అలాగే ఆ వ్రతానికి ఋత్విజులయిన ధౌమ్యాది మహర్షులను కూడా పూజించారు. ఆ వ్రతం లోకాలన్నింటికీ ఉత్సవం.

ప్రద్యుమ్నుడు, సాత్యకి, అభిమన్యుడు మొదలైనవాళ్ళు వెంట రాగా ధర్మరాజాదులతో కలసి, శ్రీకృష్ణుడు భద్రగజాన్నెక్కి మంగళవాయిద్యాలు మోగుతుంటే దానమంటపానికి చేరాడు. అక్కడ సకలపదార్థాలను సమృద్ధిగా అమర్చిపెట్టారు. ద్రౌపది, సుభద్ర వెంటరాగా వ్రతాన్ని చూడ-వచ్చిన రాజుల భార్యలు సేవిస్తుండగా సత్యభామ మంచి ముత్యాల జాలరులతో అలంకరించబడిన పల్లకినెక్కి, వృద్ధసువాసినులు ముందు నడుస్తుంటే వ్రతం చేయవలెనన్న సంకల్పంతో వచ్చింది. పద్మదళాలవంటి విశాలమైన కళ్ళున్న సత్యభామ మునిపత్నులు తోడురాగా వెళ్ళి ఆనందంగా వ్రతమంటపంలోనికి ప్రవేశించి, కల్పవృక్షానికి ప్రదక్షిణము చేసింది. దేవర్షి నారదుడికి యథోచితపూజలు చేసింది.

సతులు పదారువేలమంది అనుసరించి రాగా, ముఖంలో తెచ్చి-పెట్టుకున్న సంతోషం స్పష్టంగా కనబడుతుంటే, శ్రీకృష్ణుడి పట్టపురాణి, లక్ష్మీదేవికి ప్రతినిధియైన రుక్మిణీదేవి, వ్రతానికి రాకపోతే బాగుండదని, పద్మరాగమణుల పల్లకినెక్కి వచ్చింది.

అక్కడ ఆ వ్రతంలో దానాలు చేయడానికి నిలిపిన వేలకొద్దీ గోవులు తమను విడిచి దూరంగా తిరుగుతిన్న దూడలను అంబారవాలతో పిలుస్తున్నాయి. బంగారం, వెండి, రాగి, కంచు మొదలైన లోహాలు, నవరత్నాలు, నవధాన్యాలు, బంగారు గొడుగులు, వింజామరలు, పరుపులు, మంచాలు, విసనకర్రలు, పాదుకలు మొదలైన ఉపకరణాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు మొదలైన వాహనాలు వేటికవే పర్వతాలవలె పేర్చబడ్డాయి. ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారుల సంభ్రమసంభాషణలతో, ఇంతకుముందు ఎన్నడూ ఎరుగని ఉత్సవాన్ని చూస్తున్నందున ఎంతో సంతోషిస్తూ ఉన్న దిక్పాలకుల పరస్పరసరస-సల్లాపాలతో, అనేకదేశాల నుండి వచ్చిన రాణులకు దారి చూపుతూ అందరినీ అదిలించే వేత్రహస్తులైన సేవకుల సందడితో, మునిశ్రేష్ఠులు పఠిస్తున్న వేదమంత్రాల ధ్వనులతో, ఆ ఉత్సవాన్ని చూడాలన్న ఉత్సాహంతో వచ్చి గగనతలంలో గుంపులు కట్టిన దేవతల స్తోత్రాలతో, డప్పు, భేరి, ఝుల్లరి మొదలైన వాద్యధ్వనులతో ఆ ప్రదేశం కోలాహలంగా ఉన్నది. ఆ కోలాహలం పౌర్ణమినాటి సముద్రఘోషను మించిపోయింది.

అప్పుడు నారదుడు సత్యభామతో, “అమ్మా! సరసిజదళాయతనేత్రా! సత్యభామా! ఈ పుణ్యకవ్రతవిధానంలో భర్తను నీటితో ధారపొయ్యాలి.

యదువంశతిలకుడైన శ్రీకృష్ణుణ్ణి ఒప్పించు," అని అన్నాడు. నారదుడి మాటలకు సత్యభామకు సిగ్గు, సంతోషం ముంచుకువచ్చినాయి.

సత్యభామ శ్రీకృష్ణుడి వంక ప్రేమతో చూస్తూ. "ఓ మధుకైటభమర్దనా! మునీంద్రుడి మాటలను విన్నావుగా?" అని అడిగింది. శ్రీకృష్ణుడు విని చిరునవ్వు నవ్వాడు. "నెలవంకవంటి నుదురు గల ఓ సత్యభామా! సందేహం ఎందుకు? శాస్త్రోక్తంగా ధారపోసి నన్ను దానం చెయ్యి." అన్నాడు. ఆ మాటలు విని అక్కడ ఉన్న శ్రీకృష్ణుడి ఇతర భార్యలందరూ ముఖాలు కిందికి దించుకున్నారు. వియ్యాలవారైన రాజులందరూ వ్యంగ్యంగా నవ్వారు. ఒక ఆడుదాని మాటలకు కట్టుబడి శ్రీకృష్ణుడు తనకు తానే పరాధీనుడు అవుతున్నాడన్న పరిహాసం ఏదో నర్మగర్భంగా ఆ నవ్వులలో ధ్వనించింది.

భయంతో చలిస్తున్న లేడికన్నులవంటి కన్నులున్న ఆ సత్యభామ నారదుడి అనుజ్ఞ పొంది, మన్మథుడి వలలా ఉన్న బంగారు వస్త్రంతో పూలదండను జతచేసి శ్రీకృష్ణుణ్ణి కల్పవృక్షానికి కట్టివేసింది. అప్పుడామె చేతుల రత్నకంకణాలు ఘణ ఘణమని మోగి మధురనాదాలు చేసినాయి. మునుల హృదయాలనే కట్టుకొయ్యలకైనా కృష్ణుడనే ఏనుగును కట్టి కుదురుగా ఉంచడం కుదరదు. అటువంటి శ్రీకృష్ణదేవుడు వికసితపద్మ-నేత్ర అయిన సత్యభామచేత కల్పవృక్షానికి పూలమాలచేత కట్టబడ్డాడు.

"దానవరాజు బలిని నువ్వు కట్టావట కద! ఇప్పుడు మా చెలి సత్యభామ ఈ పూలదండతో నిన్ను కట్టివేయటం మేం కళ్ళారా చూశాం. కృష్ణా! ఇక

నీ టక్కులు ప్రదర్శించకు'' అని సత్యభామ చెలికత్తెలు మేలమాడు-తుండగా, వాళ్ళను రెచ్చగొడుతున్నట్లు ధర్మజ భీమార్జునులు నవ్వారు.

సుముహూర్తసమయానికి గర్గమహాముని మహాసంకల్పాన్ని చెప్పాడు. అప్పుడు దక్షిణతోపాటు కల్పవృక్షంతో సహా భర్తను నారద-మహర్షికి దానం చేస్తున్నానని చెప్పి సత్యభామ ఆనందంగా ధారాదత్తం చేసింది. అలా ధారపోసి, వ్రతంలో భాగంగానే ఆ సత్యభామ మణులూ, సువర్ణం, ధాన్యాలు, గోవులూ, గుఱ్ఱాలు, ఏనుగులను వేలకొద్దీ దానంచేసింది.

దానం స్వీకరించిన నారదమహర్షి చెట్టుకు పూలమాలతో చుట్టబడిన శ్రీకృష్ణుడి బంధాన్ని విప్పి, మెల్లగా నవ్వుతూ, "కృష్ణా! నిన్నిప్పుడు సత్యభామ నిజంగా నాకు దానమిచ్చింది. నాలుగు వేదాలలో స్తుతించబడిన శ్రీకృష్ణా! ఇకనుండి నువ్వు నాకు ఇష్టమైన పనులను చెయ్యి," అని అన్నాడు వేడుకగా ఆటపట్టిస్తూ.

నారదుడు కృష్ణుని చేత పనులు చేయించుకొనుట

''ఇదుగో అందుకో, మేళవించిన ఈ మహతీవీణను. జాగ్రత్త సుమా!'' అని కృష్ణుడి భుజాలపై పెట్టాడు. ''ఇందులో ఉన్నది గంగాజలమయ్యా, జాగ్రత్త, ఒలికిపోయేను," అంటూ తన మణి కమండలాన్ని కృష్ణుడి ఎడమచేతికిచ్చి పట్టుకోమన్నాడు. ''ఇది నేను జపం చేసుకునే అక్షమాల, జాగ్రత్త'' అని కుడిచేతిలో పెట్టాడు. ''ఇదుగో, ఇది శివుడిచ్చిన పులితోలు, భద్రంగా పట్టుకో.'' అని దాన్ని శ్రీకృష్ణుడి చంకలో పెట్టాడు. అటు

వెళ్ళమన్నాడు. మళ్ళీ ఇటు రమ్మన్నాడు. ఇలా కొంతసేపు పరిహాసానికి కృష్ణుడి చేత పనులు చేయించాడు.

వేదాలకు కట్టకడపటిభాగమైన ఉపనిషత్తులచేత వర్ణించబడినవాడూ, పుట్టుక లేనివాడూ, శాశ్వతుడూ, గుణాతీతుడూ, జ్ఞానస్వరూపుడూ, నాశము లేనివాడూ, పురుషోత్తముడూ అయిన శ్రీకృష్ణపరమాత్ముడికి ఏమాత్రం సంకోచించకుండా పనులు పురమాయిస్తున్న మునిశ్రేష్ఠుడైన నారదుడు ధన్యుడైనాడు. శ్రీకృష్ణుడు భక్తవశంవదుడు అనటంలో సందేహం లేదు కదా! ఇది జగద్విఖ్యాతం.

అప్పుడు బ్రహ్మ మానసపుత్రుడైన నారదుడు శ్రీకృష్ణుడి ప్రియపత్ని అయిన సత్యభామతో, "ఓ తరుణీమణీ! నీ భర్త అయిన శ్రీకృష్ణుణ్ణి స్వీకరించు, ఇస్తాను.'' అన్నాడు. దానికి ఆనందించిన సత్యభామ నారద మహర్షికి తన ఆభరణాలన్నింటినీ ఇచ్చి, శాస్త్రోక్తంగా తన భర్తను తిరిగి స్వీకరించింది. దేవతలా దృశ్యాన్ని చూసి పూలవానలు కురిపించారు. తరువాత ఆమె నారదుడికి, శ్రీకృష్ణదేవుడికి నమస్కరించింది. వినయంగా అందరినీ ఆహ్వానించి, పారిజాతపుష్పాలను బంగారు పళ్ళెంలో నింపి రుక్మిణీదేవి మొదలైన ఏడుగురు సవతులకూ, మిగిలిన పదహారువేల మంది భార్యలకు వాయనాలిచ్చింది.

నారదుడు శ్రీకృష్ణుని నుతించుట

మానవమాత్రులకు అగోచరమైన మహిమ గలవాడూ, సత్యభామ అనే చంద్రముఖికి భర్త అయినటువంటి శ్రీకృష్ణుడిని నారదుడు చతురములు, ప్రౌఢములు అయిన మాటలతో ఈ విధంగా కొనియాడాడు -

నాయశరగసారవిరయ-
తాయనజయసార సుభగ ధరధీ నియమా
మాయనిధీ రధగభసుర
సాయజనయ తాయరవిర సాగరశయనా!!

నీతినే బాణంగా పొందిన బలాన్ని గరుడుడి రెక్కల వేగంతో విస్తరింపజేసిన విజయసారంగలవాడా! లక్ష్మికి, శుభావహమైన విధికి నిధివంటివాడా! సర్వదేవాత్మకుడా! దుర్జనులను బాణాలతో శిక్షించి, ధర్మాన్ని నిలిపి అందరి మెప్పును పొందినవాడా! విస్తృతిచే సూర్యుణ్ణి ఆకర్షించినవాడా! సముద్రము శయ్యగా కలవాడా!

(పై పద్యము అనులోమవిలోమకందపద్యము. మొత్తం పద్యం ఒక Palindrome. చివరి అక్షరం నుంచి మొదటిదాకా చదివి చూడండి. ఇది అర్థభ్రమకము కూడా. మొదటి సగాన్ని తిప్పి చదివితే రెండవ సగము, రెండవ సగాన్ని తిప్పి చదివితే మొదటి సగమూ అవుతాయి.)

ధీర శయనీయ శరధీ
మారవిభానుమత మమత మను భావిరమా
సార సవన నవసరసా
దారద సమతార హార తామస దరదా!!


ధైర్యవంతుడా! సాగరశయనుడా! మన్మథుని వంటి శరీరకాంతి గలవాడా! మననము చేత కలిగే సంపదలను గలవాడా! యజ్ఞభోక్తా! పాదరసంలా మిక్కిలి తెల్లని ముత్యాల హారం కలవాడా! తామసులకు భయం కలిగించేవాడా!

(పై పద్యము పాదభ్రమకకందము. ప్రతి పాదమూ ఒక పాలింద్రోమ్.)

విదళితదైత్య రమాగృహ
పదసారసవినతదేవ పతగేశహయా
చిదమితచైత్యశమావహ
మదవారణ విమతభావమతపాశజయా!!

రాక్షససంహారా! లక్ష్మీనిలయుడా! దేవతల చేత నమస్కరించబడే పాదపద్మములు కలవాడా! అప్రమేయజ్ఞానస్వరూపుడా! గరుడవాహనా! శాంతి ప్రదాతా!


(ఈ పద్యంలో <u>గోమూత్రబంధం</u> అనే రచనావిశేషం కనిపిస్తుంది, ఒకటవ రెండవ పాదాలలో ప్రతి రెండవ అక్షరము, మూడవ నాలుగవ పాదాలలోని ప్రతి రెండవ అక్షరము ఒకటే. ఈ క్రింది బొమ్మను చూడండి.)



జలదవితాననీల ఖలసాలకులక్షతివారణేశ ని-
శ్చలమునివారపాల సురచారణయక్షనవానుకూల కుం-
డలివరహారలోల నరనారదతత్పర భూవిధేయ యు-
జ్వలమనునీతిశీలితవశంవద శక్రరమానికేతనా!!

నీలమేఘ వర్ణం కలవాడా! దుష్టులనే సాలవృక్షాలను నశింపజేసే గజేంద్రుడా! నిశ్చలులైన మహర్షులను రక్షించేవాడా! దేవ గుణాలకు మంచి చేసేవాడా! వాసుకిని కంఠహారముగా కల ఈశ్వరుడిపై ఆసక్తి కలవాడా! నరుడనే ఋషి యెడల, నారదమహర్షి యెడల ఆదరము గలవాడా! భూదేవికి విధేయుడా! మనుధర్మాచరణపరులకు వశంవదుడా! ఇంద్రుడి సంపదకు స్థానమైనవాడా!

(పై పద్యపు నడకను <u>నాగబంధము</u> అంటారు. పాము చుట్టలా ఉంటుంది కనుక. తల నుంచి తోకదాకా అక్షరాలను చదువుతూ పోవాలి. క్రింది బొమ్మను చూడండి.)



శ్రీవర వరవరహృత భవ-
భావన వనజాయతాక్ష పాలితవిబుధా
ధావితదనుభవ నియమిస-
భావనచతురా సముద్ధృతార్ణవవసుధా!!

శ్రీపతీ! వరప్రదాతవై భక్తుల సంసారదుఃఖాన్ని హరించేవాడా! కమలాలవంటి విశాలమైన నేత్రాలుగలవాడా! దేవతలను సంరక్షించినవాడా! రాక్షసులను తరిమినవాడా! మునులను రక్షించే సమర్థుడా! సముద్రంలో మునిగిన భూమిని రక్షించినవాడా!


(ఈ పద్యంలో ఛురికాబంధము అనే బంధము ఉన్నది. ఛురిక అంటే చురకత్తి. ఛురిక చిత్రంలో పద్యం ఎలా ఇముడుతుందో క్రింది చిత్రంలో చూడవచ్చు.)



చిత్రాకృత్యభినందితవ్రజమృగాక్షీమధ్యగా యక్షరా
మిత్రోష్ణద్యుతిదిగ్ధచక్ర జనివల్మీకబుుక్షపా కృష్ణభా
సత్రారాధ్య నుతింతు నిన్ను జగదీశా విక్రమాతిస్థిరా
రాత్రీనాంచితభామితాబ్జ సదయా రాధానుభావాకరా!!

చిత్రమైన ఆకారాలతో సంతోషపెట్టబడిన గోప వనితల మధ్య ఉండేవాడా! నాశం లేనివాడా! సూర్య కాంతిలా ప్రకాశించే సుదర్శన చక్రంగలవాడా! సంసారాన్ని నశింపజేసేవాడా! నల్లని కాంతిగలవాడా! యాగాలలో పూజింపబడేవాడా! పరాక్రమధీరుడా! చంద్రకాంతి వంటి తెల్లని శంఖం గలవాడా! దయాశీలీ! రాధాదేవి మహిమలకు స్థానమైనవాడా! నీకు నుతులు.

(పై పద్యం చక్రబంధములో వ్రాయబడి ఉన్నది. మొదటి మూడు పాదాలు చక్రపు అరెలలో, నాల్గవ పాదాన్ని చక్రపుటంచులో సర్దాడు కవి. అంచు నుంచి మూడవ వలయంలో 'కృష్ణరాయకృతి' అని ఆరవ వలయంలో 'నంది తింమకవి' అని కృతిభర్త, కృతికర్తల పేర్లను కూడా ఇమిడ్చాడు! పక్క పేజీలోని బొమ్మను చూడండి.)



మనమున ననుమానము నూ-
నను నీ నామమను మనుమననమును నేమ
మ్మున మాన నన్ను మన్నన
మను మను నానామునీనమానానూనా !!

మునిశ్రేష్ఠుల ప్రమాణాలను మించినవాడా! మనసులో ఏమాత్రం సందేహం పెట్టుకోకుండా, నీ నామమంత్రాన్ని ధ్యానం చేసే నియమాన్ని వదలకుండా ఉంటాను. ఏకాంతభక్తుడనైన నన్ను ప్రీతితో అనుగ్రహించు.

(పై పద్యము ద్వ్యక్షరికందము. ద్వి + అక్షరి - రెండక్షరాల పద్యం అని అర్థము. న, మ అనే అక్షరాల గుణింతాలే ఉన్నాయి ఈ పద్యంలో.)

అంకురితశ్రీసంగభు-
జాంకా హరిహయమణిమదహరతనువర్ణా
సంకటకృద్దైత్యాశయ
శంకాజననిజచరిత శయధృతశంఖా!

పంకజనాభా భంజిత-
పంకా పరమపురుష భవపరిభవనామా
శంకరభావా కిసలయ
సంకాశపదయుగ కలశశరనిధిశయనా!!

లక్ష్మితో కలిసి ఉండడం వలన ఏర్పడిన శుభరేఖలున్న భుజాలు గలవాడా! ఇంద్రనీలమణుల గర్వాన్ని పోగొట్టే శరీరకాంతి గలవాడా! కష్టాలను కలిగించే రాక్షసుల కోరికలకు సందేహం పుట్టించే వృత్తాంతము గలవాడా [50] ! చేతిలో శంఖాన్ని ధరించినవాడా! పద్మనాభా! భక్తుల పాపాలను పోగొట్టేవాడా! పురుషోత్తముడా! భవాన్ని పరాభవించేవాడా[51]! శంకరుడిని హృదయంలో నిలుపుకున్నవాడా[52]! లేచివుళ్ళలా ప్రకాశించే ఎర్రని పాదాలు గలవాడా! క్షీర సాగరశయనా!

(పై పద్యము <u>ద్వికందక్రౌంచపదము</u>. ఇందులో రెండు కంద పద్యాలు ఇమిడి ఉన్నాయి. విడిగా చదివితే కందాలు. కలిపి చదివితే క్రౌంచపదము.

[50] రాక్షసుల దర్పాన్ని అణిచే ప్రవర్తనగలవాడా!
[51] పుట్టుక లేనివాడా
[52] "శ్రేయస్సును కలిగించే భావాలుగలవాడా!" అని ఇంకొక అర్థము

ఇట్లా ఒక పద్యాన్ని మరొక పద్యంలో ఇమిడ్చి వ్రాస్తే దాన్ని గర్భకవిత్వం అంటారు.)

వాసుదేవా ఘనస్స్వచ్ఛకాంతీ రమా
వాస వంశస్స్వరవ్యక్తవేదక్రమా
రాసలాస్యప్రకారప్రవీణోద్యమా
వాసవాదిస్తుతవ్యక్తనామా నమః!!

వసుదేవుడి పుత్రుడా! మేఘం వంటి శుభ్రమైన కాంతిగలవాడా! లక్ష్మికి నివాసమైనవాడా! వేదపాఠమునకు తుల్యమైన వేణునాదం గలవాడా! రాసక్రీడా నైపుణ్యం గలవాడా! ఇంద్రాదులు స్తుతించే పేరుగలవాడా! నీకు నమస్కారం.

(పై పద్యము భుజంగప్రయాతగర్భస్రగ్విణి. ఇది కూడా గర్భకవిత్వవిన్యాసమే. అసలైతే ఈ పద్యం స్రగ్విణీవృత్తము. దీనిలోని చివరి 'నమః'ను 'నమో' అని మార్చి పద్యం మొదటికి చేరిస్తే అది భుజంగప్రయాతమవుతుంది.)

ఈ విధంగా చిత్రవిచిత్రగతులలో శ్రీకృష్ణుణ్ణి పొగిడి నారదుడు వెళ్ళిపోయాడు. గోపికామణులకు ప్రియుడైన శ్రీకృష్ణుడు తన మిత్రులతో కలిసి ద్వారకానగరానికి వెళ్ళాడు. వ్రతానికి వచ్చిన ధర్మజుడికీ, భోజ, ధృతరాష్ట్రాది రాజులకూ, బంధువులకూ కల్పవృక్షం ప్రసాదించిన దివ్యమైన వస్త్రాలను ఆభరణాలను కానుకలుగా ఇచ్చి పంపాడు.

ఉపసంహారము

శ్రీకృష్ణుడి ఉద్యానవనాలలో చెట్ల కొమ్మల చివుళ్ళనుండి నీటి బొట్లు జలజలా రాలుతున్నాయి. చల్లని గాలి లేత మొగ్గల వాసనలను నాలుగు దిక్కులలో వ్యాపింపజేస్తున్నది. ఆ తోటలలో...

అర విరిసిన తామర పువ్వుల రేకుల మధ్య ఉన్న తుమ్మెదల రెక్కల తాకిడికి జారి పడుతున్న తేనెతో కూడిన పరాగముతో సరస్సు పరిసరాలు బూడిదరంగులో ఉన్నాయి. ఆ పరిసరాలలో పొదరిండ్లు ఉన్నాయి. ఆ పొదరిండ్లలో...

మరకతములు, గోమేదికములు, పుష్యరాగములు, పగడములు, వజ్రములు, వైడూర్యములు, ముత్యములు, కెంపులు, ఇంద్ర నీలములు అనే నవరత్నాలు పొదిగిన క్రీడాపర్వతాలు ఉన్నాయి. వాటిలో గుహలు ఉన్నాయి. ఆ గుహలలో...

రుక్మిణి అనే నదికి రాజహంస...

సత్యభామ అనే ఆడు చిలుకకు విలాసపంజరం...

జాంబవతి అనే రాత్రికి చంద్రోదయము...

కాళింది అనే పద్మలతకు తుమ్మెద...

భద్ర అనే నెమలికి వర్షామేఘం...

సుదంత అనే మామిడి గున్నకు కోకిల...

మిత్రవింద అనే వనానికి చైత్రం...

లక్షణ అనే హారానికి నాయకమణి...

పదహారు వేల కామినులనే ఆడు ఏనుగులతో రమించాలనే కోరిక ఉన్న గజేంద్రమూ...

అయిన శ్రీకృష్ణుడు లోకాలన్నింటినీ రక్షిస్తూనే సుఖసముద్రంలో తేలియాడుతున్నాడు.

కవి స్వీయచరిత్ర

కౌశికగోత్రంలో జన్మించినవాడు, ఆపస్తంభసూత్రుడు, ఆరువేల నియోగుల ఇంట పుట్టినవాడు, నంది సింగనామాత్యుడు-తిమ్మాంబల పుత్రుడూ, సకలవిద్యాచతురుడు, మలయమారుతమనే కావ్యమును రచించిన ఘంట సింగయ కవీంద్రుడి మేనల్లుడు, కృష్ణరాయలకు ప్రీతి పాత్రుడై అతని అనుగ్రహాన్ని పొంది పల్లకీలను అగ్రహారాలను పొందిన వాడు ఐన తిమ్మయ - శివభక్తుడు, అఘోరశివుడి శిష్యుడు – పారిజాతాప-హరణమనే కావ్యాన్ని ఆంధ్రభాషలో ఆచంద్రార్కంగా రచించాడు.

కృష్ణరాయలను కావ్యాంతంలో కవి ఈ విధంగా కీర్తించాడు - "ఏకఛత్రాధిపత్యంగా సమస్త భూమిని పరిపాలించినవాడా! నరసింహరాజనే రేనికి తపఃఫలమా! తులాభారదానకళోన్నతుడా! జక్కవ కుచములు గల స్త్రీలకు మన్మథా! కీర్తి సంపదలు కలిగిన కర్ణాటాంధ్రదేశాధీశా! శత్రురాజులనే ఏనుగులకు సింహం వంటివాడా! భువనవిజయమనే సభలో నవరత్నాల కాంతులకు బాలసూర్యుడి వంటివాడా! శ్రీకృష్ణచరణకమలసేవాసక్తా! వీరభద్రగజపతి అనే పర్వతానికి ఇంద్రుడి వంటివాడా! శివధ్యానం వల్ల ఇంద్రవైభవాన్ని పొందినవాడా! కుబేరుడు, కర్ణుడు, మేఘమూ మొదలైన వాటిలా దానానికి ప్రసిద్ధమైన కరకమలాలు కలవాడా! విద్వద్గోష్ఠి అనే నాట్యానికి మణినిర్మితవేదిక వంటివాడా! ధార్మికతలో మనువుకు సమానమైనవాడా! దయాసముద్రుడా! మదించిన ఏనుగుల మద జలంలోమునిగి సుఖిస్తున్న

తుమ్మెదల ఝుంకారముతో నిండిన గొప్ప భవనాల శుభమైన మహా-సంపద గలవాడా!"

ఇది శ్రీమదుమామహేశ్వర వరప్రసాదం వల్ల లభించిన సారవంతమైన సారస్వతంచేత అభినంది అయిన నంది సింగనామాత్యుడి పుత్రుడు, కౌశిక గోత్రుడు, పవిత్రుడు, సుజనవిధేయుడు అయిన తిమ్మన రచించిన పారిజాతాపహరణం అనే ప్రబంధము.

కొసరుమాటలు

మనలో అనేకులకు పారిజాతాపహరణం గురించి ఈ పుస్తకం చదవడంకన్నా ముందే తెలిసి ఉంటుంది. సత్యభామ అలక ఘట్టమూ, కృష్ణుడి అనునయింపునూ తెలుగు వాచకపు పద్యభాగంలో పాఠంగా చదువుకొని, పువ్వు మార్కు పద్యాలను భట్టీ పట్టి పరీక్షలయ్యాక మరిచిపోయి ఉంటాము. శ్రీకృష్ణతులాభారం సినిమా చూసినప్పుడు కొంత "పునశ్చరణం" జరిగి ఉండి ఉంటుంది. ఇప్పుడు ఈ వచనానువాదం చదువుతున్నప్పుడు మీకు కొన్ని పాత విషయాలు గుర్తుకు వచ్చి ఉండాలి. ఆ పాత జ్ఞాపకాలను తడుముకొని, కొత్తగా తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు వెదుక్కుంటున్నప్పుడు నేను తెలుసుకున్నది మీతో పంచుకోవటం ఈ కొసరు మాటల ఉద్దేశం. ముందుగా, కవి గురించీ, కావ్యంలోని కథ గురించీ చెప్పాక, నా పఠనానుభవం గురించి వ్రాస్తాను.

కవి గురించి

ఒక మోస్తరుగా సాహిత్యంతో పరిచయం ఉన్నవాళ్ళ నంది తిమ్మన గురించి, ఆయన కావ్యం గురించి ఈ విధమైన అవగాహన ఉండి ఉంటుంది.

పదహారవ శతాబ్దపు ప్రథమపాదంలో విజయనగర-సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించాడు. అది తెలుగు చరిత్రలో ఒక బంగారు కాలము. రాయలవారు మహావీరుడే కాదు, గొప్ప కవీ, కళాపోషకుడు కూడా. ఆయన ఆస్థానంలో అష్టదిగ్గజాలనే కవులుండేవాళ్ళు. అల్లసాని పెద్దనా, నంది తిమ్మనా మొదలైనవాళ్ళు. నంది తిమ్మన అనే కవి కృష్ణదేవరాయల భార్య అయిన తిరుమలదేవితో అరణంగా వచ్చాడు.

పారిజాతకావ్యం గురించి ఒక కథ ఉన్నది – రాయలవారి భార్యలలో ఒకర్తె అయిన తిరుమలదేవి ఒకసారి నిద్రిస్తూ ఉండగా ఆమె కాళ్ళు పొరబాటున ఆయన తలకు తగిలాయి. ఆయనకు కోపం వచ్చి రాణితో మాట్లాడడం ఆమె అంతఃపురానికి వెళ్ళటము మానేసాడు. రాణిగారు తనకు ఆప్తుడైన నంది తిమ్మనతో మొరబెట్టుకోగా, ఆయన పారిజాతాపహరణం కావ్యం వ్రాసి అందులో సత్యభామ కృష్ణుడి తలను తన్నినప్పుడు కృష్ణుడు కోపగించకుండా సరసంగానే సత్యభామ అలక తీర్చిన ఘట్టాన్ని రాజుగారికి చెప్పి ఆయనకు తిరుమల దేవి మీద కోపాన్ని పోగొట్టాడు.

నంది తిమ్మనకు ముక్కు తిమ్మన అని ముద్దు పేరు ఉన్నది. 'నానాసూనవితానవాసనల్...' అనే చక్కని పద్యమొకటి ముక్కు మీద చెప్పినందుకు ఆయనకు ముక్కు తిమ్మన అనే

పేరు వచ్చింది. తిమ్మన కవిత్వం గురించి చెప్పుకునేప్పుడు 'ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు' అనే మాటా, 'ముక్కు తిమ్మన ముద్దుగా ఏడ్చాడు' అనే మాటా వినబడుతుంటాయి.

ఈ పాత తెలివిడిని తరచిచూసుకొని ముందరికి వెళదాము.

'కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలనే కవులున్నారా?', 'ఉంటే వాళ్ళెవరు?' అనే ప్రశ్నల పైన వాదవివాదాలు జరిగాయి. ఆరుద్ర తన సమగ్రాంధ్రసాహిత్యచరిత్రలో తొమ్మండుగురు పూర్వపరిశోధకులు తయారు చేసిన అష్టదిగ్గజకవుల పట్టికలను పొందుపరిచారు. ఆ తొమ్మిది పట్టికలలో సామాన్యంగా ఉన్న పేర్లు నాలుగు; వాటిలో నంది తిమ్మన పేరు ఒకటి[53].

నంది తిమ్మన తిరుమలదేవితో అరణంగా వచ్చిన కవి కాకపోవచ్చు కానీ ఆవిడకు సన్నిహితుడయి ఉండవచ్చు అని అన్నారు ఆరుద్ర. రాయలకూ తిమ్మనకూ చిన్ననాటి మైత్రి ఉండిఉండవచ్చుననీ అన్నారు. రాయవాచకం ఆధారంగా కృష్ణదేవరాయలు రాజైనప్పటి నుంచీ తిమ్మన తన కొలువులో ఉండేవాడని కూడా చెప్పారు[54].

[53] ఆరుద్ర గారి సమగ్రాంధ్రసాహిత్యం – 2వ సంపుటము (68వ పుట); మిగతా మూడు పేర్లు – అల్లసాని పెద్దన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు.

[54] అదే పుస్తకంలో 89వ పుట

'ముక్కు తిమ్మన' అనే పేరు రావడం గురించి –

నానాసూనవితానవాసనల నానందించు సారంగ మే–
లా నన్నొల్ల దఁటంచు గంధఫలి బల్కాకం దపం బంది యో–
షానాసాకృతిఁ దాల్చి సర్వసుమనస్సౌరభ్యసంవాసి యై
పూనెం బ్రేక్షణమాలికామధుకర పుంజంబు లిర్వంకలన్

(రకరకాల పువ్వుల సమూహాల వాసనలను ఆనందించే తుమ్మెద ఎందుకు నన్ను ఇష్టపడదు అని సంపెంగపూవు బాధపడీ పడీ ఆ వేడితో తపస్సు చేసి, కథానాయిక యొక్క ముక్కుగా మారి అన్ని పూవుల పరిమళాన్నీ ఆఘ్రాణిస్తున్నది. ఆ చక్కని ముక్కుకు ఇరువైపులా కాటుక చూపులు అనే తుమ్మెదలు ఎల్లవేళలా బరాబరులు చేస్తున్నాయట.)

ఈ పై పద్యం తిమ్మన వ్రాసింది కాదు. భట్టుమూర్తి (రామరాజ-భూషణుడు) వసుచరిత్రలో గిరికను వర్ణిస్తూ వ్రాసిన పద్యం ఇది. ఈ పద్యాన్ని తిమ్మన దగ్గర కొనుక్కున్నాడనే కథ ఒకటి ఉన్నది. అది నిరాధారము. నిజానికి ఈ పద్యము కాకతీయుల నాటి విద్యానాథుడి 'భృంగానవాప్తి ప్రతిపన్నఖేదా కృత్వాననే గన్ధఫలీ తపోఽలమ్ / తన్నాసికా భూదనుభూతగన్ధా స్వపార్శ్వనేత్రీకృతభృఙ్గసేవ్యా' శ్లోకానికి అను-సరణమట[55].

[55] బేతవోలు రామబ్రహ్మం గారి పద్యకవితాపరిచయంలో 'నంది తిమ్మన' వ్యాసం (295–296 పుటలు; పైన ఇచ్చిన తాత్పర్యం కూడా బేతవోలు వారి మాటలకు అనుసరణమే)

'ముక్కు తిమ్మన' గురించి చెప్పుకోవాల్సిన ముచ్చట మరొకటున్నది. గయలో దొరికిన కృష్ణదేవరాయల నాటి ఒక తెలుగు శిలాశాసనంలో పారిజాతాపహరణపు ద్వితీయాశ్వాసాంతపద్యాన్ని చెక్కారు. "యీ శాసనము ముక్కు తిమ్మయ వ్రాసెను." అని ఉన్నది ఆ శాసనంలో[56].

తిమ్మన కవిత్వానికి లక్షణప్రతిపాదకవాక్యంలా వినిపించే 'ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు' అని అన్నది 16వ శతాబ్దపు ఉత్తరార్ధానికి చెందిన కాకమాని మూర్తి కవి. 'పాంచాలీపరిణయం' అనే తన కావ్యపు అవతారికలోని శ్రీరంగనాథస్వామిచేత తన కవిత్వం గురించి గొప్పగా చెప్పించిన పద్యంలో ఒక పాదం ఇది[57].

"ముక్కు తిమ్మన ముద్దు ఏడుపు" అన్నదెవరో తెలియదు. 'అల్లసాని వాడు అలా అలా ఏడ్చాడు, ముక్కు తిమ్మన ముద్దు ముద్దుగా ఏడ్చాడు, భట్టుమూర్తి బావురుమని ఏడ్చాడు.' అనే ఆ మూడు వాక్యాలలో ఆ ముగ్గురు కవుల కథానాయికల "మూడేడుపుల ముచ్చట"ను[58] చక్కగా వర్ణించేసాడు.

[56] నేలటూరి వేంకటరమణయ్య గారి 'కృష్ణదేవరాయల గయ శాసనము' వ్యాసం (భారతి 1959, ఫిబ్రవరి సంచిక; ఆ తరువాత 1960 దాకా ఈ శాసనం గురించి భారతిలో చర్చ జరిగింది అని చెప్పారు ఆరుద్ర.)

[57] మొత్తం పద్యం – "అల్లసానివాని యల్లిక బిగి సొంపు / ముక్కు తిమ్మనార్యు ముద్దుఁ బలుకుఁ/పాండురంగసుకవి పద్యంబు హరువును / గాకమాని రాయ నీకె కలదు"

[58] తాపీ ధర్మారావుగారు తమ 'సాహిత్యమొర్మరాలు'లో ఈ శీర్షికతో ఒక చిన్న వ్యాసాన్ని వ్రాసారు.

సత్యభామను ముక్కు తిమ్మన ముద్దు ఏడుపు పద్యం ఇది –

ఈసున బుట్టి డెందమున హెచ్చిన శోక దవానలంబుచేఁ
గాసిలి యేడ్చె ప్రాణ విభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీ సఖమైన మోము పయి చేల చెఱంగిడి బాలపల్లవ
గ్రాస కషాయకంఠ కలకంఠ వధూ కల కాకలీ ధ్వనిన్

(అసూయలో పుట్టి, ఎదలో ఎక్కువైపోయిన దుఖమనే దావాగ్ని కారణంగా బాధపడుతూ ఆ కోమలి తన చంద్రముఖముపై చీర కొంగును ఉంచుకొని, లేతచిగుళ్ళను తిని గొంతు తీపెక్కిన కోకిల యొక్క సన్నని గొంతుతో ఏడ్చింది.)

మరి, రాయలవారింటి ప్రణయకలహం కథ మాటేమిటి? జనశ్రుతిలోని ఇలాంటి కథలకు ఆధారాలు దొరకవు..

కథ గురించి[59]

పారిజాతాపహరణం కథ భాగవతంలోని కేవలం మూడు శ్లోకాలలో (10:59:39–41) ఉన్నది. నరకాసురుడి వధానంతరము సత్యాసమేతుడైన కృష్ణుడు అమరావతికి వెళ్ళి దేవేంద్రుడి పూజలను అందుకొని, అదితికి తన కుండలాలను ఇచ్చేసి, తిరిగి బయలుదేరుతూ భార్యచేత ప్రేరితుడై

[59] ఈ వివరాల కోసం చన్నాప్రగడ తిరుపతిరావు గారి 'పారిజాతాపహరణము – జగన్నాథవిజయముతో తులనాత్మకానుశీలనము' అనే సిద్ధాంతగ్రంథంపై, భాగవత, హరివంశ, విష్ణుపురాణాలకు గీతా ప్రెస్ వారి హిందీ అనువాదాలపై ఆధారపడ్డాము.

కల్పవృక్షాన్ని పెకలించి గరుత్మంతుడిపై మోపి, ఇంద్రుడితో సహా దేవతలను ఓడించి నగరానికి తెచ్చి సత్యభామ ఉద్యానంలో స్థాపించడం – కట్టె–కొట్టె–తెచ్చె పద్ధతిలో ఉంటుంది. ఆ పైన ఒక అతిశయోక్తి అలంకారం, దేవతల కృతఘ్నత మీద వైశంపాయనుడి 'ధిక్' శ్లోకం. అంతే!

హరివంశపురాణంలో పారిజాతాపహరణానికి రెండు కథనాలు ఉన్నాయి.

వాటిల్లో తొలి కథ విష్ణుపర్వంలోని 64వ అధ్యాయంలో 50వ శ్లోకం నుంచి 69వ శ్లోకందాకా ఉంటుంది. ప్రాగ్జ్యోతిషం నుంచి బయల్దేరిన కృష్ణుడూ, సత్యభామా ఇంద్రుడి సత్కారాన్ని అందుకొని, ఇంద్రుడితో సహా వెళ్ళి దేవమాత అదితిని కలిసి కుండలాలను ఆమెకు ఇచ్చి ఆమె ఆశీర్వాదం పొందుతారు. సత్యభామాకృష్ణులు తిరిగి వెళ్ళేముందు నందనవనంలో విహరిస్తూ కల్పవృక్షాన్ని చూస్తారు.

కృష్ణుడు దేవతారక్షితమైన ఆ చెట్టును పెకలించి గరుడుడి మీద ఉంచాక, గరుడుడు మళ్ళీ వాయుమార్గాన్ని ఆరోహిస్తాడు. ఈ వృత్తాంతం విన్న దేవేంద్రుడు 'కృష్ణుడు నాకు ఎంతో ఉపకారం చేసాడు.' అని అంటూ కృష్ణుడి పనికి తన అనుమోదాన్ని తెలియజేస్తాడు. ఈ కథనంలో సత్యభామ కృష్ణుడి వెంట ఉంటుంది కానీ పారిజాతవృక్షాన్ని అపహరించడం ఆమె పాత్ర గురించి ప్రత్యక్షమైన సూచన ఈ కథలో లేదు.

హరివంశంలోని మలి కథకు వచ్చే ముందు ఒక చిన్న శాఖాచంక్రమణం –

విష్ణుపురాణంలోని పంచమాంశంలో ముప్ఫయ్యవ అధ్యాయంలో 'పారిజాతహరణమ్' ఘట్టం ఉన్నది. 31వ అధ్యాయంలోనికి కొద్దిగా పరచుకున్న ఆ కథ ఇలా ఉంటుంది:

వారుణఛత్రాన్ని, మణిపర్వతాన్ని గరుత్మంతుడి మీద ఉంచి సత్యభామాసమేతుడై కృష్ణుడు స్వర్గానికి వెళతాడు. దేవతలచేత పూజించబడి అదితిని దర్శించి ఆమె కుండలాలను ఇచ్చివేస్తాడు. అదితి 19 శ్లోకాలతో కృష్ణుణ్ణి స్తుతించగా కృష్ణుడు ఒక చిరునవ్వు నవ్వి దేవమాతను తమ యెడల ప్రసన్నతతో, వరదాయిని అయి ఉండాలని కోరుకుంటాడు. ఆ తరువాత శచీదేవి, ఇంద్రుడు సత్యాకృష్ణులను పూజిస్తారు. అయితే, సత్యభామ మానుషస్త్రీ కనుక శచీదేవి తనకు పారిజాతపుష్పాన్ని ఇవ్వదు. అటు పిమ్మట, సత్యాకృష్ణులు నందనాది ఉద్యానాలను విహరించడానికి వెళ్ళినప్పుడు పారిజాతవృక్షాన్ని చూస్తారు. 'ఈ పారిజాతవృక్షాన్ని మనతో తీసుకెళ్ళి నా తోటలో నాటుకుందాము. పారిజాతాలంకృతకేశపాశంతో నేను నా సవతుల మధ్య సుశోభితగా ఉండాలి' అని అంటూ సత్యభామ కృష్ణుడిని ప్రేరేపించగా, కృష్ణుడు పారిజాతాన్ని పెకలించి గరుత్మంతుడిపైకి ఎక్కిస్తాడు. వారించబోయిన వనపాలకులతో "ఇంద్రుడెవరు? శచి ఎవరు? పాల సముద్రంలో పుట్టిన పారిజాతము ఒక్క ఇంద్రుడి చెట్టే ఎందుకవుతుంది? ఇది అందరికీ చెందుతుంది." అని 'సోషలిజం' మాట్లాడి "నీ భర్తకు నీవు ప్రియమైన దానివైతే నీ భర్త నీకు వశ్యుడైతే, నా భర్తను పారిజాతాన్ని ఎత్తుకుపోకుండా నివారించమను." అని శచీదేవికి సవాల్–సందేశాన్ని పంపుతుంది.

వజ్రాయుధాన్ని ధరించి వచ్చిన ఇంద్రుడినీ, దిక్పాలకాది దేవతలను కృష్ణుడు పదిహేను శ్లోకాలలో వర్ణితమైన యుద్ధంలో ఓడిస్తాడు. పారిపోతున్న ఇంద్రుడిని సత్యభామ వారిస్తుంది. భర్త బలాన్ని చూసి గర్వించిన శచీదేవి తనకు సరిగా విలువ ఇవ్వని కారణంగా తానూ పంతము పట్టింది. తత్ఫలితమే ఈ యుద్ధమూ, దేవతల భంగపాటున్నూ అని చెప్పి. "మీ చెట్టును మీరే ఉంచుకొండి" అని ఇంద్రుడితో అంటుంది. "జగత్తుకు కర్త, భర్తా, హర్తా అయినవాడితో ఓడిపోవడం సిగ్గుపడాల్సిన విషయం కాదు." అని అంటూ ఇంద్రుడు ఓటమిని ఒప్పుకుంటాడు. కృష్ణుడు పారిజాతాన్ని అతడికి తిరిగి ఇవ్వబోతాడు. 'నీ జీవితకాలపర్యంతమూ ఈ చెట్టును ద్వారకలోనే ఉంచేసుకో' అని బలవంతం చేసి వాళ్ళను సాగనంపుతాడు ఇంద్రుడు.

హరివంశపు తొలికథలో లేని సత్యభామ పోటీకోరు, గర్వపోతు స్వభావము, అదితి స్తోత్రము, దేవతలతో యుద్ధము వంటి వివరాలు పైని విష్ణుపురాణకథలో కనబడతాయి.

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశపు ఉత్తరభాగంలోని చతుర్థాశ్వాసంలో వచ్చే పారిజాతాపహరణకథ చాలా క్లుప్తంగా – పై రెండు కథలకూ సమన్వయంలా ఉంటుంది. ఎఱ్ఱన కథనంలో సంస్కృతహరివంశంలోని తొలికథలోలాగా ఇంద్రుడు కృష్ణుడు చేసిన పనికి మదిలో "ఒడఁ-బడియున్" - ఎందుకో మరి - "మనసు పట్టలేక" విష్ణుపురాణకథలో వలె యుద్ధమూ చేస్తాడు. శచీదేవి మీద సత్య కినుక కథ ఇందులో ఉండదు. ఎఱ్ఱన చెప్పిన ఈ కథలో సంస్కృతపురాణకథలలో లేని ఒక విశేషం ఉన్నది

కృష్ణుడు ద్వారకకు వెళ్ళేలోపు ఇంద్రుడి పనుపున వెళ్ళిన విశ్వకర్మ ద్వారకలో "అక్కజంబుగ చెలువంబు"లొనరించుతాడు[60].

అన్నట్లు, నాచన సోమన రచించిన ఉత్తరహరివంశంలో పారిజాతాపహరణఘట్టము లేదు.

ఇక సంస్కృతహరివంశంలోని పారిజాతాపహరణపు మలికథని చూద్దాము. ఈ కథ ఆ గ్రంథంలో 65వ అధ్యాయం నుంచి 76వ అధ్యాయందాకా 728 శ్లోకాలలో విస్తరించి ఉంటుంది. ఆ కథాక్రమంబెట్టిదన...

ద్వారకకు సమీపంలో ఉన్న రైవతకాద్రి వద్ద రుక్మిణి ఉపవాసవ్రతపు ఉద్యాపన చేస్తున్నప్పుడు అక్కడికి వచ్చిన నారదుడు కృష్ణుడికి పారిజాతపుష్పాన్ని ఇవ్వగా కృష్ణుడు దానిని రుక్మిణికి ఇస్తాడు. ఆ వార్తనూ, నారదుడు తన అహంకారం గురించి ఆడిన మాటలనూ చెలికత్తెలు చెప్పగా విన్న సత్య అలిగి కోపగృహప్రవేశం చేస్తుంది. కృష్ణుడు అనునయించి పారిజాతవృక్షాన్నే తెచ్చి ఇస్తానని చెబుతాడు. ఆ వెంటనే, సత్యభామ ఇంటికి వచ్చిన నారదుడు, పారిజాతవృక్షం గురించి, అదితి వంటి పతివ్రతలు గతంలో చేసిన పుణ్యకవ్రతం గురించి సత్యాకృష్ణులకు వివరిస్తాడు. తన భార్యలూ పుణ్యకవ్రతం చేద్దామనుకుంటున్నారని అందుకని పారిజాతవృక్షాన్ని ద్వారకకు పంపమని కృష్ణుడు నారదుడితో ఇంద్రుడికి సందేశం పంపుతాడు. ఉపేంద్రుడయిన తనకు అన్నగారైన

60 https://te.wikisource.org/wiki//హరివంశము/ఉత్తరభాగము-ప్రథమాశ్వాసము

ఇంద్రుడి వద్ద గారాబం చేసే హక్కు ఉన్నదని గుర్తుకుచేయమంటాడు. ఇంద్రుడు ఆ చెట్టును ఇవ్వకపోతే, ఇంద్రుడి వక్షస్థలంపై తన గదతో ప్రహారం చేస్తానని ఒక చిన్న బెదిరింపును కూడా తన సందేశానికి జతచేస్తాడు. కథాప్రకారంగా దేవేంద్రుడు కృష్ణుడి ముచ్చట తీర్చేందుకు ఒప్పుకోడు. సాత్యకి, ప్రద్యుమ్నుడు వెంటరాగా కృష్ణుడు స్వర్గానికి వెళ్ళి పారిజాతాన్ని ఎత్తుకొని వస్తూండగా, ఇంద్రుడితో ఘోరయుద్ధం అవుతుంది. ఇంద్రుడికి తోడు అతని కుమారుడైన జయంతుడు, ప్రవరుడనే ఒక బ్రాహ్మణమిత్రుడు యుద్ధం చేస్తారు. ఐరావతమూ– గరుత్మంతుడూ కూడా యథాశక్తిగా యుద్ధంలో పాల్గొంటారు. చాలాసేపు ఆకాశంలో యుద్ధం జరిగాక, యుద్ధరంగము స్వర్గము నుంచి భూమి మీద ఉన్న పారియాత్రపర్వతానికి మారుతుంది. రాత్రవుతుండగా యుద్ధం ఆపేస్తారు. మర్నాడు మళ్ళీ యుద్ధం మొదలవుతుంది. లోకాలన్నీ అల్లకల్లోలమవుతుండగా, కశ్యపుడూ అదితీ ఆ యుద్ధాన్ని ఆపుతారు. అదితి పారిజాతవృక్షాన్ని కృష్ణుడికి ఇచ్చి పంపుతుంది. సత్యభామ పుణ్యకవ్రతం చేసి అందులో భాగంగా కృష్ణుడిని పారిజాతవృక్షానికి పూలమాలతో కట్టి నారదుడికి దానం చేస్తుంది. నారదుడు తనకు వశుడైన కృష్ణుడితో పరిహాసపూర్వకంగా ఆ పనీ ఈ పనీ చెబుతాడు. ఆ తరువాత సత్యభామ కపిలగోవును, తిలలు, సువర్ణంతో నిండిన కృష్ణాజినాన్ని నిష్క్రయంగా ఇచ్చి తన భర్తను మళ్ళీ దక్కించుకుంటుంది. ఏడాది పాటు, కృష్ణుడి మిగతా భార్యలూ పుణ్యకవ్రతం చేసుకున్నాక, కృష్ణుడు పారిజాతవృక్షాన్ని స్వర్గానికి చేరుస్తాడు.

చాలా వివరంగా ఉండే ఈ మలి కథలో ప్రధానకథకు సంబంధించని అంశాలు – శివుడి మాహాత్మ్యాన్ని ప్రతిపాదించే ఘట్టాలు, బిల్వోదకేశ్వర-క్షేత్రపురాణము వంటి కథా, పుణ్యకవ్రతం తరువాత నారదుడు రుక్మిణి మొదలైన వారికి జెప్పిన ఉమాదేవి అరుంధతికి చెప్పిన పుణ్యకాది వ్రతాల వివరణ వంటివి – అనేకం వస్తాయి. కథ మొదట్లో పారిజాతాపహరణం జరగనున్నది సత్యభామ అహంకారపు తృప్తి కోసం అన్నట్లుగా సూచించిన కథకుడు కాస్సేపట్లోనే ఆ విషయం మరచిపోతాడు. పుణ్యకవ్రతం కోసమే ఇంత కథా జరిగిందన్నట్లుగా చెప్పుకుపోతాడు[61]. భండార్కర్ ప్రాచ్యపరిశోధన సంస్థ వారి హరివంశపు సంశోధితపాఠంలో ఈ మలి కథను యావత్తూ ప్రక్షిప్తంగా పరిగణించి ప్రధానపాఠానికి పరిశిష్టాలలో (appendices) చేర్చారు.

మన తిమ్మన కవి హరివంశపు మలి కథనుంచి కొన్ని కథాంశాలను (కథారంభం, సత్య అలక, కృష్ణుడి అనునయింపు, పుణ్యకవ్రతం), విష్ణుపురాణం నుంచి మరి కొన్నింటినీ (అదితి స్తుతి, దేవతలతో యుద్ధము) స్వీకరించాడు. ఈ ఘట్టాలలోని కొన్ని పద్యాలు ఆ యా పురాణాలలోని శ్లోకాలను అనుసరించినప్పటికీ, మొత్తం మీద కవి తనదైన తోవలోనే నడిచాడు.

[61] Christopher Austin అనే పరిశోధకుడు 'The Fructification of the tale of a tree' అనే పరిశోధనాపత్రంలోని గమనింపులలో ఇది ఒకటి.

కృష్ణుడు సత్యభామ పాదాలకు మొక్కిన ఘట్టం పురాణాలలో లేదు కానీ తిమ్మన కన్నా పూర్వకాలం నాటిదే. సామాన్యశకపు నాలుగవ శతాబ్దంలో సర్వసేనుడు రచించిన హరివిజయం అనే మహారాష్ట్రీ ప్రాకృతకావ్యంలో ఈ ఘట్టం ఉండిందట[62]. 12–13 శతాబ్దుల నడిమి కాలంలో జీవించిన కవిరాజపండితుడు సంస్కృతంలో రచించిన 'పారిజాతాపహరణమ్'లో కూడా ఈ ఘట్టం ఉన్నది. ఈ కవిరాజపండితుడి కావ్యానికీ, తిమ్మన పారిజాతాపహరణానికీ వర్ణనల విషయంలో, కథాసంవిధానం విషయంలో ఇంకా చాలా పోలికలు ఉన్నాయట. ఈ విషయాన్ని చన్నాప్రగడ తిరుపతిరావుగారు తమ సిద్ధాంతగ్రంథంలో విపులంగా చర్చించారు[63].

'సత్య తన శిరస్సుకు మ్రొక్కెడు పతి శిరమును బాదమున తొలగద్రోయుట' అన్నది బహుశః తిమ్మన స్వీయకల్పన అయి ఉండవచ్చును.

సినిమాలో అంత ప్రధానంగా చూపించిన తులాభారఘట్టమూ, రుక్మిణి తులసీదళంతో కృష్ణుడిని తూచిన వైనమూ తిమ్మన కావ్యంలోనూ, పై కథలలోనూ లేదని గమనించి ఉంటారు. మరి ఎక్కడిదా

---

62 ఇప్పుడు ఈ కావ్యం అలభ్యం. ఆనందవర్ధనుడి, భోజుడి అలంకారశాస్త్రగ్రంథాలలో ఉట్టంకించబడిన కొన్ని శ్లోకాల ఆధారంగా వి.ఎమ్.కులకర్ణి అనే పరిశోధకుడు వ్రాసిన The Hari Vijaya of Sarvasena అనే పరిశోధనాపత్రంలో ఈ వివరం కనబడింది.

63 పారిజాతాపహరణము–జగన్నాథవిజయముతో తులనాత్మకానుశీలనము (అనుబంధములు – 14–19 పుటలు)

కథ? ఈ వృత్తాంతం, 18వ శతాబ్దంలో జీవించిన మరింగంటి వేంకటనరసింహాచార్యుల 'శ్రీకృష్ణతులాభారం' అనే (అముద్రిత) ద్విపద-కావ్యంలో మొదటిసారిగా వచ్చి ఉండవచ్చు[64].

నా పఠనానుభవం

పారిజాతాపహరణాన్ని ద్రాక్షపాకానికి ఉదాహరణగా పేర్కొంటారు. కానీ ఆ మాట నావంటి ఈ కాలపు సగటు పాఠకులకు వర్తించదు. కాంతారావుగారి ఈ వచనానువాదం ఒక మేరకు సహాయం చేస్తుంది. కథను సమగ్రంగా తెలుసుకునేందుకు, కల్పనలనూ, వర్ణనలనూ చదివి ఆనందించటం కావ్యాస్వాదనలో మొదటి మెట్టు అవుతుంది. వ్యాఖ్యానాల, నిఘంటువుల సహాయంతో మూలం చదువుతూ అందులోని భాష సొగసులను, పద్యగద్యరీతులలోని అందచందాలను తెలుసుకోవటం ఆ తరువాతి మెట్టు. అందుకు అవసరమైన ప్రేరణ నాకు ఈ అనువాదం నుంచి లభించింది. ఆ విధంగా, మూలాన్ని చదివినప్పుడు నా అనుభవానికందిన సంగతులను నాలుగయిదు తలకట్ల క్రింద మీతో పంచుకుంటాను.

[64] డా.,శ్రీరంగాచార్యుల సిద్ధాంతగ్రంథం ' మరింగంటి కవుల సాహిత్యసేవ' (పుటలు 199-203); https://magazine.telangana.gov.in/ శ్రీకృష్ణ-తులాభారము/

శబ్దము

చదవడం మొదలుపెట్టాక మొట్టమొదటగా నన్ను ఆకట్టుకున్నది చంద్రుడి మీది ప్రార్థనాపద్యం. రానున్న పద్యాలలో తీయదనం ఎక్కడ అతిశయించనున్నదో సూచించే పద్యం ఇది:

వలిమల యల్లువాఁడు తలవాఁక ధరించిన పూవుగుత్తి, వే
ల్పులగమి జీవగఱ్ఱ, యుడివోవని చల్వల టెంకి, వెన్నెల
ల్మొలచిన పాదు, పాల్కడలి ముద్దులపట్టి నృసింహ కృష్ణరా
యలఁ గరుణారసంబు నినుపారెడి చూపులఁ జూచుఁ గావుతన్

చాలా మటుకు అచ్చతెలుగు మాటలను వాడటం, ఎక్కడో తప్ప సంయుక్తాక్షరాలు లేకపోవడం వల్ల ఈ పద్యం శ్రవణసుభగత హెచ్చినట్లు నాకనిపించింది. పారిజాతాన్ని కొప్పున తురుముకున్న రుక్మిణిని వర్ణించిన ఈ క్రింది పద్యము ఇంకొక ఉదాహరణ –

మగమీల నగఁజాలు తెగఁ గీలుకొను వాలుఁ –
గనుఁగవ కొక వింత కాంతి యొదవె,
వలిజక్కవల పెక్కువలు దక్కవగ నిక్క –
చనుదోయి కొక వింతచాయ దోఁచె,
నెల తుమ్మెదల దిమ్ము వెలిఁజిమ్ము చెలువమ్ము –
గల వేణి కొక వింత నలుపు మీఱె,
నల చెందొవల విందు చెలువెందు వెద చిందు –
మొగమున కొక వింత జిగి దొలంకెఁ

జక్కఁదనమున కొౕక వింత చక్కఁదనము,
జవ్వనంబున కొౕక వింత జవ్వనంబు,
విభ్రమంబున కొౕక వింత విభ్రమంబు
గలిగె నద్దివ్య కుసుమంబు కతన సతికి

వచనంలో చదివినప్పుడు ఈ పద్యపు భావం తెలుస్తుంది కానీ సీసపద్యపు తూగు, ఉపయోగించిన పదాల తీయదనము, అనుప్రాసపు అందమూ బోధపడాల్సిందంటే మూలంలోని పద్యం చదవాల్సిందే కదా! ఈ సీసము క్రింది ఎత్తుగీతి ఒక అందమైన చిత్రానికి దిగువన దాని సొగసును ఎత్తిచూపే దీపంలా అమరింది. చక్కదనమూ, యవ్వనమూ, విభ్రమమూ – అవే పదాలను వింత అనే విశేషణంతో చేర్చి మళ్ళీ ప్రయోగించినప్పుడు అవి రెట్టింపు కన్నా ఎక్కువే అయినట్లు అనిపిస్తుంది.

“వీనుల విందు” విభాగంలో చెప్పదగ్గవి మరొౕక రెండున్నాయి:

మొదటిది - నందనవనంలో పూలు కోస్తున్న అప్సరసల ముచ్చటలు. ఈ సందర్భంలో రగడ ఛందస్సులను వాడటం సంప్రదాయమట. తిమ్మన వాడినది వృషభగతి రగడ.

మొదటి రగడ ఇలా ఉంటుంది:

కొమ్మ వేగిరమేటికే కొనగోర గోరఁట విరుల గిల్లుము
తమ్మి పూవుల మీఁద జలముల దార దారక యుండఁ జల్లుము

ఈ ఛందస్సుకు గల నియమాలను పాటిస్తూ, అదనంగా ప్రతి రెండు పాదాలకు ఆద్యంతప్రాసలు (కొమ్మ–తమ్మి. గిల్లుము–జల్లుము) సమకూర్చి, ప్రతి పాదంలో ఛేకానుప్రాసాన్ని ('గోర గోరట', 'దార దారక') పాటించారు తిమ్మన [65]. ఇప్పటి సినిమాల్లో విమానాశ్రయాల్లాంటి ప్రదేశాల్లో యాదృచ్ఛికంగా వినబడే నేపథ్యసంభాషణల్లాంటి [66] ఈ మాటల్లో పెద్దగా చెప్పుకోదగ్గ విషయం ఏమీ ఉండదు. వాక్యాల మధ్య పరస్పరసంబంధమూ వినబడదు. గట్టిగా చదువుకుంటూ పద్యపు నడకను ఆనందించడమే పాఠకుడి పని.

రెండవది, అదితి చదివిన గణసమకదండకము. విష్ణుపురాణంలో అదితిచేత 'సనాతనాత్మ', 'గుణాతీతుడు' వంటి అమూర్తవిశేషణాలతో పొగడబడ్డ విష్ణువు కన్నా, తెలుగు కావ్యంలో అదితి మాటల్లో లయాత్మకంగా రూపు దిద్దుకున్న కృష్ణుడే మనకు ఎంతో ఆత్మీయుడనిపిస్తాడు.

ఆద్యంతాలలో వచ్చే సంబోధనలు 'పద్యోతరంగిణ్యుదక్షాళితైణాంక-భృత్పాంసులక్లిష్టవేల్లజ్జటాజాల' వంటి సంబోధనల కోసం సుదీర్ఘ-సంస్కృతసమాసాలను వాడారు కవి. నడుమన వచ్చే కృష్ణలీలలు చిన్న చిన్న సంస్కృత-తెలుగు పదాల మేళవింపుతో రచించారు ("వెన్న వేమాఱు గొల్లాడఁగా గొల్ల యిల్లాండ్రు నందారవిందాస్యతో ఱట్టుగావించినన్

---

[65] ఈ వివరం నాగపూడి వారి పరిమళోల్లాసవ్యాఖ్యానంలో నుంచి.

[66] హర్షిత మ్రుత్తింటి కామత్, వెల్చేరు నారాయణరావు గారల 'Theft of a tree' లోని గమనింపు.

'నిక్కపుం బట్టివే!' యంచు నిన్ బట్టి చట్రోలితోఁ గట్టినన్ దిట్టవై కిట్టి పెన్నుద్ది మద్దుల్ వడం ద్రోచియున్ శైశవంబున్ విడంబింపవే!). ఆ దండకాన్ని గట్టిగా చదివటం మొదట చేయాల్సిన పని. అర్థం తెలుసుకునే ప్రయత్నం, ఆ తరువాత.

<u>దృశ్యము</u>

ఒకోసారి కవి వాడే పోలిక చాలా సరళంగా ఉండి కథాగమనంలో చక్కగా ఇమిడిపోతుంది. కృష్ణుడు సత్యభామ మందిరానికి వెళుతున్నప్పుడు అతడి మనఃస్థితిని వర్ణించిన తీరు ఇందుకు ఉదాహరణ. అతడి ధైర్యం రథానికి కట్టిన జెండాలా రెపరెపలాడుతున్నదట. అతడి ఆత్రము గుఱ్ఱపు వేగాన్ని మించిపోతున్నదట. మనస్సు రథచక్రము యొక్క ఇరుసులా తిరుగుతూ ఉండిందట.

మరి కొన్ని చోట్లలో వర్ణన వర్ణచిత్రంలా ఉంటుంది. 'అన విని వ్రేటువడ్డ యురగాంగనయుం బలె' పద్యంలో లాగా - 'వ్రేటువడ్డ యురగాంగన', 'నేయి వోయ భగ్గున దరిగొన్న భీషణహుతాశన కీల', సత్యభామ చెక్కిళ్ళ ఎరుపును హెచ్చింపజేసిన ఆమె కన్నెర్ర మన కళ్ళ ముందు కదలాడతాయి.

ద్వితీయాశ్వాసపు పద్యాలపై బేతవోలు రామబ్రహ్మంగారు గొప్ప వ్యాఖ్యను రచించారు. చాలా మటుకు, మనసుకు హత్తుకునే అనేకవర్ణనలలో కొన్ని చాలా ప్రౌఢంగా ఉంటాయి (బేతవోలువారు ఇలాంటి వర్ణనలకు ఉదాహరణలుగా మేరుపర్వతవర్ణనను, చంద్రాస్తమయవర్ణనను పేర్కొని వాటికి 'ముదురుపలుకులు' అని

సర్టిఫికెట్టు ఇచ్చారు.). ఈ ద్వితీయాశ్వాసంలో సరళసుందరంగా ఉన్న ఉన్న పద్యాలలో ఒకటి, మచ్చుకు –

కమలినీ జృంభికలకు దిక్కాంత లెల్ల
హస్తతాళంబు లొనరించి రనఁగఁ జెలఁగె
లలిత కాసార కూల కులాయ చలిత
శకున పక్షజ పటపట స్వనము లధిప.

(తామరలనే స్త్రీలు ఆవలిస్తుంటే దిక్కులనే కాంతలు వేస్తున్న చిటికలవలె ఉన్నాయట, చెరువు ఒడ్డున ఉన్న గూళ్ళలోని పక్షులు రెక్కలల్లాడిస్తున్న చప్పుళ్ళు!)

జీవితచిత్రణ

క్రీడావనాలు, జారిణులు, అభిసారికలు, తామరలు, భృంగాలు, పూదేనె కాలువలు, సూర్యోదయాలు, అస్తమయాలు, వెన్నెల... ఈ ప్రబంధ–టెంప్లేట్–ఆధారిత–కంటెంట్ కాకుండా ఆనాటి జీవితస్థితిగతుల గురించి ఈ కావ్యంలో ఏమైనా కనబడుతుందా అన్న ప్రశ్న ఒకటి వస్తుంది.

తక్కువే కానీ లేకపోలేదు,

సమయాన్ని సూచించే శంఖధ్వనులు, గడియారపు గంటలు, రాజభవనపు మొగసాలలో తొండాలూపుతూ నిలబడిన జాము కావలి ఏనుగులు, పురిటిళ్ళ గోడలపై అంటించిన గంధపు చట్టలు, ముట్టడి

ముగిసిన తరువాత డేరాలు తీసేసిన ఖాళీస్థలంలో సైనికుల చలిమంట ఎరుపు... ఇవన్నీ కవి విన్నవీ కన్నవే అయి ఉంటాయి కదా?

రాయల జైత్రయాత్రల సందర్భంలో విజయనగరవీథుల్లో తాను చూసిన సైనికకలకలాన్ని స్వర్గలోకపు సైన్యపు కలకలంగా అనువదించి ఉంటాడు కవి. మిన్నేటి ఒడ్డున ఆడుకుంటున్న ఐరావతపు తొండంనుంచి ఎగుస్తున్న ధూళి తుంపరతో వెన్నెలను ఉపమించవచ్చనే ఊహ తుంగభద్రాతీరంలో స్నానార్థం తీసుకువెళ్ళబడిన రాజుగారి ఏనుగులను చూసినప్పుడే తట్టి ఉంటుంది మన కవికి. చకోరముల బువ్వపుబంతి ఆనాటి కార్తికవనభోజనాలనుంచి టేక్–ఆఫ్ అయి ఉంటుందా?

వెండికొండకు ప్రయాణిస్తూ ఎండ వడకు కల్పవృక్షపు నీడన ఒదిగి తమ వెంట దారిబత్తెంగా తెచ్చుకొన్న కామధేనువు పెరుగును భూర్జపత్రపు పళ్ళెంలో తింటారు కదా. అది స్వర్గలోకవ్యవహారంలా ఉన్నదా అసలు?

కథ చివరలో వచ్చే పుణ్యకవ్రతపు కోలాహలం మన ఇళ్ళలో జరిగే శుభకార్యాల హడావుడిని గుర్తుకు చేయదూ?

తనపైన చాడీలు చెప్పకుండా ఉండేందుకు కృష్ణుడు సత్యభామ దాసీలకు లంచాలను ఇవ్వటమూ, ఆ విషయము సత్యభామ ఎరుకకు రావటమూ – సగటు మనుషుల వ్యవహారంలాగానే ఉన్నది కదా!

బహుభార్యత్వం ఉన్న సమాజంలో స్త్రీల అభద్రతాభావం రుక్మిణికి కృష్ణుడు పారిజాతపుష్పాన్ని ఇచ్చిన సందర్భంలో – జాంబవత్యాది

కృష్ణసతుల సర్దుబాటులో కనబడుతుంది. కృష్ణుడికోసం ఎదురు-చూస్తున్న సత్యభామ కుడి కన్ను అదిరినప్పుడు ఆమె మనస్సులో మెదిలిన శంకలోనూ కనబడుతుంది. మిగతా అందరు భార్యల కన్నా తానే అధికురాలిగా ఉండాలన్నా పంతమూ అదే చెబుతుంది[67].

చమక్కులు – చిన్నవీ, పెద్దవీ

భార్యను అమితంగా ప్రేమించటం అనే ప్రధానేతివృత్తానికి దిగువగీటు (underline) గీస్తున్నట్లున్న ముచ్చటలు ఒకటి, రెండు తగులుతాయి ఈ కావ్యంలో. శ్రీరమణగారి 'మిథునం' కథలో అప్పదాసులా ఇంద్రుడు శచీదేవికి నిత్యం వేణీసంహారం చేస్తాడట. ఉపేంద్రుడైన కృష్ణుడు తన అన్న కన్నా ఏడు ఆకులు ఎక్కువ చదువుకున్నవాడే కదా - 'ఏయేవేళల నేసరోజముఖి యేయే లీలలం గోరుఁ దా నాయా వేళల నాసరోజముఖి నాయా లీలలం' తేల్చేవాడట.

దేవతలకూ మనుషులకేనా ప్రేమలు? మధ్యాహ్నపు ఎండవేళ, "తెకతెక" కాగుతున్న తామర తేనెను రెక్కలతో చల్లార్చి తన కాంతకు తనివార తాగించిందట ఒక చక్రవాకము. ఎండలో వడలిన తన భార్యపైన తొండంతో నీళ్ళు చల్లి, తన చెవులనే విసనకర్రలతో చల్లని గాలి సోకేలా వీస్తూ ఉండిందట ఐరావతము.

---

67 కాత్యాయనీ విద్మహే 'ప్రాచీనసాహిత్యం మరో చూపు' పుస్తకంలోని 'పారిజాతాప-హరణము సత్యభామ అస్తిత్వ ఆరాటము' వ్యాసంలోని పరిశీలన ఆధారంగా.

నందనవనంలో కృష్ణుడిని అనుసరిస్తున్న అప్సరసలు నేల మీది పుప్పొడిలో ఏర్పడ్డ కృష్ణపాదాలను తొక్కకుండా వారగా నడిచారని కవి అన్నప్పుడు మన ఇళ్ళలో కృష్ణాష్టమి రోజున వేసుకునే కృష్ణపాదాలు గుర్తుకువచ్చాయి.

వైజయంతాన్ని కృష్ణుడి రాక కోసం సన్నద్ధం చేసినప్పుడు దిక్పాలకుల భార్యలు తలా ఒక పని చేస్తారు – మన ఇండ్లలో ఏదో పండగో పబ్బమో వచ్చినప్పుడు మన అత్తయ్యలు, పిన్నమ్మలు వచ్చి తలా ఒక చేయి వేసినట్లు. ఐతే ఈశానుడి (శివుడి) భార్య అయిన ఉమకు కవి ఏ పనీ అప్పజెప్పలేదు – లోకానికే పెద్ద ఇల్లాలు కదా ఆవిడ.

యుద్ధంలో దిక్పాలకుల భంగపాటును చాలా వివరంగా వర్ణించేందుకు కేటాయించిన పద్యాలలో ఈశానుడి భంగపాటు గురించి ఉండదు. పైగా, ఇంద్రుడు కృష్ణుడి మీదకు వదిలిన పాశుపతాన్ని కృష్ణుడి అర్ధదేహంలో లీనం చేయించి వారిద్దరి అద్వైతాన్ని సూచించాడు కవి[68].

దిక్పాలకుల, దిక్పాలకసతుల గురించి చెప్పాల్సి వచ్చిన ప్రతి సందర్భంలోనూ తూర్పు దిక్కుతో మొదలుపెట్టి ప్రదక్షిణక్రమంలో పేర్కొనటం చెప్పుకోదగ్గ ఒక చిన్న ముచ్చట.

[68] నాగపూడి వారి పరిమళోల్లాసవ్యాఖ్య (297వ పుట); దూశి వారి వ్యాఖ్యలో కూడా ఈ విషయం చెప్పారు.

"ఆన్–డ్యూటీ" అన్నదమ్ములు – అనూరుగరుత్మంతులు – తమ వేగాన్ని తగ్గించకుండానే పరస్పరాభివాదం చేసుకోవటం ఇంకో ముచ్చటైన దృశ్యం (కాంతారావుగారి మాటల్లో 'బాయే-దాహినే సెల్యూట్'!).

శాస్త్రోక్తంగా ఏదైనా దానం ఇచ్చినప్పుడు, 'తుభ్యమహం సంప్రదదే న మమ" అని అంటాము. కానీ సత్యభామకు తెలుసు – అది కేవలం లాంఛనప్రాయమైన దానమని. మళ్ళీ నారదుడు తన భర్తను తనకు ఇచ్చేస్తాడని. అందుకని 'న మమ' అనే మాటను గడుసుగా దాటేసి 'నమో నమః' తో సరిపెట్టింది[69].

అంతగా నచ్చనివి

పారిజాతపుష్పపు మహిమను రుక్మిణికి వివరిస్తున్నప్పుడు నారదుడు "ఈ పువ్వు 'నీవు నీ పతి రహస్యక్రీడ వర్తించువేళ లతాంతాయుధు సంగరంబునకు' ఉల్లాసం కల్పిస్తుంది, రతిశ్రమ వలన కలిగే చెమటను తొలగించే వీవనవలె పని చేస్తుంది." అని అంటాడు. ఆ బ్రహ్మచారి-కెందుకట వాళ్ళ ప్రైవేటు సమయాల ఊసు? అందునా, అంతకు పూర్వం కొన్ని పద్యాల ముందరే కదా "మీరిద్దరూ 'విష్ణువూ, లక్ష్మి అని నాకు తెలుసు." అని చెప్పాడు![70]

---

[69] 'Theft of a tree' పరిచయవ్యాసంలోని గమనింపు.

[70] నిజానికి ఈ పద్యానికి మూలము సంస్కృతహరివంశంలోనే ఉన్నదని చెప్పారు నాగపూడివారు పరిమళోల్లాసవ్యాఖ్య పీఠికలో.

సత్యభామ కోపగృహానికి వెళ్ళే సందర్భంలో కోపంతోబాటు శృంగారమూ ఉండటం ఎందుకో బోధపడలేదు. "చీఁకటింటికడఁ గంకటి పై జలదాంతచంద్రరేఖాసదృశాంగి"యై పొర్లటం సరే, ఆ కోపానికి "గాఢమనోజవిషాదవేదన" తోడవటము, ఆ "బిసరుహపత్రలోచనకుఁ బెల్లగు మోహము సంఘటి"ల్లడము అసందర్భమని అనిపించింది.

స్వర్గానికి విచ్చేసిన కృష్ణుడిని చూసేందుకు గుమిగూడిన దేవతాస్త్రీలను వర్ణించేప్పుడు కవి "కెమెరా చూపు" దేవతాస్త్రీలు చూస్తున్న కృష్ణుడి మీద కాకుండా కృష్ణుణ్ణి చూస్తున్న దేవతాస్త్రీల మీద ఫోకస్ అయి ఉంటుంది. జలక్రీడల సమయంలో కూడా అప్సరసల మీదే కవి కన్ను ఉంటుంది. "మగ చూపు"!

కొన్ని వర్ణనలలో చమత్కారం, కొత్తదనం ఉంటాయి వాటిల్లో క్రాఫ్ట్ ఎక్కువై ఆర్ట్ తక్కువైనట్లు అనిపించింది. "చరమాద్రిదావాగ్నిసంప్లుష్ట-సురసౌరభేయీకరీషైకపిండమనగ..." అంటూ మొదలయ్యే సుప్రసిద్ధ-పద్యం అందుకు ఒక ఉదాహరణ. అస్తమిస్తున్న చంద్రుడికి కాలి బూడిదైన పిడకతో పోలికా? కొత్తదనం సరే, మనోహరత్వం ఏది?

యుద్ధవర్ణనల సందర్భంలో బీభత్సపు ప్రస్తావన తప్పదు. ఆ బీభత్సంలో 'హాస్యం, శృంగారం ఒలికినప్పుడు కొంత అసందర్భంగా ఉన్నట్లు అనిపించింది.

ఇట్లా నచ్చని సందర్భాలు కొన్ని ఉన్నప్పటికీ, మొత్తం మీద కావ్యంలో నచ్చిన సంగతులే ఎక్కువ.

సెలవు తీసుకునే ముందు

ఇంకా చాలా చెప్పవచ్చును ఈ కావ్యం గురించి. మీరూ మూలం చదివితే, ఇంతకన్నా ఎక్కువే పట్టుకుంటారు. కాంతారావుగారి ఈ వచనానువాదపు ఉద్దిష్టప్రయోజనమూ అదే.

మన దైనందికజీవితపు రణగొణధ్వనులకు, సామాజికమాధ్యమాలు రేకెత్తించే అనవసరపుటుద్వేగాలకు దూరంగా, నియమితంగా ఏడాదికిన్ని రోజులనుకొని కొంతకాలం ఇలాంటి ప్రాచీన సాహిత్యాన్ని చదువుకోవడం ఒక సత్కాలక్షేపం. మనము చేసుకోదగ్గ ఒక మంచి అలవాటు. ఆ ప్రాచీనజీవితేతివృత్తాల, కవిసమయాల, భాషాప్రయోగాల. రచనా-సంవిధానాల నడుమ తెలియవచ్చే మన పూర్వీకుల జీవితాలను గురించి, వాళ్ళు పట్టించుకున్న విషయాల గురించి మనకి ఎంతో కొంత అవగాహన కలుగుతుంది. వాళ్ళు పట్టించుకోకుండా వదిలేసిన వాటి గురించి కూడా ఊహ మెదులుతుంది. మన సంవేదన ఇంకొంత పదునవుతుంది. మన ఆలోచన మరింత విశాలమవుతుంది. మనల్ని మంచి విలువలు కల జీవితానికి మళ్ళించటమే కదా సాహిత్యం నెరవేర్చాల్సిన ప్రయోజనం.

\- ఉరుపుటూరి శ్రీనివాస్

ఉపయుక్తగ్రంథసూచి

అంతర్జాల వనరులు

- పారిజాతాపహరణము – మూలపాఠము

  (https://andhrabharati.com/kAvyamulu/pArijAtApaharaNamu/index.html)

- ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ముద్రించిన 'పారిజాతాపహరణము' (నాగపూడి కుప్పుస్వామయ్యగారి పరిమళోల్లాసవ్యాఖ్యతో కూడియున్నది.)

  (https://archive.org/download/in.ernet.dli.2015.385637/2015.385637.Parijathapaharnam.pdf)

- వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్ ప్రచురించిన 'పారిజాతాపహరణము' (దూశి రామమూర్తిశాస్త్రిగారి సురభివ్యాఖ్యాసహితము) (https://archive.org/download/in.ernet.dli.2015.385649/2015.385649.Parijathapaharanamu.pdf)

- చన్నాప్రగడ తిరుపతిరావుగారి 'పారిజాతాపహరణము జగన్నాథవిజయముతో తులనాత్మకానుశీలనము' (https://archive.org/download/in.ernet.dli.2015.391147/2015.391147.Parijtapaharanamu.pdf)

- ఆరుద్రగారి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం-2' (https://archive.org/details/SamagrandhraSahityam/)

- వి.ఎమ్.కులకర్ణి రచించిన పరిశోధనాపత్రం 'Hari Vijaya of Sarvasena' (https://www.jstor.org/stable/41691739)

- క్రిస్టఫర్ ఆస్టిన్ రచించిన పరిశోధనాపత్రం 'The Fructification of the tale of a Tree: The Parijatapaharana in the Harivamsa and its appendices (https://www.jstor.org/stable/10.7817/jameroriesoci.133.2.0249)

అచ్చు పుస్తకాలు

- 'పారిజాతాపహరణము' (అద్దంకి శ్రీనివాస్ గారి లఘుటీకతో; ఎమెస్కో ప్రచురణ)
- హర్షిత మ్రుత్తింటి కామత్, వెల్చేరు నారాయణరావు గారల ఆంగ్లానువాదం 'Theft of a Tree' (హార్వర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురణ)
- బేతవోలు రామబ్రహ్మం గారి పద్యకవితాపరిచయం (అజోవిభో ప్రచురణ)
- కాత్యాయనీ విద్మహే గారి 'ప్రాచీనసాహిత్యం మరో చూపు' (జిజ్ఞాస ప్రచురణ)
- తాపీ ధర్మారావు గారి 'సాహిత్య మొర్మరాలు' (విశాలాంధ్ర ప్రచురణ)